


సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 15 | సంచిక: 205

SUNDAY Special

ఆదివారం 16-10-2022



పాక్ అత్యంత ప్రమాదకర దేశం

ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన దేశాల్లో పాకిస్తాన్ ఒకటని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అన్నారు. దీనిపై విస్మయం వ్యక్తం చేసిన పాక్.. తమ దేశంలోని అమెరికా రాయబారికి సమన్లు పంపింది.

- వివరాలు 6లో ▸



మనదే ఆసియా కప్

భారత మహిళల క్రికెట్ జట్టు ఆసియా కప్ టీ20 టోర్నీలో చాంపియన్‌గా నిలిచింది. ఫైనల్‌లో శ్రీలంకపై 8 వికెట్ల తేడాతో గెలిచి.. ఏడోసారి టైటిల్‌ను సొంతం చేసుకుంది. ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ అవార్డు దీప్తిశర్మకు లభించింది.

- వివరాలు 12లో ▸

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



వికేంద్రీకరణకు మద్దతుగా

గర్జించిన విశాఖ

జోరువానలో జన సునామీ.. విశాఖ గర్జన సూపర్ సక్సెస్

కుండపోతను లెక్కచేయని జన ప్రవాహం

2లో

- తడిసి ముద్దవుతూ కొందరు.. గొడుగులు చేతబట్టి మరికొందరు..
- పద పద మంటూ ముందుకు అడుగులు
- విశాఖ వీధుల్లో కదం తొక్కిన యువత
- ఉత్తరాంధ్ర జోలికొస్తే ఉప్పు పాతరేస్తామని గర్జన
- జేఏసీ పోరాటానికి వైఎస్సార్‌సీపీ సంపూర్ణ మద్దతు.. ఇతర పార్టీలూ కలిసి రావాలని జేఏసీ నేతల పిలుపు

ఒకవైపు సముద్రం హోరు.. ఇంకో వైపు వర్షం జోరు.. మరో వైపు ఈ రెండింటితో పోటీపడుతూ జన గర్జన పోరు.. వికేంద్రీకరణ కోసం ఉద్యమ కెరటం ఉప్పెనలా ఉవ్వెత్తున ఎగిసింది. పరిపాలన రాజధానికి 'విశాఖ గర్జన' జైకొట్టింది. వరుణ దేవుడి సాక్షిగా అశేష జనవాహిని గర్జనతో విశాఖ దిక్కులు పిక్కటిల్లాయి. థింసా నృత్యం, చెక్కభజన, కొమ్ము నృత్యం, కోలాటం, తప్పెటగుళ్లు వంటి ఉత్తరాంధ్ర ప్రత్యేక సాంస్కృతిక ప్రదర్శనల నడుమ ఆద్యంతం వికేంద్రీకరణ నినాదాలు హోరెత్తాయి. పాలన రాజధానిగా విశాఖను వ్యతిరేకిస్తే ఖబడ్దార్.. అంటూ ఉత్తరాంధ్ర జనం నిప్పులు చెరిగారు.

పరిపాలన రాజధాని వచ్చే వరకు విశ్రమించం

- ఇంకోసారి నష్టపోకుండా వచ్చిన అవకాశాన్ని కాపాడుకుందాం
- విశాఖ గర్జన సభలో మంత్రులు, జేఏసీ నేతలు

10లో



వర్షంలో తడుస్తూనే ప్రసంగిస్తున్న మంత్రి బొత్స.. చిత్రంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, నాయకులు

మంత్రుల కార్లపై జనసేన దాడి

- ఎయిర్‌పోర్టుకు వెళుతుండగా సీసాలు, కర్రలతో రెచ్చిపోయిన రౌడీ మూకలు
- ఒంటరిగా వెళ్తున్న వారిపై ముందస్తు ప్రణాళికతోనే దాడి
- 'విశాఖ గర్జన' విజయవంతంతో డైవర్షన్ పాలిటిక్స్ నాటకం



జనసేన రౌడీ మూకల దాడిలో గాయపడ్డ వ్యక్తి

- వివరాలు 2లో ▸

వైఎస్సార్‌సీపీ నేత దారుణ హత్య



అన్నమయ్య జిల్లా మైసూరువారిపల్లె మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేత దివిటి రామ్మోహన్ దారుణ హత్యకు గురయ్యారు. ఇంటి వరండాలో కూర్చున్న ఆయన్ని.. గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు మాస్కులు ధరించి కత్తులతో నరికారు.

- వివరాలు 3లో ▸

సాయిబాబా విడుదలకు సుప్రీంకోర్టు నో



మావోయిస్టులతో సంబంధాల కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ సాయిబాబాను నిర్దోషిగా విడుదల చేస్తూ బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సస్పెండ్ చేసింది. నేర తీవ్రతను పరిగణనలోకి తీసుకోకుండా హైకోర్టు తీర్పునిచ్చిందంటూ తప్పుబట్టింది.

- వివరాలు 6లో ▸


నిర్మాత మురారి మృతి



ప్రముఖ నిర్మాత కాట్రగడ్డ మురారి శనివారం రాత్రి గుండెపోటుతో చెన్నైలో కన్నుమూశారు. ఆయన మృతి పట్ల సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు. అంత్యక్రియలు ఆదివారం చెన్నైలో జరగనున్నాయి.

- వివరాలు 12లో ▸

మహోగ్ర 'కృష్ణా'



'శ్రీశైలం' నుంచి దిగువకు కృష్ణమ్మ పరవళ్లు

- ప్రకాశం బ్యారేజ్‌లోకి 4.53 లక్షల క్యూసెక్కుల ప్రవాహం
- మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- బ్యారేజ్ నుంచి 4.50 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి
- జూన్ 1 నుంచి ఇప్పటివరకు ప్రకాశం బ్యారేజ్ నుంచి వెయ్యి టీఎంసీలు కడలిలోకి
- గతంలో 3 లక్షల క్యూసెక్కులకు మించితే విజయవాడ లోతట్టు ప్రాంతాల ప్రజల్లో వణుకు
- రక్షణ గోడ పూర్తవ్వడంతో తొలగిన ముంపు ముప్పు

14లో

పెన్నాలో మరింత పెరిగిన వరద

అప్పర్ పెన్నార్ నుంచి నెల్లూరు బ్యారేజ్ వరకూ ప్రాజెక్టుల గేట్లన్నీ బార్లా

14లో

ఏపీకి తుపాను ముప్పు

- అండమాన్‌లో 20న అల్పపీడనం
- 24, 25 తేదీల్లో తుపానుగా మారే అవకాశం
- ఒడిశా, ఏపీ మధ్య తీరం దాటుతుందని అంచనా

3లో

క్లుప్తంగా

అబ్దుల్ కలాం దేశానికి స్ఫూర్తిదాయకం

సీఎం వైఎస్ జగన్



సాక్షి, అమరావతి : యువత కలలు కనాలి.. ఆ కలలను సాకారం చేసుకునేందుకు కష్టపడాలి.. అన్న కలాం మాటలు ఈ దేశానికి స్ఫూర్తి అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మేన్, భారతరత్న, ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా వారికి ఘన నివాళి అంటూ ట్వీట్ చేశారు.

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ..
వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఏపీజే భారతరత్న అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. కలాం చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ, వైఎస్సార్‌పీపీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకుడు లేళ్ల అప్పిరెడ్డి, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.మనోహరరెడ్డి, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు షేక్ ఆసిఫ్, కొమ్మూరి కనకారావుమాదిగ, అడపాశేషు, వెంకటనారాయణ, వైఎస్సార్‌సీపీ కృష్ణా జిల్లా డాక్టర్స్‌సెల్ అధ్యక్షుడు డాక్టర్ మహబూబ్ పాల్గొన్నారు.

భారత మహిళా క్రికెట్ జట్టుకు సీఎం జగన్ అభినందనలు

సాక్షి, అమరావతి : బంగ్లాదేశ్‌లోని సిల్హెట్‌లో జరిగిన ఫైనల్స్‌లో శ్రీలంకపై ఎనిమిది వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించి ఆసియా కప్‌ను గెలుచుకున్న భారత మహిళా క్రికెట్ జట్టును సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. ఏడోదికోసారి ఆసియా టైటిల్‌ను కైవసం చేసుకున్న భారత జట్టు భవిష్యత్ ఈవెంట్‌లలో విజయాల పరంపర కొనసాగించాలని సీఎం జగన్ ఆకాంక్షించారు.

21న అసైన్డ్ భూముల కమిటీ సమావేశం

సాక్షి, అమరావతి: అసైన్డ్ భూములను అమ్ముకునే హక్కు కల్పించే విషయంపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజాప్రతినిధులతో ఏర్పాటు చేసిన కమిటీ సమావేశం 21వ తేదీన జరుగనుంది. రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు నేతృత్వంలో 13 మంది మంత్రులు, ఎమ్మెల్యేలతో ఇటీవల కమిటీని ఏర్పాటు చేసింది. అసైన్డ్ భూములను అమ్ముకునే హక్కు కల్పించాలంటూ..తమకు పెద్ద ఎత్తున విజ్ఞప్తులు వస్తున్నాయని పలు జిల్లాల కలెక్టర్లు ప్రభుత్వానికి నివేదించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసి.. నెలలో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

గర్జించిన విశాఖ

జోరువానలో జన సునామీ.. వికేంద్రీకరణకు జైకొట్టిన ప్రజలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం/ సాక్షి, విశాఖపట్నం/ దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ) : వికేంద్రీకరణకు మద్దతుగా చేపట్టిన విశాఖ గర్జన అంచనాలకు మించి విజయవంతమైంది. విశాఖపట్నానికి పరిపాలన రాజధానిగా చేయాలన్న నినాదం మిన్నంటింది. నాన్ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన విశాఖ గర్జన పాదయాత్ర, సభ ఆద్యంతం భారీ వర్షంలోనే కొనసాగింది. ఒకే రాజధాని వద్దు.. మూడు రాజధానులు ముద్దు.. అనే నినాదాలతో పాదయాత్ర హోరెత్తింది. ఉదయం 9 గంటలకే ఎల్ఐసీ బిల్డింగ్ వద్ద గర్జన హడావుడి ప్రారంభం కాగా.. మొదట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి జేఏసీ చైర్మన్ లజపతిరాయ్‌తో పాటు పలువురు మంత్రులు నివాళులు అర్పించిన అనంతరం పాదయాత్ర ప్రారంభమైంది. ఎల్ఐసీ బిల్డింగ్ నుంచి 10.30 గంటలకు ప్రారంభమైన పాదయాత్ర సెవన్‌హిల్స్ హాస్పిటల్ మీదుగా సర్క్యూట్ హౌస్, సిరిపురం జంక్షన్, పెదవాల్తేరు ఆంధ్రా యూనివర్సిటీ గేటు నుంచి బీచ్ రోడ్డులోని పార్కు హోటల్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం వరకు 3.7 కిలోమీటర్ల మేర పాదయాత్ర మొత్తం వర్షంలోనే సాగింది. ఇసుకవేస్తే రాలనంతగా జన సందోహం మధ్య పాదయాత్ర గంటకుపైగా సాగింది. అక్కడ దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం గర్జన సభ మొదలైంది. రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షంలోనూ ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి జనం భారీగా హాజరయ్యారు. వికేంద్రీకరణలో భాగంగా విశాఖకు జై కొట్టారు. భారీగా కురుస్తున్న వర్షం తమను ఆశీర్వదిస్తున్నట్టుగా ఉందని ఆనందపడ్డారు. ఉత్తరాంధ్ర జోలికొస్తే ఉప్పు పాతరేస్తామని హెచ్చరించారు. ఈ గర్జనతోనైనా చంద్రబాబు, పవన్‌లకు కనువిప్పు కలగాలని ఆకాంక్షించారు. ఇప్పటికే రాష్ట్రాన్ని మూడుసార్లు విభజించారని.. మళ్లీ అమరావతి మాత్రమే రాజధాని అంటే భవిష్యత్‌లోనూ ఇబ్బందులు తప్పవని జేఏసీ నేతలు అభిప్రాయపడ్డారు. తమ పోరాటానికి అన్ని రాజకీయ పక్షాలు కలిసి రావాలని జేఏసీ



విశాఖ గర్జనకు హాజరైన అశేష జన సందోహంలోని ఓ భాగం

పిలుపునిచ్చింది. ఏ కార్యక్రమం నిర్వహించినా తాము మద్దతు ఇస్తామని వైఎస్సార్‌సీపీ ప్రకటించింది. మొత్తంగా సముద్రపు కెరటాల్లా ఎగసిపడ్డ జన సమూహం.. విశాఖకు జై కొట్టింది.

భారీగా పాల్గొన్న యువత

ప్రధానంగా ఇన్ని రోజులుగా ఉత్తరాంధ్ర వెనుకబాటులో ఎక్కువగా నష్టపోయింది యువతే. ఈ నేపథ్యంలో పాలన వికేంద్రీకరణ ద్వారా పరిపాలన రాజధానిగా విశాఖ అవతరిస్తే ఇటు విద్యా రంగంతో పాటు ఉపాధి రంగంలోనూ కొత్త అవకాశాలు వస్తాయన్న ఆశ వారి మాటల్లో ధ్వనించింది. తద్వారా ఉద్యోగాల కోసం పొట్ట చేత పట్టుకుని ఎక్కడికో పోవాల్సిన అవసరం ఉండదన్న అభిప్రాయం వారిలో వ్యక్తమైంది. ర్యాలీలో వర్షం జోరులో చిందేస్తూ.. జై విశాఖ అని నినదిస్తూ యువతీ, యువకులు పోటీపడుతూ నినాదాలతో హోరెత్తించారు. పాలిటెక్నిక్ కాలేజీతో పాటు డిగ్రీ, పీజీ విద్యార్థులు విశాఖ గర్జనలో భారీగా పాల్గొన్నారు. విశాఖ పరిపాలన రాజధాని అయితే తమ బతుకులు మారతాయని.. ఉద్యోగాలకు వలస వెళ్లాల్సిన బాధలు తప్పుతాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. యువకులతో పోటీ పడి మరీ యువతులు చిందేస్తూ నినాదాలతో పాదయాత్ర కొనసాగించడం విశేషం.

తీన్‌మార్ డప్పులు.. కోబ్రా డ్యాన్స్‌లు..

సాగరతీరాన ఉత్తరాంధ్ర ఆవేదన కడలి ఘోషలా మారింది. విశాఖ పరిపాలన రాజధాని వద్దంటూ..తమ ప్రాంతంపైకి దండయాత్రగా వస్తున్న వారికి వ్యతిరేకంగా, ఉత్తరాంధ్ర ప్రజానీకం.. కళాకారులు కడలి తరంగంలా ఎగసిపడ్డారు. విశాఖకు పరిపాలన రాజధాని వద్దంటే..పరిణామాలు మునుపటిలా ఉండవని సత్తా చూపారు. 'గురజాడ, శ్రీశ్రీ, వంగపండు ప్రసాదరావు, రావిశాస్త్రి వంటి గొప్ప వారిని కన్న నేల ఉత్తరాంధ్ర. అలాంటి మా ప్రాంతానికి రాజధాని వద్దా? ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధి మీకు పట్టదా? అమరావతి రాజధాని పేరిట మాపై దండయాత్రకు వస్తారా? మాకు కడుపు మండదా? అంటూ నిప్పులు చెరిగారు. ఉత్తరాంధ్ర కళాకారులు పాటలు, నృత్యాలు, జానపద గేయాలు, గిరిజన నృత్యాలు, బిందెలు తలపై ఉంచుకుని డ్యాన్స్‌లతో ప్రదర్శననిస్తూ.. అందరూ బాగుండాలి.. అందులో మేముండాలంటూ నినదించారు. 'మన విశాఖ.. మన రాజధాని' పేరిట నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు వెల్లివిరిశాయి. తప్పెటగుళ్లతో ఉత్తరాంధ్ర వెనుకబాటును వివరిస్తూ కళాకారుల ప్రదర్శన పలువురి మన్ననలు పొందింది. పులి వేషధారణతో కళాకారులు ఇచ్చిన ప్రదర్శన ఆకట్టుకుంది. పొడుగాటి మనుషుల మంటూ కాళ్లకు కర్రలు కట్టుకుని..నెత్తిన బిందెలు పెట్టుకుని వేసిన బిందెల డ్యాన్స్‌లు మురిపించాయి. పాముల వేషాలతో రెల్లి కులస్తులు వేసిన కోబ్రా డ్యాన్స్‌కు యువత సై కొట్టింది. కళాకారులతో పాటు యువత కూడా ఆ నృత్యంలో భాగస్వాములై పలువుర్ని ఆశ్చర్యానికి గురి చేశారు. తీన్‌మార్ డప్పులు.. కాంగో డప్పులతో విద్యార్థులు కేరింతలు కొట్టారు. కళాకారులు వాయించిన డప్పులకు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నృత్యాలు చేస్తూ విశాఖ గర్జనలో పలువురు పాలు పంచుకున్నారు. గిరిజనుల కోయ డ్యాన్సులు.. ఖాళీమాతా డ్యాన్సులు.. అష్టలక్ష్మి నృత్యాలు గర్జనకు తోడయ్యాయి.



విశాఖ గర్జనకు భారీ ర్యాలీగా తరలివస్తున్న జన సందోహం..

ఎటు చూసినా జన ప్రభంజనమే

విశాఖలో శనివారం ఎటు చూసినా జన ప్రభంజనమే కనిపించింది. దీనికి భారీ వర్షం తోడు కావడంతో వీధులు, రోడ్లు 'జన' 'సంద్రం'గా మారాయి. గత కొన్ని దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో ఏ ఉద్యమానికి రానంతగా విశాఖ గర్జనకు జనం పోటెత్తి సరికొత్త చరిత్ర సృష్టించారు. అంబేడ్కర్ సర్కిల్‌లో గంటన్నరకు పైగా జనం వర్షంలో నిల్చుని మన విశాఖ.. మన రాజధాని అంటూ నినదించారు. సర్వమత ప్రార్థనల అనంతరం జోరు వానలో తడిసి ముద్దవుతూ కొందరు.. గొడుగులు చేతబట్టి మరికొందరు అడుగులు ముందుకేశారు. 'విశాఖే పరిపాలన రాజధాని' అన్న నినాదాలతో ఉన్న జెండాలు ర్యాలీ పొడవునా రెపరెపలాడాయి. విశాఖ నగరంలో 9 సెంటీమీటర్ల భారీ వర్షం కురవడం గమనార్హం.

అడుగడుగునా అదే ఆకాంక్ష

విశాఖ గర్జనలో ఆసాంతం వికేంద్రీకరణ ఆకాంక్ష స్పష్టంగా కనిపించింది. ఓ వైపు భారీ వర్షం కురుస్తున్నప్పటికీ ఉత్తరాంధ్ర నలుమూలల నుంచీ జనం ఉదయమే బయలుదేరారు. పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు దాటుకుని.. నిలువెల్లా తడుస్తూ తమ ఆకాంక్షను బలంగా చాటారు. ఉదయం 9 గంటలకే ఎల్ఐసీ బిల్డింగ్ జంక్షన్ వద్ద కోలాహలం మొదలైంది. ఉత్తరాంధ్ర ప్రత్యేక సాంస్కృతిక ప్రదర్శనలతో విశాఖ గర్జన ప్రారంభమైంది. ర్యాలీ ప్రారంభమైన తర్వాత వర్షం జోరు మరింత పెరిగింది. అయినప్పటికీ వర్షంలో తడుస్తూనే పాదయాత్ర కొనసాగించారు. కొద్ది మంది గొడుగులు పట్టుకుని పాదయాత్రకు రాగా.. ప్రధానంగా యువత మాత్రం వర్షంలో నినాదాలు చేస్తూ ముందుకు అడుగులు వేశారు. విద్యార్థులు, న్యాయవాదులు, విద్యుత్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రైతులు, కార్మికులు... ఇలా అన్ని వర్గాల వారు విశాఖ గర్జనలో తమ నినాదాన్ని వినిపించారు. ఎక్కడికక్కడ పాదయాత్రకు స్థానిక విశాఖ జనం సాదరంగా ఆహ్వానం పలికారు.



జోరువానలో గొడుగులతో..

మంత్రుల కార్లపై.. జనసేన రౌడీమూకల దాడి

- సీసాలు, కర్రలు, చెప్పులతో రెచ్చిపోయిన మూకలు
- మంత్రులు, మహిళలు అని చూడకుండా విచ్చలవిడిగా దాడి
- వాహనాలను చుట్టుముట్టి కర్రలతో కొడుతూ.. రాళ్లు విసురుతూ నానా బీభత్సం
- పైనుంచి వచ్చిన ఆదేశాలు, ముందస్తు ప్రణాళికతోనే దాడి
- 'విశాఖ గర్జన' విజయవంతంతో డైవర్షన్ పాలిటిక్స్ నాటకం
- 20మందిపై కేసులు నమోదు.. పలువురి అరెస్టు?





విశాఖ విమానాశ్రయంలో ధ్వంసమైన పూల కుండీలు ; ఎరైవల్ గేటుకు ఎదురుగా ఉన్న బ్యానర్‌ను చించేసి ఎక్కి కూర్చున్న జనసేన రౌడీమూకలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: విశాఖ విమానాశ్రయం వద్ద జనసేన రౌడీమూకలు వీరంగం సృష్టించారు. రాష్ట్ర మంత్రులపై దాడులకు తెగబడ్డారు. కర్రలు, వాటర్ బాటిళ్లు, చెప్పులు విసురుతూ తెగ రెచ్చిపోయారు. మంత్రుల భద్రతా సిబ్బంది వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించినప్పటికీ.. వారిపై కూడా విచక్షణారహితంగా దాడి చేశారు. వారి వాహనాలను చుట్టుముట్టి, కర్రలతో కొడుతూ, రాళ్లు విసురుతూ నానా బీభత్సం సృష్టించారు. మంత్రులు, మహిళలు అని ఏమాత్రం కూడా చూడకుండా జనసేన రౌడీమూకలు రెచ్చిపోయారు. దాడిచేస్తున్న సమయంలో వీరి ధోరణి చూస్తే.. పైనుంచి వచ్చిన ఆదేశాల మేరకే పక్కా ప్రణాళిక ప్రకారం నడుచుకున్నట్లు స్పష్టంగా కనిపించింది. ఇక ఈ కేసు విషయంలో శనివారం రాత్రి జనసేనకు చెందిన పలువురిని అరెస్టుచేసినట్లు సమాచారం.

'విశాఖ గర్జన' కార్యక్రమాన్ని ముగించుకుని విజయవాడకు వెళ్లేందుకు విమానాశ్రయానికి విడివిడిగా చేరుకున్న మంత్రులు మేరుగు నాగార్జున, జోగి రమేష్, రోజా, విడదల రజని.. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి కార్లపై ఈ అల్లరి మూకలు విచక్షణారహితంగా దాడులకు దిగాయి. ఎయిర్‌పోర్ట్ వద్ద ఉన్న చెత్తకుండీపైనున్న స్టీల్ మూతతో దాడిచేయగా మంత్రి రోజా వ్యక్తిగత సిబ్బందిలోని ఒకరి తలకు బలంగా గాయమైంది. దీంతో 15 నిమిషాల పాటు విమానాశ్రయం వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇంతలో విమానాశ్రయ భద్రతా సిబ్బంది అక్కడకు చేరుకుని మంత్రులను సురక్షితంగా ఎయిర్‌పోర్టులోకి తీసుకెళ్లారు. వికేంద్రీకరణకు మద్దతుగా విశాఖ గర్జన కార్యక్రమం భారీ వర్షంలోనూ జన సందోహంతో విజయవంతం కావడంతో డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే జనసేన రౌడీమూకలు దాడికి యత్నించినట్లు స్పష్టమవుతోంది. మరోవైపు.. విశాఖ నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్, అదనపు కమిషనర్ (ఎస్‌బీ) ఆనందరెడ్డి విమానాశ్రయానికి చేరుకుని విచారణ చేపట్టారు.

20 మందిపై కేసు నమోదు

విమానాశ్రయంలో మంత్రి రోజా అనుచరుడు దిలీప్‌పై దాడిచేసినందుకు జనసేన రౌడీమూకలపై 307, 324, రెడ్‌విత్ 149 సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే, పోలీసులు విధులకు ఆటంకం కలిగించినందుకు పెందుర్తి సీఐ నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు 353 సెక్షన్ కింద కేసు పెట్టారు. ఈ రెండింటిలోనూ మొత్తంగా 20 మంది జనసేన కార్యకర్తలపై కేసులు నమోదు చేశారు.

విశాఖపై విషం..
వాస్తవానికి విశాఖపట్నం జిల్లాలోని గాజువాక నియోజకవర్గం నుంచి 2014 సార్వత్రిక ఎన్నికల్లో పవన్ పోటీచేశారు. అయితే, ఆయనకు ఇక్కడి ప్రజలు బుద్ధిచెప్పారు. దీంతో అప్పటినుంచి ఆయన.. అవకాశం ఉన్నప్పుడల్లా విశాఖపై విషం చిమ్ముతూనే ఉన్నారు. మొదటగా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై కనీసం స్పందించని పవన్.. 'నన్ను గెలిపించారా? నేను మాట్లాడడానికి' అని ఎదురు ప్రశ్నించారు. ఇప్పుడు పరిపాలన రాజధాని కోసం చేపట్టిన విశాఖ గర్జన కార్యక్రమానికి పోటీగా జనవాణి పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్లాన్ చేసుకున్నారు. పక్కా ప్రణాళిక ప్రకారమే విశాఖపై విషం చిమ్మేందుకు టీడీపీ డైరెక్షన్‌లో జనసేన నేత ముందుకెళ్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ముందస్తు ప్రణాళికతోనే..
వికేంద్రీకరణకు మద్దతుగా విశాఖ గర్జన కార్యక్రమాన్ని అక్టోబరు 15న నిర్వహిస్తున్నట్లు నాన్ పొలిటికల్ జేఏసీ ప్రకటించింది. ఇందుకు వైఎస్సార్‌సీపీ కూడా మద్దతు పలికింది. అయితే, అప్పటివరకు కనీసం విశాఖపట్నం కార్యక్రమాన్ని అధికారికంగా ప్రకటించని పవన్.. హడావుడిగా జనవాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అది కూడా అక్టోబరు 16న నిర్వహించే కార్యక్రమానికి 15నే విశాఖకు వస్తున్నట్లు టూర్ షెడ్యూల్ ప్రకటించారు. దీనిపై అప్పట్లోనే వైఎస్సార్‌సీపీ నేతలు అనుమానం వ్యక్తంచేశారు. విశాఖ గర్జన కార్యక్రమం రోజునే ఎందుకు విశాఖ వస్తున్నారని.. కార్యక్రమాన్ని వాయిదా వేసుకోవాలని కోరారు. అయినప్పటికీ మొదటగా 15వ తేదీ మ.3.30 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారని జనసేన నేతలు ప్రకటించారు. ఆ తర్వాత టైం మారిపోయింది. సరిగ్గా విశాఖపట్నం నుంచి విజయవాడకు ఉన్న ఒకే ఒక విమాన సర్వీసు సమయంలోనే ఆయన విశాఖలో ల్యాండ్ అయ్యారు. అదే సమయంలో విశాఖ గర్జన ముగించుకుని విమానాశ్రయానికి చేరుకున్న వైవీ సుబ్బారెడ్డి, మేరుగు నాగార్జున, జోగి రమేష్, రోజా, రజని కార్లపై దాడికి యత్నించారు.

జనసేన రౌడీమూకలపై మంత్రుల ఆగ్రహం

విశాఖపట్నం విమానాశ్రయంలో జనసేన రౌడీమూకలు వీరంగం సృష్టించడంపై రాష్ట్ర మంత్రులు మేరుగు నాగార్జున, ఆర్కే రోజా, విడదల రజని తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. విశాఖ నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న మంత్రులు మీడియాతో మాట్లాడుతూ.. జనసేన కార్యకర్తల తీరును తీవ్రంగా తప్పుబట్టారు. రాష్ట్రంలోని మూడు ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయాలనే ఆకాంక్షతో సీఎం వైఎస్ జగన్ పరిపాలన సాగిస్తున్నారని.. ఇది తట్టుకోలేని ప్రతిపక్షనేత చంద్రబాబుతో పాటు పవన్‌కళ్యాణ్ రాష్ట్రంలో అల్లర్లు సృష్టించేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఉత్తరాంధ్ర ఉద్యమానికి మద్దతుగా వెళ్లిన ఉమ్మడి విశాఖ జిల్లా రీజనల్ కోఆర్డినేటర్, మంత్రుల కార్లపై దాడిచేయడం దారుణమన్నారు. అఘాయిత్యాలు, అమానుషాలు చేసి ప్రజలను భయపెట్టి గెలవాలనుకోవడం పవన్ అవివేకమన్నారు. తాము కూడా అలాగే ప్రవర్తిస్తే జనసేన మూకలు కనిపించరని వారు తెలిపారు. పవన్‌కు అమరావతి మాత్రమే కావాలనుకుంటే స్పష్టంగా చెప్పాలని సూచించారు. ఆయన బలమేమిటో 2019 ఎన్నికల్లోనే తెలిసిపోయిందని.. ఇప్పటికైనా పవన్‌కళ్యాణ్ వీలుంటే సినిమాలు తీసుకోవాలని.. ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడితే సహించేదిలేదని మంత్రులు హెచ్చరించారు. జనసేన రౌడీమూకలు రాళ్లు, కర్రలతో తమ కార్లపై విరుచుకుపడడంతో ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యామని.. ఎంత బతిమలాడినా వినకుండా కార్లపై రాళ్లు, కర్రలు విసిరారని వారు వివరించారు. దాదాపు 20 నిమిషాలపాటు నరకాన్ని ప్రత్యక్షంగా చూశామన్నారు. ఈ దాడికి పవన్ కళ్యాణ్ బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు.

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

విశాఖ విమానాశ్రయ వద్ద సంఘటన జరిగిన తీరును పరిశీలించాం. అక్కడ సీసీ కెమెరాల దృశ్యాలనూ చూశాం. దాడి జరిగిన తీరును, అందుకు బాధ్యులపై న్యాయపరంగా ముందుకెళ్తాం. నిర్వాహకులు ర్యాలీకి ఎటువంటి అనుమతి పొందలేదు. అయినప్పటికీ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ నిబంధనలకు విరుద్ధంగా రోడ్ల మీద ప్రదర్శన చేశారు. దీనిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

– శ్రీకాంత్, నగర పోలీసు కమిషనర్

దాడులపై ఎవరేమన్నారంటే..



జనసేన రౌడీమూకల, అరాచక శక్తుల వికృత చేష్టలు, భౌతిక దాడులను వైఎస్సార్‌సీపీ సహించదు. భవిత్యత్తులో ఇలాంటివి పునరావృతం అయితే చూస్తూ ఊరుకోం. – వి. విజయసాయిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి



మంత్రుల కార్లపై దాడికి పాల్పడిన జనసేన రౌడీమూకలు, అందుకు ప్రోత్సహించిన వారిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. దాడికి పాల్పడడం హేయమైన చర్య.

– తానేటి వనిత, హోంమంత్రి



పవన్‌కళ్యాణ్ ఉన్మాదాన్ని ప్రేరేపిస్తూ యువతను రెచ్చగొడుతున్నారు. మొదట్నుంచీ హింసావాదాన్ని రెచ్చగొట్టడం ఆయనకు పరిపాటిగా మారిపోయింది. విద్వేషాలు రెచ్చగొట్టాలనే ఉద్దేశంతోనే పవన్ విశాఖకు వెళ్లారు.

– కొట్టు సత్యనారాయణ, డిప్యూటీ సీఎం



ఎప్పుడూ సుద్దులు చెప్పే పవన్‌కళ్యాణ్ తక్షణం దీనిపై స్పందించాలి. ఒక్క సీటు కూడా లేకపోతేనే జన సైనికులు ఇలా ఉంటే, మరి ఐదారు సీట్లు వస్తే రాష్ట్రాన్ని ఏం చేస్తారో. – అంబటి రాంబాబు, జల వనరుల శాఖ మంత్రి



జనసేన అల్లరిమూకలను పవన్ అదుపు చేసుకోకపోతే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుంది. మేం తలుచుకుంటే రాష్ట్రంలో నీవు తిరగగలవా? మా నాయకులకు క్షమాపణ చెప్పకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుంది.

– సామినేని ఉదయభాను, ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే

అది గర్జన ఉద్యమంపై దాడి

- ఎయిర్‌పోర్ట్‌లో మంత్రులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం
- ఈ దాడికి బాధ్యత వహిస్తూ పవన్‌కళ్యాణ్ బహిరంగ క్షమాపణ చెప్పాలి
- జనసేన సైకో పార్టీ... ఆ పార్టీ కార్యకర్తలు మరింత సైకోల్లా ప్రవర్తిస్తున్నారు
- ఇంట గెలవలేని నీకు పార్టీ ఎందుకు? రాజకీయాలెందుకు?
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ధ్వజం



సాక్షి, విశాఖపట్నం: ఎయిర్‌పోర్ట్‌లో మంత్రులపై జరిగిన దాడిని విశాఖ గర్జనపై జరిగిన దాడిగా పరిగణిస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ఈ దాడికి బాధ్యత వహిస్తూ.. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఉత్తరాంధ్ర ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆయనకు ఉత్తరాంధ్ర ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. శనివారం ఆయన స్థానిక సర్క్యూట్ హౌస్‌లో మీడియాతో మాట్లాడారు. ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విశాఖను పాలనా రాజధానిగా చేయాలన్న నినాదంతో శనివారం నిర్వహించిన విశాఖ గర్జన కార్యక్రమాన్ని అన్ని టీవీ ఛానళ్లు, జాతీయ వార్తా సంస్థలు ప్రధానంగా చూపిస్తుండటం చూసి ఓర్వలేక ఈ ఉద్యమాన్ని పక్కదోవ పట్టించేందుకు పవన్ కళ్యాణ్ రంగంలోకి దిగారని మండిపడ్డారు. ఉద్యమానికి నాలుగు రోజుల ముందు నుంచే పవన్ కళ్యాణ్ వైజాగ్ వస్తారని తెలిసి, అతని పర్యటనను వాయిదా వేసుకోవాలని విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదన్నారు. విశాఖ వచ్చి ఉద్రిక్తతను సృష్టించారని, తద్వారా మీడియా దృష్టిని తన వైపునకు మరల్చుకుని, ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షల పై నీళ్లు చల్లే ప్రయత్నం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి అమర్‌నాథ్ ఇంకా ఏమన్నారంటే..

ఇక ఫ్లవర్ కళ్యాణ్ అనాలి..

- తనకు, తన పార్టీకి నష్టం వాటిల్లినా పర్వాలేదు కానీ చంద్రబాబుకు మంచి జరగాలన్న లక్ష్యంతో పవన్ కళ్యాణ్ పని చేస్తున్నారు.
- గతంలో ఒక పత్రికా కార్యాలయం ఎదుట ధర్నా చేస్తూ అడ్డొచ్చిన వారికి గన్ చూపించిన పవన్ కళ్యాణ్ నైజం ఎలాంటిదో తెలుసుకోవచ్చు.
- ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షలను సమర్థించని పవన్.. విశాఖ వచ్చి ప్రజల చెవుల్లో పూలు పెడుతున్నారు. అందుకే ఆయన్ను పవన్ కళ్యాణ్ అని కాకుండా.. ఫ్లవర్ కళ్యాణ్ అని పిలిస్తే బావుంటుంది. గత ఎన్నికల్లో ఓడించారని ఈ ప్రాంతంపై కక్షకట్టి విధ్వంసం సృష్టిస్తున్నారు.
- సైకో పార్టీకి సైకో కార్యకర్తలే ఉంటారు. జనసేన పార్టీకి సిద్ధాంతాల్లేవు.. ఒక స్టాండ్ లేదు.. వ్యక్తిత్వం లేదు.. ఒక లక్ష్యం లేదు.. ఆకతాయి కార్యకర్తలు.. జనసేన పార్టీ నాయకుడే ఒక ఆకతాయి.. ఏ ప్రాంతానికి వెళితే ఆ ప్రాంతం రాజధానంటావు.. ఊసరవెల్లిలా మాటలు మారుస్తావు.. నీకెందుకు పార్టీ? నీకెందుకు రాజకీయం? ఇంట గెలవని పవన్‌కళ్యాణ్ రాష్ట్రాన్ని ఏమి ఉద్ధరిస్తాడు? పెళ్లి అనేది ఒక సర్దుబాటు జీవితం. అందులో ఇమడలేని వాడివి ప్రజా జీవితంలో ఎలా నెగ్గుకువస్తావు? పెళ్లాంతో కాపురం చేయలేని వాడు.. రాజకీయ పార్టీ పెట్టి ప్రజలను ఏవిధంగా పరిపాలిస్తాడు? అందుకే ఆ ఫ్రస్టేషన్ అంతా చూపిస్తున్నావు.

ఈ సైకో పనులేమిటి?

- ఈ సైకో పనులు ఏమిటి? మంత్రులు, నాయకుల మీద దాడి ఏమిటి? వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు తల్చుకుంటే మీరు కనీసం ఒక్క నిమిషం ఉండగలరా? మా ఫ్లెక్సీలు చింపడం ఏమిటి? అసలు నాయకుడికి క్యారెక్టర్ ఉంటే కదా? అది ఉంటే కార్యకర్తలు కూడా పద్ధతిగా ఉంటారు.
- నీకు నటన జీవితం ఇచ్చింది విశాఖపట్నం. తొలుత నీకు పిల్లను ఇచ్చింది విశాఖపట్నం. చివరికి నీవు పోటీ చేసింది విశాఖలోనే. అయినా అన్నీ మర్చిపోయావు. ఉత్తరాంధ్రను వాడుకుని, ఇక్కడి ప్రజల ఆత్మగౌరవం దెబ్బ తీయాలని చూస్తున్నావు. ఉద్యమానికి తూట్లు పొడవాలని చూస్తున్న నువ్వు మూల్యం చెల్లించుకోక తప్పదు. జనసేన నాయకుడు నాదెండ్ల మనోహర్ ప్రకటన హాస్యాస్పదంగా ఉంది. ఎవరు ఎవరి మీద దాడి చేశారు?

రాష్ట్రానికి తుపాను ముప్పు

- సూపర్ సైక్లోన్‌గా మారుతుందంటున్న వాతావరణ సంస్థలు
- కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం.. మరో 3 రోజులు వర్షాలు
- శనివారం రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షాలు
- అష్టదిగ్బంధంలో అమరావతి


తాడికొండలో వాగు దాటుతున్న ఆర్టీసీ బస్సు

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రానికి తుపాను ముప్పు పొంచి ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. అండమాన్ సముద్రం, దాని పరిసరాల్లో ఈ నెల 18న ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. 20వ తేదీ నాటికి ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ.. నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనంగా బలపడుతుందని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. క్రమంగా ఇది ఏపీ–ఒడిశా తీరం వైపు కదులుతూ 24, 25 తేదీల్లో తుపానుగా మారే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. ఆ తర్వాత పెను తుపాను (సూపర్ సైక్లోన్)గా మారుతుందని పలు అంతర్జాతీయ ప్రైవేటు వాతావరణ సంస్థలు అంచనా వేస్తున్నాయి.

కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం..

ప్రస్తుతం బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ఏపీ, ఉత్తర తమిళనాడు తీరాల వెంబడి సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో వచ్చే మూడు రోజులు రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఆదివారం, సోమవారం, మంగళవారాల్లో పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, నంద్యాల, కర్నూలు, అనంతపురం, శ్రీ సత్యసాయి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, చిత్తూరు జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు తెలిపింది.

పలు జిల్లాల్లో భారీ వర్షాలు..

కాగా రాష్ట్రవ్యాప్తంగా శనివారం భారీ వర్షాలు కురిశాయి. ప్రకాశం, విశాఖపట్నం, శ్రీకాకుళం, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో పలుచోట్ల భారీ వర్షాలు పడగా మిగిలిన జిల్లాల్లో ఓ మోస్తరు వానలు పడ్డాయి. కుంభవృష్టితో కోనసీమ తడిసి ముద్దైంది. విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. చంపావతి, నాగావళి నదుల్లో నీటి ప్రవాహం పెరిగింది. ప్రకాశం బ్యారేజ్ నుంచి దిగువకు 4.33 లక్షల క్యూసెక్కులు విడుదల చేయడంతో బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం ఓలేరు, పల్లెపాలెం, పెదలంక, కాకుల డొంక వద్ద కృష్ణా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. కాగా వర్షాల నేపథ్యంలో కృష్ణా, పెన్నా నదులు వరద ఉధృతితో ప్రవహించే ప్రమాదం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి మండలంలో వేర్వేరు ప్రాంతాల్లో వాగుల్లో కొట్టుకుపోతున్న ముగ్గురిని స్థానికులు కాపాడారు.

అష్టదిగ్బంధంలో అమరావతి

ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు అమరావతి అష్టదిగ్బంధంలో చిక్కుకుంది. గత టీడీపీ ప్రభుత్వం ముందుచూపు లేకుండా నిర్మించిన అమరావతిని వాన నీరు చుట్టుముట్టింది. భూసమీకరణ పేరుతో వేలాది ఎకరాలు సేకరించిన చంద్రబాబు ప్రభుత్వం ఈ ప్రాంతంలో అందుకు తగినట్లుగా సౌకర్యాలు కల్పించకపోవడంతో సచివాలయ ఉద్యోగులు, న్యాయమూర్తులు, న్యాయవాదులు ఇబ్బందిపడ్డారు.

వైఎస్సార్ సీపీ నేత దారుణ హత్య

పట్టపగలే ఇంటి వరండాలో నరికి చంపిన వైనం


రామ్మోహన్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ శ్రీనివాసులు, చిత్రంలో నాయకులు

రైల్వేకోడూరు: అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలంలోని మైసూరువారిపల్లె పంచాయతీ మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు దివిటి రామ్మోహన్ (50) దారుణ హత్యకు గురయ్యారు. శనివారం స్వగ్రామమైన శాంతినగర్‌లోని ఆయన ఇంటి వద్ద బయట వరండాలో కూర్చుని ఉండగా, గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు మాస్కులు ధరించి కత్తులతో నరికారు. రామ్మోహన్ భార్య విజయలక్ష్మి ఇంట్లోంచి బయటకు వచ్చే లోపే వారు ద్విచక్రవాహనంపై పరారయ్యారు. శాంతినగర్‌లో విజయలక్ష్మి అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తుంది. వీరికి ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి కుటుంబసభ్యులను పరామర్శించారు. నిందితులు ఎంతటివారైనా, ఏపార్టీ వారైనా ఉపేక్షించేది లేదన్నారు. ఇరవై ఏళ్లుగా ప్రశాంతంగా ఉన్న రైల్వేకోడూరులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సీఐ విశ్వనాథ్‌రెడ్డికి సూచించారు. హతుడు గతంలో వివిధ చానళ్లలో విలేకరిగా పనిచేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఈ హత్య తానే చేశానని పోలీస్‌స్టేషన్‌లో ఓ వ్యక్తి లొంగిపోయినట్లు సమాచారం.

చంద్రబాబు పతనం 'అన్ స్టాపబుల్'

జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు స్పష్టీకరణ

- వెన్నుపోటు రక్తపు మరకను తుడుచుకునే యత్నమే టాక్‌షో
- ఎన్టీఆర్‌ను చంపి.. ఆయన ఆశయాలు సాధిస్తారా?
- అప్పుడు, ఇప్పుడూ బాబుకు తానా తందానా అన్న బావమరిది బాలకృష్ణ
- ఆహా షో హిట్.. 'నందమూరి–నారా' పరువు ఫట్
- లోకేష్ ఒక బఫూన్.. బాలకృష్ణ అమాయకుడు, అసమర్థుడు
- ఆ షోకు లక్ష్మీపార్వతి, నాదెండ్ల భాస్కరరావులను పిలిస్తే వాస్తవాలు తెలిసేవి
- వైఎస్సార్‌సీపీకి 175 స్థానాలు అన్ స్టాపబుల్
- వికేంద్రీకరణను వ్యతిరేకిస్తున్న బాబు, పవన్ కల్యాణ్‌లు తగిన మూల్యం చెల్లించక తప్పదు



సాక్షి, అమరావతి: పిల్లనిచ్చిన మామ ఎన్టీఆర్‌కు 27 ఏళ్ల క్రితం వెన్నుపోటు పొడిచినప్పుడు తనపై పడిన రక్తపు మరకను తుడుచుకునేందుకే బావమరిది బాలకృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న అన్‌స్టాపబుల్ టాక్ షో ద్వారా చంద్రబాబు ప్రయత్నించారని జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు దుయ్యబట్టారు. రాజకీయంగా పతనమైపోతున్న చంద్రబాబును, లోకేష్‌ను, టీడీపీని ఈ టాక్ షోలు కాపాడలేవని, వారి పతనం అన్ స్టాపబుల్ అని స్పష్టం చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆహా అనే ఓటీటీ సంస్థ నిర్వహించే టాక్ షోలో ఎన్టీఆర్ కాళ్లు పట్టుకుని బతిమలాడినా వినలేదని, అందుకే జుట్టు పట్టుకుని ఎన్టీఆర్‌ను కిందకు లాగేశాను అని చంద్రబాబు మాట్లాడితే.. అది ధర్మమే, న్యాయమేనంటూ బాలకృష్ణ తానా తందానా పలకడం పోగాలం కాకపోతే మరేమిటని నిలదీశారు. దీన్ని బట్టి.. చంద్రబాబు విలనే అని ప్రజలు మరో మారు నిర్ధారణకు వచ్చారని స్పష్టం చేశారు. బాలకృష్ణ నిర్వహించే టాక్ షోకు ఇప్పటిదాకా సినీ ప్రముఖులు, హీరోలే వచ్చారని.. తొలిసారిగా రియల్ విలన్ చంద్రబాబు వచ్చారంటూ దెప్పి పొడిచారు. ఎన్టీఆర్, చంద్రబాబుల గురించి తెలిసిన నాదెండ్ల భాస్కర్‌రావు, లక్ష్మీపార్వతిలను ఆ టాక్ షోకు పిలిచి ఉంటే.. వాస్తవాలు తెలిసేవని, చంద్రబాబు బండారం బట్టబయలయ్యేదన్నారు. విదేశాల్లో విచ్చలవిడిగా అమ్మాయిలతో కులుకుతున్న కొన్ని ఫొటోలను బఫూన్, కామెడీ యాక్టర్ వంటి లోకేష్‌కు చూపుతూ.. వీటిపై ఏమంటావు అల్లుడూ అని బాలకృష్ణ ప్రశ్నిస్తే.. అది మామూలే, బ్రాహ్మణి కూడా వాటిని చూసిందని లోకేష్ అన్నారని చెప్పారు. టాక్ షో ఆద్యంతం పరిశీలిస్తే.. బావ చంద్రబాబు, అల్లుడు లోకేషలు చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి బాలకృష్ణతో కూడబలుక్కుని ఈ డ్రామా ఆడారన్నది ప్రజలకు అర్థమైందన్నారు. పతనమైపోతున్న తన రాజకీయ జీవితానికి కాస్తయినా ఉపయోగపడుతుందనే పుత్రుడు లోకేష్‌తో కలిసి చంద్రబాబు ఈ షోలో పాల్గొన్నారన్నారు.

ఎన్టీఆర్ బతికుంటే చంద్రబాబుకు అధోగతే

టాక్ షో హిట్ అయినా.. నారా–నందమూరి కుటుంబాల పరువును వారే తీసుకున్నారని మంత్రి అంబటి దెప్పి పొడిచారు. రెక్కల కష్టంతో గద్దెనెక్కిన ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి అధికారాన్ని, టీడీపీని.. చంద్రబాబు చేజిక్కించుకోవడం, ఎన్టీఆర్‌పై చెప్పులు వేయడం తప్పే కాదని చంద్రబాబు, బాలకృష్ణ తానా తందానా అంటూ మాట్లాడటం హేయమన్నారు. నాన్నకు వెన్నుపోటు పొడిచి అధికారంలో నుంచి దించేసిన తర్వాత వచ్చిన ఎన్నికల్లో ఘన విజయం సాధించామని.. అందుకే అది కరెక్ట్ అని తేలిపోయిందంటూ బాలకృష్ణ చెప్పడం విడ్డూరంగా ఉందని చెప్పారు. 1995లో ఎన్టీఆర్‌ను అధికారంలో నుంచి దించేసి చంద్రబాబు పాలన చేపట్టిన నాలుగు నెలలకే ఎన్టీఆర్ చనిపోయారని గుర్తు చేశారు. ఎన్టీఆర్ చనిపోకపోయి ఉంటే చంద్రబాబు గతి ఏమయ్యేదని బాలకృష్ణను ప్రశ్నించారు. ఎన్టీఆర్ బతికి ఉంటే చంద్రబాబు అప్పట్లోనే అధోగతిపాలయ్యే వారని స్పష్టం చేశారు. ఈ దుర్మార్గపు మాటలను అద్భుతం.. మహాద్భుతం అంటూ ఈనాడు, ఆంధ్రజ్యోతిలు అచ్చేయడం విచిత్రంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ 175 స్థానాల్లో ఘన విజయం సాధించడం అన్ స్టాపబుల్ అని రాసుకోండి అంటూ ఈనాడు, ఆంధ్రజ్యోతి, చంద్రబాబు, బాలకృష్ణలకు సవాల్ విసిరారు. ప్రజా సమస్యలపై పోరాడాల్సిన ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు బావురుమని ఏడుస్తూ అసెంబ్లీ నుంచి వెళ్లి బామ్మర్ది దగ్గర షోలు చేసుకునే స్థితికి దిగజారిపోయాడని, రాష్ట్రంలో ఇంకా టీడీపీ ఎక్కడుందని ప్రశ్నించారు.

పాకెట్ మనీ తీసుకున్నది మరిచావా బాబూ?

'టాక్ షోలో మీకు మంచి మిత్రుడు ఎవరని ప్రశ్నిస్తే వైఎస్ రాజశేఖరరెడ్డి అని బాబు చెప్పారు. ఆ రోజుల్లో వైఎస్ బాగా ధనవంతుడు. చంద్రబాబుది చిన్న కుటుంబం. వారి స్నేహంలో వైఎస్ వద్ద ఖర్చుల కోసం ఐదు, పది వేలు చంద్రబాబు తీసుకునే వాడు. ఇందులో తప్పేమీ లేదు. అయితే ఆ విషయాన్ని కూడా చంద్రబాబు చెప్పాలి కదా?' అని అంబటి ప్రశ్నించారు. మహా పాదయాత్ర పేరుతో వెళుతున్న ఫాల్స్ పాదయాత్రను చూసి ఉత్తరాంధ్ర ప్రజలు చైతన్యం అవుతున్నారని.. పిడికిలి బిగించి ఉద్యమం చేస్తున్నారని గుర్తు చేశారు. తొడలు కొట్టే వారిని, మీసాలు తిప్పే వారిని తిప్పికొడతారని స్పష్టం చేశారు. ఉత్తరాంధ్రపై దాడి చేస్తున్నందుకు చంద్రబాబు, పవన్ కల్యాణ్ తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

'చినసత్యం' జీవిత పురస్కారాల ప్రదానం


శ్రీసీతామాంజనేయులు దంపతులకు పురస్కారం అందజేస్తున్న మంత్రి రోజా

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ, సేవ్ కూచిపూడి ఆర్టిస్ట్, జయహో భారతీయం ఆధ్వర్యంలో నాట్యాచార్యుడు డాక్టర్ వెంపటి చిన సత్యం జయంతిని పురస్కరించుకుని చిన సత్యం జీవిత పురస్కారాల ప్రదానం శనివారం ఘనంగా నిర్వహించారు. విజయవాడలోని ఘంటసాల సంగీత కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన సాంస్కృతిక శాఖామంత్రి ఆర్కే రోజా మాట్లాడుతూ కళాకారుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కవులు, కళాకారులు, వివిధ రంగాలలో ప్రతిభావంతులైన వారికి వైఎస్సార్ పేరుతో పురస్కారాలు ప్రదానం చేస్తున్నట్లు చెప్పారు. నాట్యాచార్యుడు డాక్టర్ వెంపటి చినసత్యం తెలుగు నేలకు ఎందరో కళాకారులను అందించారని కొనియాడారు. చినసత్యం జయంతిని అంతర్జాతీయ కూచిపూడి నృత్యోత్సవంగా నిర్వహించడానికి కృషి చేస్తామన్నారు. సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రసంగించారు. నాట్యాచార్యుడు చింతా సీతారామాంజనేయులుకు డాక్టర్ వెంపటి చినసత్యం స్మారక పురస్కారం, రూ.5లక్షల నగదు, డాక్టర్ ఎ.బి.బాలకొండలరావుకు చిన సత్యం జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు ఆర్.మల్లికార్జునరావు, సేవ్ కూచిపూడి ఆర్టిస్ట్ అసోసియేషన్ వ్యవస్థాపకురాలు పెదప్రోలు భావన, నాట్యాచార్యులు ఘంటసాల పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒంటరి పోరే

రాష్ట్ర పదాధికారుల సమావేశంలో బీజేపీ నిర్ణయం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని తొమ్మిది ఉమ్మడి జిల్లాల పరిధిలో త్వరలో జరగనున్న మూడు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీతో ఎటువంటి సంబంధం లేకుండా ఒంటరిగా పోటీ చేయాలని శనివారం విజయవాడలో జరిగిన బీజేపీ రాష్ట్ర కోర్ కమిటీ, పదాధికారుల సమావేశంలో నిర్ణయించారు. ఈ ఎన్నికల్లో మిత్రపక్ష జనసేన పార్టీతోపాటు వివిధ సంఘాల నేతల మద్దతు కోరాలని.. పార్టీ పరంగా ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని కూడా చురుగ్గా చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు.


కోలాహలంగా టిడ్కో గృహ ప్రవేశాలు

మంగళగిరి, తెనాలిలో లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు అందజేసిన మంత్రి సురేశ్

మంగళగిరి/తెనాలి: గుంటూరు జిల్లా మంగళగిరి, తెనాలిలో నిర్మించిన టిడ్కో ఇళ్లలో లబ్ధిదారుల గృహ ప్రవేశాలు శనివారం వైభవంగా జరిగాయి. లబ్ధిదారులు, వారి కుటుంబసభ్యులు, బంధువులు తరలిరావడంతో వైఎస్సార్ జగనన్న కాలనీల్లో పండుగ వాతావరణం నెలకొంది. మంగళగిరిలోని ఎర్రచెరువులో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి మంత్రి ఆదిమూలపు సురేశ్ గృహ సముదాయాల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, సీఎం వైఎస్ జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. లబ్ధిదారులకు నూతన వస్త్రాలతో పాటు సేల్ డీడ్‌లు, ఇళ్ల తాళాలు అందజేశారు. తెనాలిలో జరిగిన కార్యక్రమంలో గుంటూరు జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌తో కలిసి మంత్రి సురేశ్ టిడ్కో గృహ సముదాయాలను ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు సేల్ డీడ్‌లు, ఇళ్ల తాళాలను అందజేశారు.

స్పా ముసుగులో వ్యభిచారం

- విజయవాడలో 19 స్పా, మసాజ్ సెంటర్ల సీజ్
- 18మంది యువతులు, ఏడుగురు విటులు, ఆరుగురు నిర్వాహకులపై కేసు
- డీసీపీ విశాల్ గున్ని వెల్లడి



విజయవాడ స్పోర్ట్స్: నగరంలోని కొన్ని స్పా, మసాజ్ సెంటర్లలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పోలీసులు ఏకకాలంలో పలు స్పా, మసాజ్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించి 19 కేంద్రాలను సీజ్ చేశారు. ఈ వివరాలను ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ డీసీపీ విశాల్ గున్ని శనివారం వెల్లడించారు. విజయవాడలో 200కు పైగా స్పా, మసాజ్ సెంటర్లు ఉన్నాయని డీసీపీ తెలిపారు. కొన్ని స్పా, మసాజ్, ఫిట్‌నెస్, వెల్‌నెస్, స్లిమ్మింగ్, హెల్త్ సెంటర్లలో హైటెక్ వ్యభిచారం జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని చెప్పారు. ఆయా సెంటర్లపై వారం రోజులుగా నిఘా పెట్టామన్నారు. ఈ సెంటర్లలో 20 ప్రత్యేక పోలీసు బృందాలతో శుక్రవారం రాత్రి ఏకకాలంలో తనిఖీలు నిర్వహించగా, 19 కేంద్రాల్లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు తేలిందన్నారు. దివ్య యూనిసెక్స్ యూటీ సెలూన్, గోల్డెన్ కోక్స్, నోవా వెల్‌నెస్ ఫిట్‌నెస్ సెంటర్‌లలో వ్యభిచారానికి సంబంధించిన కొన్ని వస్తువులు లభించినట్లు డీసీపీ తెలిపారు. పూర్తిస్థాయి విచారణ తర్వాత 19 కేంద్రాలను సీజ్ చేశామని, అక్కడ వ్యభిచారం నిర్వహిస్తున్న 18 మంది ఇతర రాష్ట్రాలు, దేశాల యువతులను, ఏడుగురు విటులను అదుపులోకి తీసుకున్నామని వివరించారు. వారితోపాటు ఆరు కేంద్రాల నిర్వాహకులపై కూడా వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామని, అందరినీ కోర్టులో హాజరుపరిచామని చెప్పారు. టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ కె.శ్రీనివాసరావు, ఏసీపీ ఖాదర్‌బాషా పాల్గొన్నారు.



ఆతురపడి మాటలాడువాని చూచితివా? వానికంటె మూర్ఖుడు సులువుగా గుణపడును.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం
దక్షిణాయనం, శరదృతువు
ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.సప్తమి పూర్తి (24గంటలు) **నక్షత్రం:** ఆరుద్ర రా.1.47 వరకు, తదుపరి పునర్వసు
వర్జ్యం: ఉ.8.36 నుండి 10.22 వరకు
దుర్ముహూర్తం: సా.4.03 నుండి 4.48 వరకు **అమృతఘడియలు:** ప.2.46 నుండి 4.32 వరకు.

సూర్యోదయం : 5.56
సూర్యాస్తమయం : 5.36
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

మల్లికార్జున్ ఖర్గే (కాంగ్రెస్)
రాయని డైరీ

మాధవ్ శింగరాజు

అక్టోబర్ 19 పెద్ద విశేషమేం కాదు. అక్టోబర్ 17న జరిగేవి కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలే కనుక 19న జరిగే కౌంటింగ్‌లో కాంగ్రెస్ గెలుస్తుందా, బీజేపీ విజయం సాధిస్తుందా, లేక ఆమ్ ఆద్మీ పార్టీ వచ్చేస్తుందా అనే ఉత్కంఠ ఏమీ ఉండదు. నేనో, థరూరో ఎవరో ఒకరం గెలుస్తాం.

మాలో ఎవరు గెలిచినా కాంగ్రెస్ గెలిచినట్లే కానీ, మాలో ఒకరు ఓడిపోయి, ఒకరు గెలిచినట్లు కాదు. ఈ నిజాన్ని అంగీకరించడానికి శశి థరూర్ ఎందుకు సిద్ధంగా లేరో మరి?! కాంగ్రెస్‌ను గెలిపించడం కోసం ఇద్దరు కాంగ్రెస్ అభ్యర్థులు పోటీ పడుతున్నట్లుగా కదా ఆయన ఈ ఎన్నికల్ని మనసా వాచా కర్మణా చూడాలి!

థరూర్ గానీ, నేను గానీ ఇప్పుడు ఆలోచించవలసింది హిమాచల్‌ప్రదేశ్, గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవడం గురించి; తర్వాత జరిగే పది రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవడం గురించి; ఆ తర్వాత 2024లో జరిగే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవడం గురించి.

ఏడాదిలో ఇన్ని ఎన్నికల్ని పెట్టుకుని, ఏడాదికోసారి జరిగే పార్టీ అధ్యక్ష ఎన్నికలే తన సర్వస్వంగా థరూర్ భావించడం ఏమిటి?!

"ఈ పోటీ న్యాయంగా జరగడం లేదు. అంతా నాకు వ్యతిరేకంగా జరుగుతోంది" అని ఆయన అంటున్నారు!



"థరూర్‌జీ! మీరు అనుకుంటున్నట్లుగా పార్టీలో మీకెవరూ వ్యతిరేకంగా లేరు.." అన్నాను.. రెండు రోజుల క్రితం ఫోన్ చేసి.

నిజానికి ఆ మాట చెప్పడానికి నేను ఆయనకు ఫోన్ చేయలేదు. సోనియాజీ పార్లమెంటరీ ప్యానెల్ ఛైర్‌పర్సన్‌గా థరూర్‌ని ఎంపిక చేశారని తెలిసి చేశాను. చేసి, "కంగ్రాట్స్ థరూర్‌జీ.." అన్నాను.

"థ్యాంక్యూ ఖర్గేజీ! మరి నేను కూడా ఇప్పుడే మీకు కంగ్రాట్స్ చెప్పేయమంటారా, అక్టోబర్ 19 వరకు ఆగమంటారా?" అని నవ్వుతూ అడిగారు థరూర్. ఆయన ఉద్దేశం నాకు అర్థమైంది. సోనియాజీ నాకు సపోర్ట్ చేస్తున్నారు కాబట్టి పార్టీ అధ్యక్షుడిగా ఆల్రెడీ నేను గెలిచేసినట్లేనని!!

"అప్పుడు కూడా నేనే మీకు కంగ్రాట్స్ చెబుతాను థరూర్‌జీ. 'మీ' ప్రయత్నం వల్లనే కదా, పార్టీకి అసలంటూ ఎన్నికలు జరుగుతున్నాయి.." అన్నాను.

'మీ' అనడంలో నా ఉద్దేశం 'జి–23' అని. పార్టీలో ఎన్నికలకు ఒత్తిడి తెస్తూ రెండేళ్ల క్రితం సోనియాజీకి లేఖ రాసిన గ్రూప్ అది.

జి–23 అనే మాటకు పెద్దగా నవ్వారు థరూర్.

"ఖర్గేజీ! మీకొకటి తెలుసా? ఆ గ్రూపులో ఉన్నవారెవరూ ఇప్పుడు నాతో లేరు. మీ వైపు వచ్చేశారు. ఆ గ్రూపులో నేను ఉన్నందుకు కూడా ఇప్పుడు నాతో ఎవ్వరూ లేరు. వాళ్లూ మీ వైపే ఉన్నారు. నేనొస్తున్నానని తెలిసి దేశవ్యాప్తంగా పీసీసీ ప్రెసిడెంట్‌లు పొలాల్లోకి, పక్క ఊళ్లలోకి, లేని పోని సంతాపాల పనుల్లోకి పరుగులు తీస్తున్నారు! మొన్న తెలంగాణలో చూశారు కదా! అక్కడి ప్రెసిడెంట్ మీకు ఒకలా, నాకు ఒకలా ట్రీట్‌మెంట్ ఇచ్చారు. నాకు షాక్ ట్రీట్‌మెంట్. మీకు స్వీట్ ట్రీట్‌మెంట్.." అన్నారు నవ్వు ఆపకుండా థరూర్.

"థరూర్‌జీ! మీపై నిజంగా వ్యతిరేకత ఉంటే సోనియాజీ మీకు పార్లమెంటరీ ప్యానెల్ పోస్ట్ ఇచ్చేవారా?! సోనియాజీనే స్వయంగా మీకు పోస్ట్ ఇచ్చాక కూడా పార్టీలో మిమ్మల్ని వ్యతిరేకించే వారు ఉంటారా?!" అన్నాను.

ఆ మాటకు మళ్లీ పెద్దగా నవ్వి.. "ఖర్గేజీ.. వ్యతిరేకత లేకపోవడం మద్దతు అవుతుందా, మద్దతు ఇవ్వక పోవడం వ్యతిరేకత అవుతుంది కానీ.." అన్నారు థరూర్.

రేపే పార్టీ అధ్యక్ష పదవికి ఎన్నిక.

"ఖర్గేజీ వస్తే మారేదేమీ ఉండదు. నేనొస్తే నాతో పాటు మార్పును తెస్తాను" అని థరూర్ చెబుతున్నారు.

చూడాలి.. రేపు జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రతినిధులు మార్పు కోసం ఓటేస్తారో, ఏదీ మారకుండా ఉండటం కోసమే ఓటేస్తారో!

ఆట నిర్ణయమైపోయింది!

నేటి నుంచి జరగనున్న చైనా కమ్యూనిస్టు పార్టీ 20వ జాతీయ కాంగ్రెస్ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అధికారాన్ని మరింతగా స్థిరపర్చే దిశగా పయనిస్తుందని అంచనా. పార్టీలోని ఇతర కీలక నాయకులు పదవుల నుంచి తప్పుకుంటున్నప్పటికీ జనరల్ సెక్రటరీ స్థానానికి ఢోకా లేదన్నది స్పష్టం. పార్టీలో అత్యున్నత స్థానాల్లో ఉన్న కొన్ని వందలమందికి ఇప్పటికే పార్టీ కాంగ్రెస్‌లో జరిగే ఫలితం గురించి తెలుసు. అనుకోనిది జరిగితే తప్ప పార్టీ కాంగ్రెస్‌లో ఆడబోయే ఆట ఇప్పటికే నిర్ణయమైపోయింది. అయితే మూడోసారి పార్టీ జనరల్ సెక్రటరీ కాబోతున్న జిన్‌పింగ్‌కు దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలు సవాలు విసరనున్నాయి. అసమానతలను రూపుమాపడానికి అవసరమైన సామూహిక వృద్ధి అన్న పార్టీ కేంద్ర భావన ఈ చర్చల్లో ప్రధాన భూమిక పోషించనుంది. స్థానికంగా వినియోగాన్ని పెంచడం, కొత్త ఆవిష్కరణలు, స్థానికంగా పోటీతత్వాన్ని పెంచడం ద్వారా అసమానతలను తగ్గించాలని చైనా యోచిస్తోంది. ముఖ్యంగా చైనా ప్రపంచం దృష్టిలో తన ఇమేజ్‌ను మార్చుకునేందుకు ప్రయత్నిస్తుందన్న అంచనాలున్నాయి.

అధ్యక్షుడి స్థానం సుస్థిరం

సందర్భం



జేమ్స్ పామర్

చైనా కమ్యూనిస్టు పార్టీ (సీసీపీ) 20వ జాతీయ కాంగ్రెస్ నేడు బీజింగ్‌లో ప్రారంభం కానుంది. ప్రతి అయిదేళ్లకోసారి జరిగే ఈ సమావేశం రోజుల పాటు కొనసాగుతుంది. ఈ సమావేశంలో ప్రకటనలు, తీర్మానాలు, తదనుగుణంగా కొత్త స్టాండింగ్ కమిటీ ఎన్నిక, 25 మంది వ్యక్తుల పొలిట్ బ్యూరోలో కొద్ది మంది ముఖ్య నాయకుల బృందం ఏర్పాటవుతాయి. సాంప్రదాయికంగా, సీసీపీ జనరల్ సెక్రటరీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, చైనా ప్రధాని లీ కికియాంగ్‌తో సహా అత్యున్నత నాయకత్వం మార్పునకు పార్టీ కాంగ్రెస్ వేదికగా ఉండాలి.

అయితే జిన్‌పింగ్ పాలన సాధారణం కంటే ఎక్కువే అని చెప్పాలి. 2017లో జరిగిన 19వ కాంగ్రెస్ తదుపరి తరం దేశ నేత గురించి బయటపెట్టలేదు. కానీ ఆ మరుసటి సంవత్సరమే జిన్‌పింగ్ నిబంధనలు మార్చివేసి జీవితకాల పాలకుడిగా తనను తాను నియమించుకున్నారు. అదే సమయంలో రాజకీయ ప్రక్షాళన ద్వారా తన ప్రత్యర్థులను దారిలోకి తెచ్చుకున్నారు. పార్టీ అధినేత కంటే ప్రధానికి అధికారాలు తక్కువ కాబట్టి ఈ కాంగ్రెస్‌లో లీ పదవికి గ్రహణం పట్టడం తప్పదని భావిస్తున్నారు.

చైనాలో పార్టీ కాంగ్రెస్ జరుగుతున్న సమయం కూడా చైనా రాజకీయ గతానికి చెందిన అస్థిరతను గుర్తు చేస్తుంది. తొలి పార్టీ కాంగ్రెస్ దాదాపు నూరేళ్ల క్రితం జరిగింది. చైనా కమ్యూనిస్ట్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కాకుండా విప్లవోద్యమ పార్టీగా ఉన్నప్పుడు అది జరిగింది. అయితే ప్రతి అయిదేళ్లకు ఒకసారి కాంగ్రెస్‌ని నిర్వహించడం అనేది 1977 నుంచి మాత్రమే జరుగుతూ వస్తోంది. మావో అనంతర అధికారిక వ్యవస్థను నెలకొల్పాలి అని పార్టీ అప్పటినుంచే ప్రయత్నించింది మరి.

చైనా మరింతగా నిరంకుశాధికారంపై ఆధారపడుతుందని సంకేతాలు వెలువరిస్తూ, వ్యవస్థీకృత నాయకత్వ వారసత్వం అమల్లోకి వచ్చింది. ఈ నిరంకుశాధికార వ్యవస్థతోనే ప్రపంచం వ్యవహారాలు నడపాలి. శక్తిమంతమైన పార్టీ చీఫ్ కొంతమేరకు సమానులలో ప్రథముడు అని భావించడమే దీనివెనుక ఉన్న భావం. ఆ విధంగా తక్కిన నాయకత్వంతో పాటు, రిటైరైన నాయకులు చైనాలో కొత్త మావో ఆవిర్భవించకుండా నిరోధిస్తారని అందరూ భావించారు. అయితే జిన్‌పింగ్ ఎదుగుదల ఈ ఆలోచనలను తోసిపుచ్చింది. చైనా కమ్యూనిస్టు పార్టీ ఇన్‌చార్జ్ ఎవరు అనే ప్రశ్నే ఇప్పుడు తలెత్తదు. 20వ కాంగ్రెస్ తర్వాత నాయకత్వ మార్పు జరగకపోవచ్చు. ఇప్పటికైతే, చైనా శాశ్వత నాయకుడు జిన్‌పింగ్ అనే చెప్పాలి.

పార్టీ కాంగ్రెస్ జరగడానికి ముందే పార్టీలో అంతర్గత అధికార పోరాటాలు మొదలయ్యాయి. కాంగ్రెస్ అనే ఈవెంటు... చక్కగా చిత్రీకరించిన డ్యాన్స్ అన్నమాట. అనుకోనిది జరిగితే తప్ప పార్టీ కాంగ్రెస్‌లో ఆడబోయే ఆట ఇప్పటికే నిర్ణయమైపోయింది. నెలలు, బహుశా సంవత్సరాలుగా తెరవెనుక సాగుతూ వచ్చిన అనుకూల ప్రచారం, హెచ్చరికలు, అవినీతి ఆరోపణలు, ఆకర్షించడం, బలవంతపెట్టడం, తారుమారు చేయడం వంటివి ఫలితాన్ని ఇప్పటికే నిర్దేశించాయి. కమ్యూనిస్టు పార్టీ లోపల జరిగే వ్యవహారాలు జిన్‌పింగ్ నేతృత్వంలో మరింత పారదర్శకం కాకుండా పోయాయి. పార్టీలో అత్యున్నత స్థానాల్లో ఉన్న కొన్ని వందలమందికి ఇప్పటికే పార్టీ కాంగ్రెస్‌లో జరిగే ఫలితం గురించి తెలుసు. ఈ దఫా కాంగ్రెస్‌లో ప్రకటించబోయేది ఏమిటంటే పార్టీ గమ్యానికి మార్గనిర్దేశం చేయడం, జిన్‌పింగ్ అధికారాన్ని మరోసారి పొడిగించడం మాత్రమే.

ఈ సంవత్సరం పార్టీ కాంగ్రెస్‌కు మూడువేల మంది ప్రతినిధులు హాజరు కానున్నారు. సత్ప్రవర్తన, ప్రస్తుత నాయకులకు సన్నిహితంగా ఉండటం, సంకేత చర్య వంటి రివార్డుల ద్వారా పార్టీలోని వివిధ శ్రేణుల నుంచి ప్రతినిధులను ఎన్నుకుంటారు. పార్టీ కాంగ్రెస్‌లో కొంతమంది ప్రతినిధులు ఎలాంటి సమస్యలూ సృష్టించకుండా జిన్‌పింగ్ అధ్యక్షతలోని ఒక చిన్న కమిటీ ప్రతినిధుల తుది జాబితాను ఆమోదిస్తుంది. పార్టీలో ముందుగానే తీసుకున్న నిర్ణయాలను నామమాత్రపు చర్చతో ప్రతినిధులు ఆమోదిస్తారు. పార్టీ కాంగ్రెస్ ప్రధాన పని 200 మంది కేంద్ర కమిటీ సభ్యుల కొత్త జాబితాను, 170 మంది ప్రత్యామ్నాయ సభ్యుల జాబితాను ఆమోదించడమే. కొత్తగా ఎంపికయ్యే 200 మంది కేంద్రకమిటీ సభ్యులు పొలిట్ బ్యూరోలోని 25 మంది సభ్యులను ఎన్నుకుంటారు. తర్వాత పొలిట్ బ్యూరో పార్టీకి చెందిన స్టాండింగ్ కమిటీ సభ్యులను నిర్ణయిస్తుంది.

పార్టీ కాంగ్రెస్‌లో అనేక అంశాలపై అధ్యయనాలు జరుగుతుంటాయి. ప్రత్యేకించి పనికి సంబంధించిన నివేదికలు చైనా రాజకీయ, ఆర్థిక, భౌగోళిక పరిస్థితిని సంగ్రహంగా సమీక్షిస్తుంటాయి. ఈ నివేదికలను నాయకత్వమే పార్టీ కాంగ్రెస్‌కి సమర్పిస్తుంది. తైవాన్ పట్ల కఠిన పదజాలంలో వ్యాఖ్యలుంటాయి. చైనాలో ఆర్థిక సంస్కరణలకు సంబంధించిన సంకేతాలు కూడా వాటిలో ఉంటాయి.

అయితే ప్రధాన సమస్య ఏమిటంటే, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎవరై ఉంటారని తెలుసుకోవడమే. స్టాండింగ్ కమిటీ సభ్యుల అనధికారిక పదవీ విరమణ వయస్సు 68 సంవత్సరాలు. కానీ విధేయులు, కీలకమైన నేతలు మరింతకాలం పదవుల్లో కొనసాగుతారు. అయితే జిన్‌పింగ్‌తో కలిసి చాలా కాలం పనిచేసిన వారికి కొన్ని పదవులు కట్టబెట్టనున్నట్లు కనిపిస్తోంది. వీరిలో చెన్ మినెర్ ఒకరు. జిన్‌పింగ్ వారసుడు ఆయనే అని చెబుతుంటారు. మరొకరు డింగ్ జుకియంగ్. జిన్ పింగ్ విధేయులు ఎంతమంది ఎక్కువగా ఉంటే ఆయన అంత బలంగా కనిపిస్తారు. ఈ కాంగ్రెస్‌లో కూడా ఆయన విధేయులతో కూడిన స్టాండింగ్ కమిటీనే ఉంటుందని ఊహించవచ్చు.

అయితే ప్రస్తుతం చైనాను వెంటాడుతున్న ఆర్థిక అస్థిరత వల్ల అధ్యక్షుడిపై పార్టీ కాంగ్రెస్‌లో ఊహించిన దానికంటే ఎక్కువ విమర్శలే రావచ్చు. కాబట్టి సైద్ధాంతిక అవసరాలను దాటి ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించే వారికి జిన్‌పింగ్ కాస్త ప్రాధాన్యం ఇవ్వవచ్చు. అంటే మరింతగా మార్కెట్‌కు ప్రాధాన్యమిచ్చే వాంగ్ యాంగ్ వంటి ఆర్థిక వేత్తలకూ, లియు హె వంటి హార్వర్డ్ యూనివర్సిటీలో చదువుకున్న దౌత్యవేత్తలకూ అగ్రస్థానం లభించవచ్చు.

చైనా రాజకీయ నాయకత్వంలో జిన్‌పింగ్ ఆకాంక్షలకు వ్యతిరేకంగా సైద్ధాంతికంగా కానీ, దమ్ము ఉన్న వారుకానీ నిలబడే వారులేరు. మరొక కీలక సమస్య ప్రధానమంత్రి పదవి. ప్రస్తుతం ఆ పదవిలో ఉన్న లి కెకియాంగ్ తప్పుకోవచ్చని స్పష్టమవుతోంది. జిన్ పింగ్ దీర్ఘకాలిక సహచరుడు, షాంఘై పార్టీ చీఫ్ లి క్వియాంగ్ కొత్త ప్రధాని కావచ్చను కుంటున్నారు. అయితే ఈ ఏడాది షాంఘై లాక్‌డౌన్ కలిగించిన విధ్వంసం కారణంగా ఈయనకు కీలక పదవి లభిస్తుందంటే సందేహాలు కూడా ఉన్నాయి. ఏది ఏమైనా, పార్టీపై జిన్ పింగ్ పట్టు సడలకపోతే తప్పకుండా లి క్వియాంగ్‌నే ఆయన ప్రధానిగా ఎంచుకోవచ్చు. మొత్తం మీద చైనా పార్టీ కాంగ్రెస్ జిన్ పింగ్ అధికారాన్ని మరింతగా స్థిరపరిచే దిశగానే కొనసాగవచ్చు.

వ్యాసకర్త ప్రొఫెసర్ తెలియదు, కాలమిస్ట్
('ఫారిన్ పాలసీ' సౌజన్యంతో)



అసమానతలు రూపుమాపడమే అజెండా

సందర్భం



అవినాశ్ గోడ్బోలే

'ద పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా'... ప్రపంచంలోని ఏ మూలనైనా సరే ఈ పేరు వినగానే ఆశ్చర్యం, కోపం, జాగరూకత వంటి అనేక భావాలు వ్యక్తమవుతాయి. అంతేకాదు.. పెత్తందారీ పోకడలు, అప్రజాస్వామిక, అణచివేత ధోరణులు, దురహంకార పూరిత దేశంగా కొందరికీ... భారీ ప్రాజెక్టులు, విశాలమైన రహదారులతో అభివృద్ధికి వేగంగా బాటలు వేసుకున్న దేశంగా ఇంకొందరికీ గుర్తుంటుంది. విషయం ఏమిటంటే.. ఈ ఆలోచనలన్నింటి వెనుక ఉన్న శక్తి.. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనా (సీసీపీ). అక్టోబరు 16వ తేదీ నుంచి తన ఇరవయ్యవ జాతీయ కాంగ్రెస్ సమావేశాలను ఇది నిర్వహించుకుంటోంది.

ఈ సమావేశాల తరువాత షీ జిన్‌పింగ్ అనూహ్యంగా... మూడోసారి పార్టీ జనరల్ సెక్రటరీగా ఎంపిక కానున్నారు. పొలిట్ బ్యూరో స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఇంకో ఆరుగురి ఎంపిక కూడా ఈ సమావేశాల్లోనే జరుగుతుంది. చైనాలో నాయకత్వ మార్పును సూచించే రెండు సమావేశాల్లో ఇది ప్రధానమైంది. వచ్చే ఏడాది మార్చిలో చైనా ప్రభుత్వ నాయకత్వం నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్‌నూ మార్చేయనుంది. బహుశా ఆ తరువాతి కాలంలో దేశానికి ఒక కొత్త ప్రీమియర్ నియామకం జరిగే అవకాశం ఉంది.

చిట్టచివరిగా పీపుల్స్ కాంగ్రెస్ సమావేశాలు చోటు చేసుకున్నది 2017 మధ్యకాలంలో! అప్పటికీ, ఇప్పటికీ చైనాలో మాత్రమే కాకుండా ప్రపంచంలోనూ అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రపంచంలో ఒక బలీయమైన శక్తిగా ఎదగాలన్న దాని ఆకాంక్ష వ్యక్తీకరణకూ వేదిక ఈ సమావేశాలే. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనాకు ఈ సమావేశాలు నాయకత్వ మార్పిడి జరిగే వేదిక గానే కాకుండా... గత సమావేశాల నుంచి సాధించిన ప్రగతిని సమీక్షించేందుకూ, రానున్న ఐదేళ్లలో చేపట్టాల్సిన అంశాలపై ప్రణాళిక రచనకూ కేంద్రం. ఇదంతా జనరల్ సెక్రటరీ సమర్పించే నివేదిక ద్వారా వ్యక్తమవుతుంది. 2017లో షీ జిన్‌పింగ్ సుమారు మూడున్నర గంటలపాటు ఏకధాటిగా ప్రసంగించి 'కలల చైనా' అన్న ఇతివృత్తంపై మాట్లాడారు. ఈసారి అటువంటి అద్భుత ప్రసంగమే జరగవచ్చు.

షీ జిన్‌పింగ్ పార్టీ జనరల్ సెక్రటరీగా మూడోసారి ఎంపిక కావడం ఇప్పుడు లాంఛనమే. 2012లో జిన్‌పింగ్ అధికారం చేపట్టినప్పుడు చైనా ఆర్థిక వ్యవస్థ మందగమనంలో ఉండేది. గృహనిర్మాణం వంటి రంగాల్లో లోటుపాట్లేవీ పైకి కనిపించేవి కూడా కాదు. గృహ వినియోగం క్రమేపీ పెరుగుతూండేది. ఎగుమతులు లక్ష్యంగా పెట్టుబడులూ వస్తూండేవి. అంతేకాదు... స్థానికంగా వ్యాపారం చేసుకునే వాతావరణమూ ఇప్పటిలా కాకుండా... చాలా సానుకూలంగా ఉండేది. మైనార్టీల అణచివేత వంటి చైనా అరాచకాల గురించి అప్పట్లోనూ అందరికీ తెలుసు కానీ అదింకా సామూహిక కారాగారాలు ఏర్పాటు చేసే స్థాయికి చేరలేదు. హాంకాంగ్‌తో సంబంధాలూ ఒడుదొడుకుల్లేకుండానే సాగేవి కానీ 'నేషనల్ సెక్యూరిటీ లా' పేరుతో ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

అంతర్జాతీయ స్థాయిలో చైనాను ఓ ప్రత్యర్థి/పోటీదారుగానే చూశారు కానీ విధ్వంసం సృష్టించే దేశంగా చూడలేదు. ఇరుగుపొరుగుతో చైనా సంబంధాలు కూడా బాగా దెబ్బతిన్నాయి. కోవిడ్–19 కట్టడిలో విఫలమైన తరువాత, ఉక్రెయిన్‌పై రష్యా దాడులకు మద్దతు తరువాత చైనాను బాధ్యతాయుతమైన దేశంగా పరిగణించడమూ తగ్గింది. తైవాన్ సరిహద్దులపై క్షిపణులు ప్రయోగించడం, అది కూడా అమెరికా స్పీకర్ అక్కడకు వెళ్లి తిరిగి వచ్చిన వెంటనే జరగడం ప్రపంచం దృష్టిని దాటలేదు. అందుకేనేమో... చైనా ఓ నిరపాయకరమైన దేశం కాదన్న భావనపై అమెరికాలోని రెండు ప్రధాన పార్టీల్లోనూ ఏకాభిప్రాయం ఏర్పడుతోంది.

ఇవన్నీ ఒకవైపున సాగుతూండగానే జిన్‌పింగ్ చైనాలో కమ్యూనిస్టు పార్టీని అన్నింటికీ కేంద్ర బిందువుగా మార్చే ప్రయత్నాల్లో తలమునకలై ఉన్నారు. పార్టీ, ప్రభుత్వం మధ్య ఘర్షణ; అపోహల వంటివాటికి స్థానం లేకుండా దేశంలోని అన్ని రకాల సంస్థలకూ డీఫ్యాక్టో ఛైర్మన్‌గా మారిపోయాడు. అందుకే షీ జిన్‌పింగ్‌ను 'ఛైర్మన్ ఆఫ్ ఎవ్రీథింగ్' అని కూడా పిలుస్తూ ఉంటారు. పార్టీ అంతర్గత రాజకీయాల్లోనూ నాయకత్వానికి పోటీని పూర్తిగా తొలగించారు షీ జిన్‌పింగ్. నాయకత్వానికి పోటీ కాస్తా వర్గపోరుగా మారిపోతూండటం... పుకార్లు ప్రచారంలో పెట్టడం ద్వారా ప్రత్యర్థులను దెబ్బతీసే ప్రయత్నం జరుగుతూండటం వంటివన్నీ తగ్గిపోయాయి. సవాలు విసిరిన స్థానిక అవినీతిని కూడా జిన్‌పింగ్ దీటుగానే ఎదుర్కొన్నాడు. అవినీతి నిర్మూలన ప్రయత్నాలు కాస్తా రాజకీయ ప్రక్షాళనకూ దారి తీశాయి. కానీ ఈ ప్రస్థానంలో ఉమ్మడి నాయకత్వమన్న ఆలోచనకు ఫుల్‌స్టాప్ పడింది కూడా. జిన్‌పింగ్‌కు అన్ని విధాలుగా మద్దతు లభించేందుకు వీలుగా దాదాపు 30 ఏళ్ల తరువాత 'మూల నేత' అన్న భావనను ముందుకు తెచ్చారు.

జిన్‌పింగ్ సాధించిన అనేకానేక ఘనతల్లో చైనీస్ మిలటరీ ప్రక్షాళన కూడా ఒకటి. లంచాలకు మరిగారన్న ఆరోపణపై ఉన్నత స్థానంలో ఉన్న పలువురు అధికారులను కటకటాల వెనక్కు తోసేశారు. అదే సమయంలో మానవ హక్కులపై పోరాడుతున్న అనేకమంది న్యాయవాదులనూ అరెస్ట్ చేయడం, ఫెమినిస్టు వర్గాలపై కూడా ఉక్కుపాదం మోపడం, విదేశీ భావజాలం వ్యాపించకుండా అణచివేయడం కోసం యూనివర్సిటీ తరగతి గదుల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడం వంటివి ప్రపంచవ్యాప్తంగా విమర్శలకు గురైన చర్యలు.

ప్రపంచంలో చాలా దేశాల మాదిరిగానే చైనా కూడా బలీయమైన శక్తిగా ఎదగాలని కోరుకుంటోంది. అయితే వాణిజ్య యుద్ధాలు, ఆర్థిక వ్యవస్థ మందగమనం వంటి సవాళ్లు బయటి నుంచి ఎదురవుతున్నాయి. అయితే చైనా తన అధికారాన్ని విస్తరించుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలకు సవాళ్లు లేక పోలేదు. స్థానికంగా ఆర్థిక వ్యవస్థ మందగించడం, వినియోగమూ తగ్గిపోతూండటం వాటిల్లో కొన్ని మాత్రమే. ఏంట్ గ్రూప్ పబ్లిక్ ఇష్యూపై చెలరేగిన వివాదం వ్యాపారం చేసుకునే వాతావరణంపై సందేహాలు లేవనెత్తింది. పైగా కోవిడ్ కట్టడికి చేపట్టిన అనేక చర్యలు చైనాలో సాధారణ పరిస్థితులు నెలకొంటాయన్న ఆలోచనలపై చన్నీళ్లు చల్లాయి. చైనీయుల్లోనూ నిరాశా నిస్పృహలనూ, కోపాన్నీ పెంచాయి.

సుమారు రెండు వేల మంది పార్టీ ప్రతినిధులు పైన పేర్కొన్న అనేక అంశాలపై పార్టీ విధానాలను ముందుకు తీసుకెళ్లడం, భవిష్యత్తు ప్రణాళికను ఆమోదించడం వంటి కార్యక్రమాలు చేపట్టడానికి బీజింగ్‌లో సమావేశమవుతున్నారు. చైనాలోని అసమానతలను రూపుమాపడానికి అవసరమైన సామూహిక వృద్ధి అన్న పార్టీ కేంద్ర భావన ఈ చర్చల్లో ప్రధాన భూమిక పోషించనుంది. స్థానికంగా వినియోగాన్ని పెంచడం, కొత్త కొత్త ఆవిష్కరణలు, స్థానికంగా పోటీతత్వాన్ని మరింత పెంచడం ద్వారా అసమానతలను తగ్గించాలని చైనా యోచిస్తోంది. అన్నింటికంటే ముఖ్యంగా ఈసారి సమావేశాల తరువాత చైనా ప్రపంచం దృష్టిలో తన ఇమేజ్‌ను మార్చుకునేందుకు ప్రయత్నిస్తుందన్న అంచనాలున్నాయి. ఏం జరుగనుందో వచ్చే వారం రోజుల్లో బహిర్గతమవుతుంది.

వ్యాసకర్త అసోసియేట్ ప్రొఫెసర్, ఓపీజేజీయూ
('ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో)

నాటకమే ఆయన ఆయుధం!

విశ్లేషణ



డాక్టర్ పైడిపాల

తెలుగునాట ఆత్రేయ పేరు వినని వాళ్లుండరు. ఆయన పేరు వినగానే వెంటనే గుర్తొచ్చేది సినిమా పాటలు. కానీ ఆత్రేయ రచనా వ్యాసంగం పద్యరచనతో ప్రారంభమైందనీ, ఆ తరువాత 'ట్రెండ్ సెట్టర్' అని పిలుచుకునేలా స్వాభావిక వాదంతో వచన నాటకాలు, నాటికలూ రాశారనీ చాలా మందికి తెలియదు. ఆత్రేయ పద్యం మీద పట్టుతో, మక్కువతో తన అసంపూర్ణ ఆత్మకథను సైతం పద్యాల్లో రాసినా, నాటక రంగం వైపు మళ్లడానికి పద్యం కంటే నాటకమే శక్తిమంతమైన సాధనమనీ, ఆ ప్రక్రియతో ప్రజలతో ప్రత్యక్ష సంబంధం పెట్టుకుని వాళ్లను చైతన్యవంతులను చెయ్యొచ్చుననీ అభిప్రాయపడ్డం కారణం.

ఆత్రేయ ప్రాథమికంగా ప్రతిభావంతుడైన నటుడు. ప్రయోగశీలి అయిన ప్రయోక్త. ఆత్రేయ రచయితగా మారడానికీ, ఎదగడానికీ చిత్తూరు ఆర్యవైశ్య యువజన సంఘం, నెల్లూరులోని వెంకటగిరి ఆర్ట్స్, ప్రజానాట్యమండలి నిచ్చెన మెట్లుగా దోహదం చేశాయి. ఆంధ్ర నాటకరంగంలో సంస్కరణాత్మక నాటకాలు, పౌరాణిక పద్య నాటకాలు రాజ్యమేలుతున్న కాలంలో స్వాభావికవాదం ఆధారంగా సాంఘిక వచన నాటకాలు రాసి ఆత్రేయ తనదైన ముద్రను స్థాపించుకోవడానికి ఇబ్సెన్, పి.వి రాజమన్నార్, బళ్లారి రాఘవ వంటివారు స్ఫూర్తినిచ్చారు. ఇబ్సెన్ ఒక నాటకానికి ముందుమాట రాస్తూ– 'ఈ సమాజాన్నీ, దాని మూలాలను, రుగ్మతలను దర్శించి వాటి గురించి నువ్వేం చెప్పదలుచుకున్నావో అది వ్యక్తం చెయ్యడమే రచయితగా నీ బాధ్యత' అన్నట్లుగా... సామాజికుల చేత ఆలోచింపజేసి, పరిష్కారాన్ని వాళ్ళే ఎంచుకునేలా చేసేదే మంచి నాటకం అనే దృక్పథంతో ఆత్రేయ నాటకాల్ని రాశారు. 'ఒక రూపాయి' నాటికలో తనే ఒక పాత్ర చేత చెప్పించినట్లు... అందరూ రోజుకు పదిసార్లు అనుకునేవే నాటకాలలో సంభాషణలుగా మలచి సమకాలీన సమాజానికి అద్దం పట్టారు. సంస్కరణలూ, నీతులూ అంటూ నేల విడిచి సాము చెయ్యలేదు. మధ్యతరగతి సమస్యల్నీ, కలతల్నీ, కన్నీళ్లనూ పరామర్శించి వాళ్ళలో చైతన్యాన్ని రగిలించారు.

1944లో గుడివాడలో జరిగిన ఆంధ్ర నాటక కళాపరిషత్ పోటీలలో వెంకటగిరి ఆర్ట్స్ తరఫున కొండముది గోపాలరాయ శర్మ రచించిన 'ఎదురీత' నాటకాన్ని ప్రదర్శించి ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ ప్రయోక్త, ఉత్తమ నటుడు బహుమతుల నందుకుని సంచలనం సృష్టించారు ఆత్రేయ. ఆయన రాసిన 'అశోక సామ్రాట్' నాటకం చదివి గోపాలరాయ శర్మ 'నటుడిగా తప్ప రచయితగా రాణించలే'వనడంతో పట్టుదలతో నాటక రచనలో తన ప్రతిభను నిరూపించుకున్నారు.

పోయినవి పోగా నేడు ఆత్రేయ రాసిన 10 నాటకాలు, 15 నాటికలు లభ్యమవుతున్నాయి. నాటకాల్లో మొదటి ఆరు– గౌతమబుద్ధ, అశోక సామ్రాట్, పరివర్తన, వాస్తవం, ఈనాడు, ఎన్‌జీఓ... చిత్రరంగంలో అడుగు పెట్టడానికి ముందు రాసినవి కాగా – విశ్వశాంతి, కప్పలు, భయం, మనసు–వయసు అనే నాలుగు సినీ రంగంలో ఉండగా రాసినవి. వీటిలో మొదటి రెండూ చారిత్రకాలు, శాంతి ప్రబోధాత్మకాలు. యుద్ధానికి పూర్వం అశోకుణ్ణి దుష్టుడిగా చిత్రించి ఆత్రేయ 'నెగటివ్ షేడ్'తో నాయక పాత్రను సృష్టించడానికి నాంది పలికారు. 'పరివర్తన'లో పెట్టుబడిదారులు శ్రమశక్తితో పాటు మేధాశక్తిని కూడా ఎలా దోచుకుంటున్నారో చూపించారు. నిస్వార్థ ప్రజా సేవకులు రాజకీయ రంగంలో రాణించలేరనే సార్వకాలిక సత్యాన్ని 'వాస్తవం' నాటకంలో ఆవిష్కరించారు. 'ఈనాడు' హిందూ మహమ్మదీయ మత సామరస్యం ప్రధానాంశంగా రాసిన నాటకం కాగా – 'విశ్వశాంతి' నేటికీ ప్రపంచాన్ని వణికిస్తున్న యుద్ధోన్మాదాన్ని ఒక కుటుంబంలోని పాత్రలకు అన్వయిస్తూ రాసిన ప్రయోగాత్మక, ప్రయోజనాత్మక నాటకం. నీటితో నిండిన చెరువులోకి కప్పలు చేరినట్టు సంపద కలిగిన ఇంటికి బంధువులు వస్తారనే సుమతీ శతకంలోని నీతిని కళ్లకు కట్టించిన కౌటుంబిక నాటకం 'కప్పలు'. ప్రపంచవ్యాప్తంగా అన్ని వర్గాలనూ భయపెడుతున్న ఒత్తిడి, అభద్రతలకు అద్దం పట్టిన సహజత్వం నిండిన నాటకం 'భయం'. ఇక ఆత్రేయకు గొప్ప పేరును తెచ్చిన 'ఎన్‌జీఓ' మధ్యతరగతి సమస్యల సమాహారం. ఇలా ఆత్రేయ నాటకాలన్నింటిలోనూ సామాజిక స్పృహ ఆయన దార్శనికతను ప్రతిబింబింపజేస్తూ – వాటిని సజీవం చేసింది.



ఆచార్య ఆత్రేయ

ఆత్రేయ రాసిన 15 నాటికలలో 3 ప్రాచ్యానుసరణలు, 3 పాశ్చాత్యానుసరణలు కాగా, మిగిలిన తొమ్మిది స్వతంత్ర నాటికలు. పాశ్చాత్యానుసరణల్లో 'ప్రగతి' శాంతికాముకత ప్రధానాంశంగా కలిగినది కాగా, 'వర ప్రసాదం' మూఢ విశ్వాసాల మీద గొడ్డలి వేటు. స్వతంత్ర నాటికల్లో మకుటాయమానమైనది 'ఎవరు దొంగ?' ఈ నాటికలో దొంగల కంటే దొరల రూపంలోని దొంగలే సమాజానికి ప్రమాదకారులనే హెచ్చరిక ఉంది. మిగిలిన నాటికలు రాజకీయ, సామాజిక కళా రంగాలకు, కౌటుంబిక సమస్యలకు సంబంధించినవి.

ఆత్రేయ జీవిత చరమాంకంలో కూడా సినిమా రచన కంటే నాటక రచనలోనే తనకు స్వేచ్ఛ ఉందనే అభిప్రాయంతో మళ్లీ పదునైన నాటకాలు రచించి సామాజిక రుగ్మతల మీద ఎక్కుపెడతాననేవారు. 'ఎర్రమల్లెలు', 'దేవుడు నాస్తికుడయ్యాడు', 'ఆఖరి నాటకం' – అనే మకుటాలతో విప్లవాత్మక నాటకాలను రాస్తానని అభిమానులను ఆశపెట్టేవారు. కానీ తన శిష్యతుల్యుడైన గణేష్ పాత్రో ప్రశ్నకు 'మనం నాటకాన్ని ప్రేమించి, సినిమాను పెళ్లాడాం. మన బ్రతుకులింతే' అంటూ మళ్లీ నాటకాలు రాయలేక పోవడానికి తన అశక్తతను వెల్లడించారు.

వ్యాసకర్త సినీ పరిశోధకులు | 99891 06162

దేవుడు సర్వాంతర్యామి

దేవుడు ఆలయాలలో మాత్రమే దర్శనమిస్తాడని ఒక శిష్యుడు అనుకున్నాడు. ఆ నమ్మకానికి తగినట్టే వివిధ ఆలయాలకు వెళ్ళి వస్తుండేవాడు. అతను ఏ ఏ గుళ్ళకు వెళ్ళి వస్తున్నాడో అక్కడ చూస్తున్న దేవుళ్ళ గురించి తనకేది తెలిస్తే వాటి వివరాలు గురువుగారికి చెప్తుండేవాడు. అయితే అతని తీరులో మార్పు తీసుకురావాలని అనుకున్నారు గురువుగారు.

ఓరోజు గురువుగారు ఆశ్రమ ఆవరణలో ఓ పాత్రలో ఉంచిన నీటిలోకి తదేకంగా చూస్తూ కావాలనే నిల్చున్నారు. అది గమనించిన శిష్యుడు నీటిలో ఏం చూస్తున్నారని అడిగాడు. 'ఈ నీటిలో జాబిల్లి ఎంత అందంగా ఉన్నాడో. ఆ బింబాన్ని చూస్తూ ఆస్వాదిస్తున్నాను' అన్నారు గురువు. ఆ మాటలు శిష్యుడికి విచిత్రంగా అనిపించాయి. అయినా వినయంగానే అడిగాడు – 'గురువుగారూ! ఇలా నీటిలో చంద్రబింబాన్ని కష్టపడి చూడటమెందుకండీ. ఇదొట్టి బింబమే కదా. తలపైకెత్తి చూస్తే ఆకాశాన ఉన్న నిజమైన చంద్రుడు ఎంచక్కా చూసి మరింత ఆనందంగా ఆస్వాదించవచ్చు కదండీ' అన్నాడు.



అతను చెప్పిన మాటలన్నీ విన్న గురువుగారు 'ఏంటి నాయనా! ప్రపంచం అంతటా, ప్రకృతిలోనూ ఉన్న ఆ భగవంతుడిని నువ్వు ఎక్కడెక్కడో ఉన్న ఆలయాలకు వెళ్ళి అక్కడ మాత్రమే ఉన్నాడనుకుని అన్వేషించడం లేదూ? నువ్వలా వెతకడం తప్పులేదు కానీ నేను చంద్రుడిని నీటిలో చూడకూడదా' అని అడిగారు. గురువుగారు తనకు ఏం చెప్పదలచుకున్నారో శిష్యునికి అప్పుడు కానీ అర్థం కాలేదు.

దేవుడు సర్వాంతర్యామి. ఆయన మనలోనూ ఉన్నాడు. నిజానికి దేవుడు రూపాతీతుడు. మంచి మనసులో, మంచి మాటలో, మంచి పనిలో దేవుడుంటాడు.

– యామిజాల జగదీశ్

వాడవాడలా వేడుకగా..

సాక్షి, నెట్‌వర్క్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. గ్రామాల్లో పర్యటిస్తోన్న ప్రజాప్రతినిధులకు ప్రతి ఇంటి వద్ద ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోంది. ఓ వైపు వర్షం కురుస్తున్నా అన్ని జిల్లాల్లో శనివారం ఈ కార్యక్రమం వేడుకగా సాగింది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఏమైనా సమస్యలు తమ దృష్టికి వస్తే అక్కడికక్కడే పరిష్కరించారు. తమ సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌కి తమ ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయని ప్రజాప్రతినిధులను ప్రజలు దీవించారు.


పల్నాడు జిల్లా 88త్యాళ్లూరులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు


అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా


పశ్చిమగోదావరి జిల్లా కరుగోరుమిల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు


శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా చిలకపాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

వామపక్ష ఐక్యతే తక్షణ కర్తవ్యం


విజయవాడలో జరుగుతున్న సీపీఐ జాతీయ మహాసభల్లో సంఘీభావం తెలుపుతున్న నాయకులు

- సీపీఐ ప్రధాన కార్యదర్శి రాజా ఉద్ఘాటన
- సీపీఐ 24వ జాతీయ మహాసభల్లో ప్రతినిధుల సభ ప్రారంభం

సాక్షి, అమరావతి: దేశానికి ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ వంటి విచ్ఛిన్నకర శక్తుల నుంచి ప్రమాదం తీవ్రమవుతోందని, ఇటువంటి పరిస్థితుల్లో ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు వామపక్ష, ప్రజాస్వామ్య, లౌకిక శక్తుల ఐక్యతే తక్షణ కర్తవ్యమని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఉద్ఘాటించారు. విజయవాడలో నిర్వహిస్తున్న సీపీఐ 24వ జాతీయ మహాసభల్లో భాగంగా శనివారం గురుదాస్ దాస్‌గుప్తా నగర్(ఎస్‌ఎస్ కన్వెన్షన్ హాలు)లో ప్రతినిధుల సభ ప్రారంభమైంది. ఈ సందర్భంగా డి.రాజా ప్రారంభోపన్యాసం చేశారు. 'విజయవాడలో జరుగుతున్న జాతీయ మహాసభలకు ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు, శ్రామిక పార్టీల ప్రతినిధులు, భారతదేశంలోని వామపక్ష పార్టీల నాయకులు, దేశం నలుమూలల నుంచి పార్టీ ప్రతినిధులు పెద్ద ఎత్తున తరలిరావడం మన ఐక్యతను చాటుతోంది. దేశంలోనే మూడోసారి సీపీఐ జాతీయ మహాసభలకు ఆతిథ్యం ఇస్తున్న ఏకైక నగరం విజయవాడ కావడం గర్వకారణం. అటువంటి మహత్తర గడ్డపై జరుగుతున్న మహాసభలు. వామపక్ష, ప్రజాస్వామ్య, లౌకిక శక్తుల ఐక్యతను సాధించేందుకు వేదికగా నిలుస్తాయని భావిస్తున్నాను. ప్రపంచ వ్యాప్తంగా నయా ఉదారవాదం, మత ఛాందసవాదం, విద్వేషం, వివక్ష వంటి వాటికి వ్యతిరేకంగా వామపక్షాలు పోరాడుతున్నాయి. ఇదే స్ఫూర్తితో మార్క్సిస్ట్–లెనినిస్ట్ భావజాలంతో అంతర్జాతీయంగా లోతైన బంధాలను పెంపొందించుకోవడం ద్వారా మానవాళికి మంచి భవిష్యత్ కోసం ముందుకు సాగుదాం' అని పిలుపునిచ్చారు.

మెరుగైన భారతదేశం కోసం ముందుకు సాగుదాం..

సీపీఐ జాతీయ మహాసభలకు సౌహార్ద్ర ప్రతినిధులుగా సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఫార్వర్డ్ బ్లాక్ నాయకుడు దేవరాజన్ హాజరై సందేశాలు ఇచ్చారు. ఏచూరి మాట్లాడుతూ లౌకిక ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంతోపాటు ప్రజలకు మేలు చేసే మెరుగైన భారతదేశం కోసం ఐక్యంగా ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ శక్తుల ఫాసిస్ట్ చర్యలను తిప్పికొట్టేందుకు కార్మికులు, రైతులు, కూలీలను సమన్వయం చేసుకుని ఐక్య ఉద్యమాలను నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. దీపాంకర్ భట్టాచార్య మాట్లాడుతూ సామాజిక, రాజకీయ, ఆర్థిక విపత్తుల నుంచి దేశాన్ని రక్షించేందుకు శక్తివంతమైన, లోతైన ప్రజాస్వామ్య పునాదుల ఆధారంగా భారతదేశాన్ని పునర్నిర్మించాల్సిన బాధ్యత కమ్యూనిస్టులపై ఉందన్నారు. దేవరాజన్ మాట్లాడుతూ దేశంలో వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తుల పునరేకీకరణ బాధ్యతను సీపీఐ, సీపీఎం తీసుకోవాలని కోరారు. సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆహ్వాన సంఘం తరఫున ప్రతినిధులకు స్వాగతం పలికి సందేశం ఇచ్చారు. సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, ఏపీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం నేతలు పి.మధు, వి.శ్రీనివాసరావు, వివిధ రాష్ట్రాల సీపీఐ ప్రతినిధులు, విదేశీ ప్రతినిధులు పాల్గొన్నారు. తొలుత జాతీయ పతాకాన్ని స్వాతంత్ర్య సమరయోధుడు ఏటుకూరి కృష్ణమూర్తి, కమ్యూనిస్టు పార్టీ పతాకాన్ని సురవరం సుధాకర్‌రెడ్డి, అమరవీరుల స్మారక స్తూపాన్ని సీపీఐ కంట్రోల్ కమిషన్ మాజీ చైర్మన్ ఈడ్పుగంటి నాగేశ్వరరావు ఆవిష్కరించారు.

ఆర్బీకేల సేవలు అద్భుతం

కేరళ బృందం ప్రశంసలు


గండిగుంట ఆర్బీకేలో వివరాలు తెలుసుకుంటున్న కేరళ బృందం

సాక్షి, అమరావతి/ఉయ్యూరు/గన్నవరం: ఆంధ్రప్రదేశ్‌లో రైతు భరోసా కేంద్రాల సేవలు అద్భుతమని కేరళ అధికారులు ప్రశంసించారు. ఏపీ తరహాలోనే సమీకృత సమాచార కేంద్రం (ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్)ను కేరళలో ఏర్పాటు చేస్తామన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాల వారీగా ఏపీ ప్రభుత్వం తెస్తున్న మ్యాగజైన్లతోపాటు వ్యవసాయ, ఉద్యాన పంచాంగాలను ఈ వ్యవసాయ సీజన్ నుంచి తమ రాష్ట్రంలోనూ తెస్తామన్నారు. ఈ మేరకు కేరళ వ్యవసాయ శాఖ సంచాలకులు టీవీ సుభాష్ సారథ్యంలో కేరళ ప్రైస్ బోర్డు చైర్మన్ డాక్టర్ రాజశేఖరన్ నాయర్, వ్యవసాయ శాఖ అదనపు కార్యదర్శి సబీర్ హుస్సేన్, అదనపు సంచాలకుడు సునీల్‌తో కూడిన ఉన్నతాధికారుల బృందం శనివారం రాష్ట్రంలో పర్యటించింది. ఎన్టీఆర్ జిల్లా గన్నవరంలోని ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ (ఐసీసీ), ఆర్బీకే చానల్‌ను సందర్శించింది. అనంతరం ఉయ్యూరు మండలం గండిగుంటలో ఆర్బీకే–2ను సందర్శించి రైతులతో భేటీ అయ్యారు. వ్యవసాయ సలహా మండళ్ల సేవలతో పాటు పొలం బడి, డిజిటల్ బ్యాంకింగ్ సేవల వివరాలను తెలుసుకున్నారు.

ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తాం..

ఆర్బీకే సందర్శన తర్వాత కేరళ బృందం విజయవాడలో అధికారులతో సమావేశమైంది. గత మూడేళ్లుగా వ్యవసాయ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన సంస్కరణలు, ఆర్బీకేల ద్వారా అందిస్తున్న సేవలపై ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ డాక్టర్ గెడ్డం శేఖర్‌బాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

సీఎం జగన్‌కు హ్యాట్సాఫ్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామ స్థాయిలో రైతులకు సేవలందిస్తున్న తీరు నిజంగా అద్భుతం. టెక్నాలజీని ఇంతలా వినియోగించుకుంటున్న ప్రభుత్వాన్ని ఇప్పటివరకు చూడలేదు. ఐసీసీ ద్వారా శాస్త్రవేత్తలతో రైతులకు సాగు సలహాలు ఇప్పించడం, ఆర్బీకేల్లోని కియోస్క్‌లో బుక్ చేసుకోగానే నేరుగా రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు ఇస్తున్న విధానం చాలా బాగుంది. ఆర్బీకేల ద్వారా విత్తు నుంచి విక్రయం వరకు రైతులకు అండగా నిలుస్తున్న తీరు అద్భుతం. ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి హ్యాట్సాఫ్. మిమ్మల్ని స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్తాం.

– టీవీ సుభాష్, డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, కేరళ

మోహిత్ పాదయాత్ర చరిత్రాత్మకం

- ఎంపీ మిథున్‌రెడ్డి ప్రశంస
- జగనన్న స్ఫూర్తితో పాదయాత్ర : మోహిత్‌రెడ్డి


పథకాలను వివరిస్తున్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి, ఎంపీపీ మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: ఏడు నెలల పాటు 2,005 పల్లెలు, 115 సచివాలయాల పరిధిలో 1.46 లక్షల ఇళ్లకు తిరుపతి ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేపట్టిన 1,600 కిలోమీటర్ల మహా పాదయాత్ర చరిత్రాత్మకమని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ప్రశంసించారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడైన మోహిత్‌రెడ్డి చేపట్టిన గడపగడపకు మహాపాదయాత్ర శనివారం పదో రోజుకు చేరుకుంది. తిరుపతి జిల్లా తిరుచానూరులో జరుగుతున్న ఈ పాదయాత్రలో ఎంపీ మిథున్‌రెడ్డి కూడా పాల్గొని, సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మిథున్‌రెడ్డి మాట్లాడుతూ ఏ పనినైనా చిత్తశుద్ధితో విజయవంతంగా పూర్తి చేసే ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తున్న మోహిత్‌రెడ్డి మంచి నాయకుడుగా ఎదుగుతారని చెప్పారు. జగనన్న స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కరమే ధ్యేయంగా మహాపాదయాత్ర చేస్తున్నట్లు మోహిత్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ విప్, తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ రాజధాని వద్దు..

- చాగల్లులో అమరావతి పాదయాత్రికులకు నిరసన సెగ
- స్థానికులను రెచ్చగొట్టేలా పాదయాత్రికుల నినాదాలు
- పరిస్థితి ఉద్రిక్తం.. కట్టడి చేసిన పోలీసులు


చాగల్లులో పాదయాత్రకు ప్లకార్డులు, నల్ల బెలూన్లతో నిరసన తెలుపుతున్న స్థానికులు

చాగల్లు: అమరావతి రైతుల పాదయాత్రకు తూర్పుగోదావరి జిల్లా చాగల్లులో స్థానికుల నుంచి నిరసన ఎదురైంది. శనివారం ఉదయం చాగల్లు మండలంలో ఎస్ ముప్పవరం నుంచి ప్రారంభమైన పాదయాత్ర ఊనగట్ల మీదుగా చాగల్లుకు చేరింది. చాగల్లు మండల వైఎస్సార్‌సీపీ నేతలతోపాటు వివిధ వర్గాలకు చెందిన వారు ఉదయం తొమ్మిది గంటలకే చాగల్లు ప్రధాన కూడలి వద్దకు చేరుకున్నారు. నల్ల చొక్కాలు, నల్ల కండువాలు ధరించారు. వీరంతా ప్లకార్డులు పట్టుకుని మూడు రాజధానులకు మద్దతు పలుకుతూ అమరావతి యాత్రపై నిరసన వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ రాజధాని వద్దు.. మూడు రాజధానులే ముద్దు, వికేంద్రీకరణతోనే రాష్ట్రాభివృద్ధి.. అంటూ నినాదాలు చేశారు. నల్ల బెలూన్లను గాల్లోకి ఎగురవేశారు. అమరావతి పాదయాత్రలో కొంతమంది ప్రభుత్వానికి వ్యతిరేకంగా రెచ్చగొట్టేలా నినాదాలు చేయడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. రెండు వర్గాల వారూ పోటాపోటీగా నినాదాలు చేసుకున్నారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి.. అవాంఛనీయ ఘటనలు జరక్కుండా జాగ్రత్తలు తీసుకున్నారు. వికేంద్రీకరణకు మద్దతుగా జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పోసిన శ్రీలేఖ, ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాసరావు, ఎంపీపీలు మట్టా వీరాస్వామి, జొన్నకూటి పోసిబాబు, కొవ్వూరు మునిసిపల్ చైర్మన్ భావన రత్నకుమారి, చాగల్లు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు ఆత్కూరి దొరయ్య, మాజీ సర్పంచ్ గంధ్రోతు సురేంద్రకుమార్, స్థానికులు పాల్గొన్నారు.

అతి ప్రమాదకర దేశం

పాకిస్తాన్‌పై బైడెన్ వ్యాఖ్యలు



వాషింగ్టన్: ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన దేశాల్లో పాకిస్తాన్ ఒకటని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వ్యాఖ్యానించారు. ఇతర దేశాలతో సమన్వయం లేకుండా ఆ దేశం అణ్వాయుధాలను కలిగి ఉందంటూ తప్పుబట్టారు. గురువారం డెమొక్రటిక్ కాంగ్రెస్ ప్రచార కమిటీ భేటీలో ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్ అభ్యంతరాలు, ఆందోళనలను పట్టించుకోకుండా పాక్‌కు ఎఫ్–16 యుద్ధ విమానాల మరమ్మతు, విడిభాగాల సరఫరా, ఆధునీకరణకు సాయపడాలని అమెరికా సెప్టెంబర్లోనే నిర్ణయించడం తెలిసిందే. అమెరికా సహకారంతో ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడాలని ప్రయత్నాలు చేస్తున్న పాక్‌లోని షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వానికి బైడెన్ వ్యాఖ్యలతో ఎదురుదెబ్బ తగిలినట్టయింది. 1998లో పాకిస్తాన్ తొలిసారిగా అణు ప్రయోగాలు చేసిన దగ్గర్నుంచి ఆ అయుధాలు ఉగ్రవాదుల చేతుల్లో పడతాయన్న ఆందోళన పశ్చిమ దేశాల్లో ఉంది. మరోవైపు బైడెన్ వ్యాఖ్యలపై పాకిస్తాన్ విస్మయం వ్యక్తం చేసింది. పాక్‌లో అమెరికా రాయబారి డోనాల్డ్ బ్లోమ్‌కి సమన్లు పంపింది. పాకిస్తాన్ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అణ్వాయుధాల భద్రత అంశంలో తాము అంతర్జాతీయ ప్రమాణాలన్నింటినీ పాటిస్తున్నామని స్పష్టం చేశారు.

చిక్కుల్లో బ్రిటన్ ప్రధాని

ట్రస్ పీఠం కిందకు నీళ్లు!

- బ్రిటన్‌ను వణికిస్తున్న ద్రవ్యోల్బణం
- మినీ బడ్జెట్ ఫ్లాప్, ఆర్థిక మంత్రిపై వేటు
- ఆర్థిక విధానంపై అప్పుడే యూ టర్న్
- కన్జర్వేటివ్ పార్టీలో తీవ్ర వ్యతిరేకత?
- ప్రధానిగా మళ్లీ తెరపైకి రిషి పేరు

దాదాపు నెలన్నర క్రితం సంగతి. సెప్టెంబర్ 5న భారత సంతతికి చెందిన మాజీ మంత్రి రిషి సునాక్‌ను ఓడించి లిజ్ ట్రస్ బ్రిటన్ ప్రధాని పీఠమెక్కారు. అడ్డూ అదుపూ లేకుండా పెరిగిపోయిన జీవన వ్యయాన్ని తగ్గిస్తానని, చుక్కలనంటుతున్న ఇంధన ధరలకు ముకుతాడు వేస్తానని, కట్టు తప్పుతున్న ఆర్థిక వ్యవస్థను గాడిన పెడతానని ప్రకటించారు. 'చేసి చూపిస్తా'మంటూ ప్రతిజ్ఞ చేశారు. కానీ నెల రోజుల్లోనే అన్నివైపుల నుంచీ ఆమెకు గట్టిగా సెగ తగులుతోంది. ఆర్థిక వ్యవస్థను పట్టాలకెక్కించేందుకు ఆమె ప్రతిపాదించిన విధానాలన్నీ ద్రవ్యోల్బణ కట్టడిలో ఒక్కొక్కటిగా విఫలమవుతున్నాయి. ట్రస్ తొలి మినీ బడ్జెట్ అన్ని వర్గాల్లోనూ తీవ్ర విమర్శల పాలైంది. ప్రధానంగా కార్పొరేషన్ ట్యాక్స్‌ను 19 శాతానికి తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకుని దాన్ని ఎప్పట్లా 25 శాతంగానే కొనసాగిస్తామంటూ యూ టర్న్ తీసుకోవాల్సి వచ్చింది. ఈ పరిణామాలన్నీ కన్జర్వేటివ్ నేతలు, ఎంపీలను బాగా కలవరపెడుతున్నాయి. వారిలో ట్రస్‌పై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని బ్రిటిష్ మీడియా పేర్కొంటోంది. ఆర్థిక మంత్రిపై ఇప్పటికే వేటు పడింది. ప్రధాని మార్పు కూడా అనివార్యమని ఎంపీల్లో అత్యధికులు భావిస్తున్నారని చెబుతోంది. సమస్యలను చక్కదిద్దడంలో, సొంత పార్టీ నేతల విశ్వాసాన్ని నిలుపుకోవడంలో విఫలమవుతున్న ట్రస్ ఏ క్షణమైనా తప్పుకోవాల్సి రావచ్చంటున్నారు! ఆమె రాజీనామాకు టోరీ ఎంపీలు త్వరలో బహిరంగ పిలుపు ఇచ్చే అవకాశముందని బ్రిటిష్ మీడియాలో వార్తలొస్తున్నాయి!!

ఆరేళ్లు, నలుగురు ప్రధానులు

ఆరేళ్లుగా అధికార కన్జర్వేటివ్ పార్టీకి అన్నీ కష్టాలే ఎదురవుతున్నాయి. యూరోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ వైదొలగడంపై 2016లో బ్రెగ్జిట్ రిఫరెండం నిర్వహించినప్పటి నుంచి ఏకంగా నలుగురు ప్రధానులు మారారు! 2016లో డేవిడ్ కామెరాన్ తప్పుకుని థెరెసా మే ప్రధాని అయ్యారు. కానీ బ్రెగ్జిట్ ఒప్పందంపై ప్రతిష్టంభన ఆమె పీఠానికి ఎసరు పెట్టింది. 2019లో బోరిస్ జాన్సన్ పగ్గాలు చేపట్టారు. మూడేళ్లయినా నిండకుండానే ఆయనా అనేకానేక వివాదాల్లో చిక్కుకున్నారు. దాంతో అయిష్టంగానే గత జూలైలో రాజీనామా చేయాల్సి వచ్చింది. ఇప్పుడిక ట్రస్ వంతు కూడా వచ్చినట్టేనంటూ ఊహాగానాలు విన్పిస్తున్నాయి. ఆర్థిక విధానాలపై యూ టర్న్ తీసుకోవడం ఆమెకు అప్రతిష్ట తెచ్చిపెట్టిందంటున్నారు.



– సాక్షి, నేషనల్ డెస్క్

రిషివైపే టోరీ ఎంపీల మొగ్గు?

ట్రస్ తప్పుకుంటే తదుపరి ప్రధానిగా రిషి పేరే ప్రముఖంగా విన్పిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఆయనే సమర్థ ప్రత్యామ్నాయమని కన్జర్వేటివ్ ఎంపీలు భావిస్తున్నట్టు బ్రిటిష్ మీడియా చెబుతోంది. రిషీని ప్రధానిగా, పెన్నీ మోర్డంట్‌ను ఆయనకు డిప్యూటీగా నియమించే ఆలోచన సాగుతోందంటున్నారు. లేదంటే మోర్డంట్ ప్రధానిగా, రిషి ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టొచ్చని ఊహాగానాలు విన్పిస్తున్నాయి. చివరికి మళ్లీ బోరిస్ జాన్సనే తిరిగొచ్చినా ఆశ్చర్యం లేదంటున్న వాళ్లూ ఉన్నారు!

ఇవీ 'తప్పు'టడుగులు...

- ఆర్థిక మంత్రిగా తొలిసారిగా నల్ల జాతీయుడైన క్వాసీ క్వార్టెంగ్‌ను ట్రస్ ఎంచుకున్నారు. పౌరుల నివాస పన్నులు, ఇంధన ఖర్చులను తగ్గించడంతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రతిష్టంభనను వదిలించేందుకు ఆయన ప్రకటించిన మినీ బడ్జెట్ పూర్తిగా బెడిసికొట్టింది. ఏకంగా 4,500 కోట్ల పౌండ్ల మేరకు పన్ను తగ్గింపులను ప్రకటించారు. ద్రవ్యోల్బణం చుక్కలనంటుతున్న వేళ ఇది ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేస్తుందంటూ విమర్శలు వెల్లువెత్తాయి. బ్రిటన్ కరెన్సీ పౌండ్ విలువ రికార్డు స్థాయిలో పడిపోయింది.
- తొలుత ఆర్థిక మంత్రి నిర్ణయాన్ని సమర్థించిన ట్రస్, కొద్ది రోజులకే యూ టర్న్ తీసుకుంటూ అత్యధిక స్థాయి ఆదాయ పన్ను రేటు తగ్గింపును రద్దు చేయడం వివాదానికి దారితీసింది. పైగా ఇది సొంత పార్టీలోనూ ఆమెపై తీవ్ర అసంతృప్తికి దారి తీయడంతో ఎటూ పాలుపోక క్వాసీని తప్పించి జెరెమీ హంట్‌కు ఆర్థిక శాఖ అప్పగించారు. రిషి పన్నుల పెంపు ప్రతిపాదనలను తీవ్రంగా వ్యతిరేకించిన ఆమె, ఇప్పుడు ఆయన బాటలోనే నడవడాన్ని అసమర్థతగానే అంతా భావిస్తున్నారు.

సాయిబాబాకు చుక్కెదురు

ఆయన విడుదల తీర్పును సస్పెండ్ చేసిన సుప్రీంకోర్టు

- బాంబే హైకోర్టు తీరును తప్పుబట్టిన ధర్మాసనం
- గృహనిర్బంధంలో ఉంచాలన్న విజ్ఞప్తికీ తిరస్కరణ
- నాగపూర్ జైల్లోనే ఉండనున్న సాయిబాబా తదితరులు



సాక్షి, న్యూఢిల్లీ: మావోయిస్టు సంబంధాల కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబాను నిర్దోషిగా విడుదల చేస్తూ బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సస్పెండ్ చేసింది. "సాయిబాబాపై మోపిన నేరాలు చాలా తీవ్రమైనవి. సమాజ ప్రయోజనాలకు, దేశ సమగ్రతకు, సార్వభౌమాధికారానికి విఘాతం కలిగించేవి. నేర తీవ్రత తదితరాలను పరిగణనలోకి తీసుకోకుండా సాంకేతికాంశాల ఆధారంగా బాంబే హైకోర్టు తీర్పునిచ్చింది" అంటూ తప్పుబట్టింది. అంగవైకల్యం, అనారోగ్య కారణాల రీత్యా తనను కనీసం గృహ నిర్బంధంలో ఉంచాలన్న సాయిబాబా విజ్ఞప్తినీ తిరస్కరించింది. బెయిల్ కోసం తాజాగా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశమిచ్చింది. దాంతో సాయిబాబా తదితరులు నాగపూర్ సెంట్రల్ జైల్లోనే ఉండనున్నారు. ఆయనను 2014 ఫిబ్రవరిలో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు తీర్పును దురదృష్టకరంగా వామపక్ష కార్యకర్తలు, సానుభూతిపరులు అభివర్ణించారు. తీర్పును నిరసిస్తూ సాయిబాబా విడుదల కోసం ఢిల్లీ యూనివర్సిటీలో ధర్నా చేసిన 40 మంది విద్యార్థులు, అధ్యాపకులను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారి సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుందని వామపక్ష విద్యార్థి సంఘాలు ఆరోపించాయి.

మహారాష్ట్ర తీవ్ర అభ్యంతరాలు

సాయిబాబాతో సహా మరో ఐదుగురిని నిర్దోషులుగా ప్రకటిస్తూ బాంబే హైకోర్టు ఈ నెల 14న తీర్పు ఇవ్వడం తెలిసిందే. దాన్ని సవాలు చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. శనివారం సెలవు దినమైనా న్యాయమూర్తులు జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ బేలా ఎం.త్రివేదిలతో కూడిన ప్రత్యేక ధర్మాసనం దీనిపై అత్యవసరంగా విచారణ జరిపింది. మహారాష్ట్ర ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా హైకోర్టు తీర్పుపై తీవ్ర అభ్యంతరాలు తెలిపారు. "చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ) ప్రకారం సాయిబాబాను విచారించడానికి ముందుగా అనుమతి పొందలేదనే కారణంతో నిర్దోషిగా ప్రకటించడం సరికాదు. కేసులోని యథార్థాలను పరిశీలించకుండా కేవలం సాంకేతిక అంశాల ఆధారంగా హైకోర్టు తీర్పు చెప్పింది. యూఏపీఏ చట్టం ప్రకారం అనుమతి పొందకపోవడాన్ని ట్రయల్ కోర్టులో గానీ, ఇతర కోర్టుల్లో గానీ సాయిబాబా సవాల్ చేయలేదు. కస్టడీలోకి తీసుకున్నాక ఆయన బెయిలు కోసం దరఖాస్తు చేస్తే కోర్టు తిరస్కరించింది. ఈ కేసుకు యూఏపీఏ సెక్షన్ 43(సీ)ని వర్తింపజేసిన దృష్ట్యా సెక్షన్ 465 ప్రకారం సాయిబాబాను నిర్దోషిగా విడుదల చేయడం సరికాదు" అన్నారు. సాయిబాబా తరఫు న్యాయవాది ఆర్.బసంత్ దీనిపై అభ్యంతరం తెలిపారు. "సాయిబాబాకు 52 ఏళ్లు. 90 శాతం శారీరక వైకల్యముంది. పెళ్లి కాని 23 ఏళ్ల కూతురుంది. అనారోగ్యంతో చక్రాల కుర్చీకి పరిమితమయ్యారు. ఆయనకు నేర చరిత్ర లేదు. ఏడేళ్లకు పైగా జైల్లో ఉన్నారు. రోజువారీ పనులూ చేసుకోలేకపోతున్నారు. షరతులతోనైనా ఇంటి వద్దే ఉండేందుకు అనుమతివ్వాలి" అని కోరారు.

మెదడు చాలా డేంజరస్: ధర్మాసనం

ఈ వాదనలపై సొలిసిటర్ జనరల్ అభ్యంతరం తెలిపారు. "ఇటీవల అర్బన్ నక్సల్స్ ఎక్కువగా గృహ నిర్బంధాలు కోరుతున్నారు. వారు ఇంట్లో ఉండే మెదడు సాయంతో ప్రతిదీ చేస్తారు. ఫోన్లు కూడా వాడుకుంటారు. కాబట్టి గృహ నిర్బంధానికి అవకాశం ఇవ్వొద్దు" అని కోరారు. "జమ్మూ కశ్మీర్‌లో వేర్పాటువాద ఉద్యమంతోనూ సాయిబాబాకు సంబంధముంది. మావోయిస్టు కమాండర్ల భేటీలను ఏర్పాటు చేయడం వంటి పనులతో దేశ ప్రజాస్వామిక వ్యవస్థపై యుద్ధానికి తోడ్పాటునందించారు. మావోయిస్టులకు ఆయన మేధో శక్తిగా ఉంటూ వారి భావజాలాన్ని వ్యాప్తి చేస్తూ వచ్చారు" అని ఆరోపించారు. మెదడు చాలా ప్రమాదకరమైనదని జస్టిస్ షా అన్నారు. ఉగ్రవాద లేక మావోయిస్టు కార్యకలాపాలకు సంబంధించినంత వరకు మెదడే సర్వస్వమని అభిప్రాయపడ్డారు. గృహ నిర్బంధం విజ్ఞప్తిని తిరస్కరించారు. సాక్ష్యాలను సమగ్రంగా పరిశీలించిన తరువాతే నిందితులను దోషులుగా నిర్ధారించారన్నారు. "హైకోర్టు కూడా సాయిబాబా తదితరులపై కేసులను కొట్టేయలేదు. కింది కోర్టు నిర్ధారించిన అంశాలను తోసిపుచ్చలేదు. కేవలం వారి విడుదలకు మాత్రమే ఆదేశించింది" అని ధర్మాసనం గుర్తు చేసింది. విచారణను డిసెంబర్ 8కి వాయిదా వేసింది.

కోర్టుల్లో స్థానిక భాష: మోదీ

- చట్టాలనూ స్థానిక భాషల్లో రాయాలి
- మాతృభాషలోనూ న్యాయ విద్య
- అప్పుడే అందరికీ సత్వర న్యాయం
- ఆలిండియా న్యాయ మంత్రుల సదస్సులో ప్రధాని సందేశం



కేవడియా (గుజరాత్): న్యాయమందే ప్రక్రియలో ఆలస్యం దేశ ప్రజలు ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య అని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. సమర్థ దేశం, సామరస్యపూర్వక సమాజం నెలకొనాలంటే బాధితుల పట్ల సానుభూతితో స్పందించే న్యాయవ్యవస్థ చాలా అవసరమన్నారు. "కఠినమైన న్యాయ పరిభాష పౌరులకు అడ్డంకిగా నిలిచే పరిస్థితి మారాలి. కొత్త చట్టాలను స్థానిక భాషల్లో రాయాలి. కోర్టుల్లో స్థానిక భాషల వాడకం పెరగాలి. తద్వారా న్యాయప్రక్రియను మరింత సులభతరం చేయాల్సిన అవసరం ఎంతో ఉంది" అని చెప్పారు. గుజరాత్‌లోని కేవడియా సమీపంలో ఏక్తానగర్‌లో శనివారం మొదలైన రెండు రోజుల అఖిల భారత న్యాయ మంత్రులు, కార్యదర్శుల సదస్సును ఉద్దేశించి మోదీ వీడియో సందేశమిచ్చారు. ఈ ఉద్దేశంతోనే బ్రిటిష్ కాలం నాటి 1,500కు పైగా కాలం చెల్లిన, పనికిరాని పాత చట్టాలను తమ ప్రభుత్వం గత ఎనిమిదేళ్లలో బుట్టదాఖలు చేసిందన్నారు. "లోక్ అదాలత్‌ల వంటి ప్రత్యామ్నాయ న్యాయ ప్రక్రియలు కోర్టులపై భారాన్ని తగ్గించడంతో దోహదపడుతున్నాయి. పేదలకు సులువుగా సత్వర న్యాయమూ దొరుకుతోంది. చట్టాల్లోని కాఠిన్యం, గోప్యత లేనిపోని సంక్లిష్టతలకు దారి తీస్తుంది. అలాగాక అవి సామాన్యునికి కూడా అర్థమయ్యేలా ఉంటే ఆ ప్రభావం వేరుగా ఉంటుంది. పలు దేశాల్లో చట్టాలు చేసినప్పుడు అందులోని న్యాయపరమైన పారిభాషిక పదాలను అందరికీ వివరిస్తారు. స్థానిక భాషలోనూ రాస్తారు. అలా అందరికీ అర్థమయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటారు. మరికొన్ని దేశాల్లో చట్టాలు చేసేటప్పుడే అవి ఎంతకాలం పాటు అమల్లో ఉండేదీ ముందే నిర్ణయిస్తారు. మనమూ వీటిని అందిపుచ్చుకోవాలి. యువతకు న్యాయ విద్యను కూడా స్థానిక భాషల్లో అందించేందుకు చర్యలు తీసుకోవాలి" అన్నారు. సవాళ్లను అధిగమించేందుకు భారత న్యాయవ్యవస్థ చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు.

ఇంధనావసరాలు తీర్చేందుకు ఉమ్మడి కృషి

పరిశోధన సంస్థలకు మోదీ పిలుపు

న్యూఢిల్లీ: నానాటికీ పెరిగిపోతున్న దేశ ఇంధన అవసరాలను తీర్చేందుకు పరిశ్రమ, పరిశోధన, విద్య తదితర రంగాలన్నీ ఉమ్మడిగా కృషి చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు.అన్ని రంగాల్లోనూ శాస్త్రీయ దృక్పథాన్ని, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వంటివాటి వాడకాన్ని పెంచాలన్నారు. శనివారం కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్) భేటీని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. భారత్‌ను ప్రపంచ సారథిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా విజన్ 2047 దిశగా కృషి చేయాలని సూచించారు.



ఉన్ని టోపీల ప్రదర్శనలో గిన్నిస్ రికార్డు

వైమానిక దళ సభ్యుల సతీమణుల సంక్షేమ సంఘం (ఏఎఫ్‌డబ్ల్యూడబ్ల్యూఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన 41,541 ఉన్ని టోపీల ప్రదర్శన గిన్నిస్ రికార్డు నెలకొల్పింది. 3 వేల మంది మూణ్నెల్లు శ్రమించి నాలుగు టన్నుల ముడి ఉన్నితో వీటిని అల్లారు. శనివారం గిన్నిస్ రికార్డు గుర్తింపు పత్రం అందుకున్న సందర్భంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఐఏఎఫ్ చీఫ్ వీఆర్ చౌధరి తదితరులు ఇలా హర్షం వెలిబుచ్చారు.

ముందు మీ పార్టీలో ఎన్నికలు పెట్టుకోండి

బీజేపీకి కాంగ్రెస్ నేత థరూర్ చురకలు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష ఎన్నికలు ప్రహసనమంటూ బీజేపీ పేర్కొనడంపై కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల బరిలో ఉన్న శశిథరూర్ తీవ్రంగా స్పందించారు. విమర్శలకు ముందుగా కాషాయ పార్టీ ఎన్నికలు జరుపుకోవాలని పేర్కొన్నారు. 'మా అంతర్గత సమస్యలను పరిష్కరించుకోగల సత్తా మాకుంది. మా పార్టీ ఎన్నికల్లో మీ జోక్యం అవసరం లేదు' అని స్పష్టం చేశారు. 'కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నిక ఒక ప్రహసనమే అని తేలింది. పోటీ సమఉజ్జీల మధ్య జరగడం లేదు. థరూర్‌కు సరైన వివరాలతో కూడిన డెలిగేట్ల జాబితాను కూడా ఇవ్వలేదు' అంటూ అంతకుముందు బీజేపీ నేత మాలవీయ ట్వీట్ చేశారు. 'పార్టీ రాష్ట్రాల అధ్యక్షులు ఖర్గే వైపే మొగ్గు చూపుతున్నారు. గాంధీ కుటుంబానికి మరో ఎంఎంఎస్ 2.0 వెర్షన్ రానుంది' అంటూ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌నుద్దేశించి పరోక్షంగా అందులో పేర్కొన్నారు.

బీజేపీ ఎస్సీ, ఎస్టీ వ్యతిరేకి: రాహుల్

సాక్షి, బళ్లారి: కర్ణాటకలోని బీజేపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ వ్యతిరేకి అని, 40% కమిషన్ ప్రభుత్వమని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. బీజేపీ హయాంలో రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలు అణచివేతకు గురవుతున్నారని, వారిపై నేరాలు 50% పెరిగాయన్నారు. ఏ పని అయినా 40 శాతం కమిషన్ ముట్టజెప్పనిదే కావడం లేదని విమర్శించారు. భారత్ జోడో యాత్ర 1,000 కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని శనివారంతో బళ్లారిలో జరిగిన బహిరంగ సభలో రాహుల్ మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం కోసం కేటాయించిన నిధులను ప్రభుత్వం వేరే పథకాలకు మళ్లిస్తోందని ఆరోపించారు. రాష్ట్ర బీజేపీ సర్కార్ ఎస్సై ఉద్యోగానికి రూ.80 లక్షలు వసూలు చేసింది, ఇలాంటి అవినీతి ప్రభుత్వం అవసరమా అని ప్రశ్నించారు. 'రూ.80 లక్షలు ముట్టచెపితే మీరు పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ అవుతారు. మీ దగ్గర డబ్బుంటే ప్రభుత్వ ఉద్యోగాన్ని కొనుక్కోవచ్చు. డబ్బు లేని వాళ్లకు జీవితంలో ఉద్యోగం రాదు' అని రాహుల్ అన్నారు.



ఆకలి కేకలు

- ప్రపంచ ఆకలి సూచీలో భారత్‌కు 107వ స్థానం
- బంగ్లాదేశ్, పాక్ కంటే వెనుకబాటు

న్యూఢిల్లీ: భారత్‌లో ఆకలి కేకలు తీవ్ర రూపం దాలుస్తున్నాయి. ప్రపంచ ఆకలి సూచిలో మన దేశం ఏకంగా ఆరు స్థానాలు పడిపోయింది. 101 నుంచి 107కు దిగజారిపోయింది. బంగ్లాదేశ్, పాకిస్తాన్‌ల కంటే మనం వెనుకబడి ఉండడం ఆందోళన కలిగిస్తోంది. మొత్తం 121 స్థానాలకు గాను భారత్ 107 స్థానంలో ఉన్నట్టుగా 2022 సంవత్సరానికి గాను గ్లోబల్ హంగర్ ఇండెక్స్ వెల్లడించింది. చైల్డ్ వేస్టింగ్ రేటులో (పోషకాహార లోపంతో అయిదేళ్ల వయసులోపు పిల్లల్లో ఎదుగుదల లేకపోవడం) 19.3 శాతంతో ప్రపంచంలోనే భారత్ తొలి స్థానంలో ఉంది. ఐరిష్ సహాయ సంస్థ కన్సర్న్ వరల్డ్‌వైడ్, జర్మనీకి చెందిన వెల్ట్ హంగర్ హిల్ఫ్ ఈ ఆకలి సూచి నివేదికని రూపొందించాయి.

నివేదిక ఏం చెప్పిందంటే...

- 2021లో ప్రపంచ ఆకలి సూచిలో 116 దేశాలకు గాను భారత్ 101వస్థానంలో నిలిచింది. ఈ ఏడాది 121 దేశాల్లో 107 ర్యాంకుకి చేరుకుంది. 2020లో భారత్ 94వ స్థానంలో ఉంది.
- జీహెచ్ఐ స్కోర్ తగ్గుతూ వస్తోంది.. 2000 సంవత్సరంలో 38.8 ఉన్న స్కోర్ 2014–2022లలో 28.2–29.1 మధ్య ఉంటూ వస్తోంది.
- ఆసియా దేశాల్లో యుద్ధంతో అతాలకుతలమవుతున్న అఫ్గానిస్తాన్ మాత్రమే 109వ ర్యాంకుతో మన కంటే వెనుకబడి ఉంది. జీహెచ్ఐ స్కోరు అయిదు కంటే తక్కువగా ఉన్న దాదాపుగా 17 దేశాలు తొలి పది స్థానాల్లో నిలిచాయి. చైనా, కువైట్‌లు తొలి స్థానాలను దక్కించుకున్నాయి.
- ఇరుగుపొరుగు దేశాలైన పాకిస్తాన్ (99), బంగ్లాదేశ్ (84), నేపాల్ (81), శ్రీలంక (64) మన కంటే మెరుగైన స్థానాల్లో ఉన్నాయి
- చైల్డ్ వేస్టింగ్, చైల్డ్ స్టంటింగ్ (పౌష్టికాహార లోపంతో అయిదేళ్ల లోపు పిల్లల్లో ఎదుగుదల లోపాలు) రేటులో కూడా భారత్ బాగా వెనుకబడి ఉండడం ప్రమాదఘంటికలు మోగిస్తోంది.
- భారత్, పాకిస్తాన్, అఫ్గానిస్తాన్‌లో చైల్డ్ స్టంటింగ్ రేటు 35 నుంచి 38శాతం మధ్య ఉంది.
- పౌష్టికాహారలోపంతో బాధపడేవారు 2018–2020లో 14.6శాతం ఉంటే 2019–2021 నాటికి 16.3శాతానికి పెరిగింది. ప్రపంచవ్యాప్తంగా 82.8 కోట్ల మంది పౌష్టికాహార లోప బాధితుల్లో 22.4 కోట్ల మంది భారత్‌లోనే ఉన్నారు.
- పౌష్టికాహార లోపంతో అయిదేళ్ల వయసు లోపు పిల్లల మరణాలు 2014లో 4.6శాతం ఉంటే 2020 నాటికి 3.3శాతానికి తగ్గాయి.
- భారత్‌లోని ఛత్తీస్‌గఢ్, గుజరాత్, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాల్లో పిల్లల్లో పౌష్టికాహార లోపాల్లో తగ్గుదల కనిపిస్తోంది.
- ఆహార భద్రత, ప్రజారోగ్యం, ప్రజల సామాజిక ఆర్థిక హోదా, తల్లి ఆరోగ్యం విద్య వంటి అంశాల్లో భారత్‌లో పరిస్థితులు రోజు రోజుకి దిగజారుతున్నాయి. అయితే రాష్ట్రాల వారీగా వేర్వేరు పరిస్థితులు కనిపిస్తున్నాయి.
- కోవిడ్–19 దుష్పరిణామాలు, రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, వాతావరణ మార్పులు వంటివి ప్రపంచ దేశాల్లో ఆకలి కేకల్ని పెంచేస్తున్నాయి.



భారత్ ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం

అంతర్జాతీయంగా భారత్ ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నాల్లో భాగంగానే ప్రపంచ ఆకలి సూచిని రూపొందించారని కేంద్ర ప్రభుత్వం ధ్వజమెత్తింది. ఆకలి సూచిని లెక్కించే పద్ధతిలోనే తప్పులు తడకలు ఉన్నాయని విరుచుకుపడింది. ఈ అంశాన్ని ఆహార, వ్యవసాయ సంస్థ దష్టికి తీసుకువెళుతున్నట్టుగా కేంద్ర మహిళా, శిశు అభివద్ధి మంత్రిత్వ శాఖ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. క్షేత్రస్థాయిలో పరిస్థితుల్ని పరిశీలించకుండా భారత్ ప్రతిష్టను దెబ్బ తీయాలని ప్రయత్నిస్తున్నారని పేర్కొంది.

విరుచుకుపడిన విపక్షాలు

దేశంలో రోజు రోజుకి ఆకలి కేకలు పెరిగిపోతూ ఉండడంపై కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై విపక్షాలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డాయి. ఎనిమిదన్నరేళ్లలోనే మోదీ ప్రభుత్వం దేశాన్ని చీకట్లోకి నెట్టేసిందని ధ్వజమెత్తాయి. పెరిగిపోతున్న ధరలు, తరిగిపోతున్న ఆహార నిల్వలు గురించి కేంద్రం పట్టించుకోవడం లేదని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆరోపించారు. ఇకనైనా కేంద్రం తాను చేస్తున్న తప్పుడు ప్రచారాలను ఆపేయాలన్నారు.

అసాధ్యాలను సుసాధ్యం చేసిన మోదీ: అమిత్ షా



సిమ్లా: ఆర్టికల్ 370 రద్దు, రామ మందిర నిర్మాణం సహా గతంలో అందరూ అసాధ్యమని భావించిన వాటిని నరేంద్ర మోదీ ప్రభుత్వం సుసాధ్యం చేసి చూపిందని హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం సిర్మౌర్ జిల్లాలో శనివారం జరిగిన బీజేపీ ఎన్నికల ర్యాలీలో మంత్రి ప్రసంగించారు. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దవుతుందని మీలో ఎవరైనా ఊహించారా? అంటూ హాజరైన వారినుద్దేశించి ఆయన ప్రశ్నించారు. జవహర్ లాల్ నెహ్రూ తీసుకువచ్చిన ఆర్టికల్ 370ను గురించి ఎవరైనా ప్రశ్నిస్తే కాంగ్రెస్ నాయకులు మిన్నకుండిపోతారని ఎద్దేవా చేశారు. అయోధ్యలో మందిర నిర్మాణం అసాధ్యమని కాంగ్రెస్ పెదవి విరిస్తే తాము బృహత్ రామాలయం పనులను ప్రారంభించామని చెప్పారు. 'వంశ రాజకీయాలకు ప్రధాని మోదీ ముగింపు పలికారు. ఢిల్లీలోని రాజ్‌పథ్‌కు కర్తవ్యపథ్‌గా పేరు పెట్టి, సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు'అని అమిత్ షా అన్నారు. ప్రపంచంలోని ఆర్థిక వ్యవస్థల్లో 11వ స్థానంలో ఉన్న భారత్.. మోదీ నాయకత్వంలో ఐదో స్థానానికి చేరుకుందని ఆయన పేర్కొన్నారు.

క్లుప్తంగా...

ప్రిస్క్రిప్షన్‌పై 'శ్రీహరి'

మధ్యప్రదేశ్ సీఎం వ్యాఖ్యలు

భోపాల్: హిందీలో వైద్య విద్యను అందించిన తొలి రాష్ట్రంగా మధ్యప్రదేశ్ రికార్డు సృష్టించనుందని ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ శనివారం ప్రకటించారు. హిందీలో వైద్య విద్య పూర్తిచేసిన డాక్టర్లు ఇకపై ప్రిస్క్రిప్షన్లపై తొలుత 'శ్రీహరి' అని రాసి తర్వాత మందుల పేర్లు రాయొచ్చన్నారు. "పిల్లల్లో హిందీ పట్ల అభిమానాన్ని పెంచాలి. ఇంగ్లిష్ మందుల పేర్లను హిందీలో రాస్తే వచ్చి ఇబ్బంది ఏమిటి?" అన్నారు. మధ్యప్రదేశ్‌లో వైద్య విద్యను హిందీ భాషలో బోధించేందుకు రంగం సిద్ధమయ్యింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదివారం భోపాల్‌లో హిందీలో వైద్య పాఠ్యపుస్తకాలను విడుదల చేయనున్నారు.

కశ్మీరీ పండిట్ హత్య

శ్రీనగర్: జమ్మూ కశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో ఉగ్రవాదులు ఓ కశ్మీరీ పండిట్‌ను కాల్చి చంపారు. షోపియాన్ జిల్లా చౌధరి గుండ్‌కు చెందిన పూరన్ క్రిషన్ సింగ్ శనివారం ఉదయం గ్రామంలోని తన తోట నుంచి స్కూటర్‌పై ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యంలో పొంచి ఉండి కాల్పులు జరిపారు. ఉగ్రవాదుల కోసం గాలిస్తున్నారు. ఘటనకు కశ్మీర్ ఫ్రీడం ఫైటర్ బాధ్యత ప్రకటించుకుందని డీజీపీ తెలిపారు.

ఐదుగురు ఉద్యోగులు డిస్మిస్

జమ్మూ: జాతి వ్యతిరేక కార్యకలాపాల ఆరోపణలపై ఒక పోలీస్ అధికారి సహా నలుగురు ప్రభుత్వోద్యోగులు, ఒక బ్యాంకు మేనేజర్‌ను జమ్మూ కశ్మీర్ యంత్రాంగం డిస్మిస్ చేసింది.

టర్కీ బొగ్గు గనిలో ఘోర ప్రమాదం... 40 మంది దుర్మరణం

అమాస్రా: ఉత్తర టర్కీలో అమాస్రా పట్టణంలోని బొగ్గు గనిలో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 40 దుర్మరణం పాలయ్యారు. శుక్రవారం సాయంత్రం పేలుడు జరిగినప్పుడు గనిలో 110 మంది కార్మికులు పనిచేస్తున్నట్టు సమాచారం. "58 మంది క్షేమంగా బయటకు వచ్చారు. 11 మంది గాయపడ్డారు. ఒకరి సమాచారం తెలియాల్సి ఉంది" అని అధికారులు తెలిపారు.

కీవ్ ప్లాంట్‌పై క్షిపణి దాడి

కీవ్: ఉక్రెయిన్‌పై రష్యా భీకర ప్రతీకార దాడులు కొనసాగుతున్నాయి. రాజధాని కీవ్‌లోని విద్యుదుత్పత్తి కేంద్రంపై క్షిపణి దాడి దెబ్బకు చాలాప్రాంతాలకు కరెంటు సరఫరా నిలిచిపోయింది. కొన్ని రోజులుగా ఉక్రెయిన్‌లోని భవనాలు, మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకొని రష్యా సైన్యం దాడులకు పాల్పడుతోంది. కీవ్, లెవివ్‌లో భీకర దాడులు సాగిస్తోంది. వైమానిక దాడులు ఆగవని రష్యా అధ్యక్షుడు పుతిన్ చెప్పారు. రష్యా విలీనం చేసుకున్న ప్రాంతాల్లో మళ్లీ పాగా వేసేందుకు ఉక్రెయిన్ సేనలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి.

డీహెచ్ఎఫ్ఎల్ కేసులో... 75 మందిపై చార్జిషీట్

న్యూఢిల్లీ: రూ.34 వేల కోట్ల బ్యాంకులను మోసగించిన కేసులో దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్(డీహెచ్ఎఫ్ఎల్) మాజీ సీఎండీ కపిల్ వాధవన్, మరో 74 మందిపై సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసింది. ఢిల్లీలోని సీబీఐ కోర్టులో వేసిన చార్జిషీట్‌లో ఆ సంస్థ మాజీ డైరెక్టర్ ధీరజ్ వాధవన్, మాజీ సీఈవో హర్షిల్ మెహతా పేర్లు కూడా ఉన్నాయని అధికార వర్గాలు తెలిపాయి. 17 బ్యాంకుల కన్సార్టియంను రూ.34 వేల కోట్ల మేర మోసగించినట్లు డీహెచ్ఎఫ్ఎల్‌పై ఆరోపణలున్నాయి.

నరబలి ఘటనపై నోటీసులు

న్యూఢిల్లీ: కేరళ నరబలి ఘటనపై నివేదిక ఇవ్వాలంటూ కేరళ ప్రభుత్వానికి జాతీయ మానవ హక్కుల సంఘం నోటీసులు జారీ చేసింది. దీనిపై మీడియా కథనాలను సుమోటోగా విచారణకు స్వీకరించింది. నాగరిక సమాజంలో ఇలాంటి దారుణాలను ఊహించలేమని పేర్కొంది. చట్టాలంటే ఏమాత్రం భయంలేకుండా మూఢనమ్మకంతో మనుషులను చంపడం చాలా ఘోరమని పేర్కొంది.



అబ్దుల్ కలాంకు ఘన నివాళి

జగ్గయ్యపేట అర్బన్: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని శనివారం నిర్వహించారు. కలాం విగ్రహానికి ఎమ్మెల్యే సామినేని ఉదయ భాను పూలమాలలు వేసి నివాళులర్పించారు.



మంత్రులపై దాడి అమానుషం

పెడన: విశాఖలో గర్జన కార్యక్రమానికి హాజరై తిరిగి వస్తున్న మంత్రుల కార్లపై జన సైనికుల రాళ్ల దాడికి నిరసనగా శనివారం రాత్రి పెడనలో వైఎస్సార్ సీపీ శ్రేణులు నిరసన ప్రదర్శన నిర్వహించాయి.



నకిలీ పులిచర్మం అమ్మకానికి యత్నం

కృత్రిమంగా తయారు చేసిన పులిచర్మం, గోళ్లు నిజమైనవిగా నమ్మించి విక్రయించేందుకు ప్రయత్నించిన ఐదుగురిని పెనమలూరు పోలీసులు శనివారం అరెస్టు చేశారు. -8లో▸

● నృత్య సమ్మోహనం



ఘంటసాల సంగీత కళాశాలలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ కూచిపూడి నృత్యోత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. కూచిపూడి నాట్య సంప్రదాయాన్ని పాటిస్తూ కళాకారులు శనివారం పలు అంశాలను మనోహరంగా ప్రదర్శించారు. శ్రీమయి వెంపటి బృందం ప్రదర్శించిన శ్రీ కృష్ణ పారిజాతం నృత్య రూపకం సమ్మోహనంగా సాగింది.

- విజయవాడ కల్చరల్

ధాన్యం కొనుగోల్‌కు సన్నాహాలు

- ఉమ్మడి జిల్లాలో 492 ఆర్బీకేల్లో కొనుగోళ్లు
- పారదర్శకంగా ధాన్యం సేకరించేలా చర్యలు
- ఇందుకు అనుగుణంగా సిబ్బంది నియామకాలు
- నవంబర్ రెండో వారం నుంచి కొనుగోళ్లు ప్రారంభం



మొవ్వ గ్రామంలో వరి కంకులు పాలుపోసుకుంటున్న దశలో చేలు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఖరీఫ్ ధాన్యం సేకరణకు పౌర సరఫరాల సంస్థ అధికారులు సన్నాహాలు చేపట్టారు. నవంబర్ రెండో వారం నుంచి రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకేలు) ద్వారా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించేలా కసరత్తు చేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో 44,869 హెక్టార్లు, కృష్ణా జిల్లాలో 1,58,290 హెక్టార్లలో వరి సాగవుతోంది. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా అంటే జూన్ పదో తేదీ నుంచి కృష్ణా డెల్టాకు సాగు నీరు విడుదల చేసింది. దీంతో ముందుగానే వరిసాగు ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో నవంబర్ మొదటి వారంలోనే వరి కోతలు ప్రారంభం అవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. దీనికి అనుగుణంగా రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు సాగేందుకు వీలుగా వలంటీర్ల సేవలను వినియోగించుకోనుంది. ఉమ్మడి జిల్లాలో ఏడు లక్షల టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించారు.

సాంకేతికతతో దళారులకు చెక్

ధాన్యం సేకరణలో దళారులు, మిల్లర్ల పాత్రకు అడ్డుకట్ట వేసేందుకు వీలుగా అధికారులు సాంకేతిక వ్యవస్థను అభివృద్ధి చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో 1.50 లక్షల టన్నులు, కృష్ణా జిల్లాలో 5.50 లక్షల టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఎన్టీఆర్ జిల్లాలో 169 ఆర్బీకేలు, కృష్ణా జిల్లాలో 323 ఆర్బీకేల్లో ప్రాథమిక సహకార సొసైటీలు, డీసీఎంఎస్‌లు, మార్కెటింగ్ శాఖల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ధాన్యం సేకరణ సజావుగా సాగేందుకు వీలుగా మిల్లుల వద్ద కస్టోడియన్ అధికారులను నియమిస్తున్నారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్లు శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్, మహేష్‌కుమార్ రావిరాల ఇప్పటికే అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోళ్లపై దిశానిర్దేశం చేశారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రెండు జిల్లాల్లో అధికారులకు శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

ఎన్టీఆర్ జిల్లాలో వరి సాగు :	44,869 హెక్టార్లు
ధాన్యం సేకరణ లక్ష్యం:	1.50 లక్షల టన్నులు
కృష్ణా జిల్లాలో వరి సాగు :	1,58,290 హెక్టార్లు
ధాన్యం సేకరణ లక్ష్యం:	5.50 లక్షల టన్నులు
ఏ-గ్రేడ్ ధాన్యం మద్దతు ధర :	రూ. 2,060
సాధారణ రకం మద్దతు ధర :	రూ. 2,040

క్లస్టర్లుగా ఆర్బీకేల విభజన

ధాన్యం సేకరణ సామర్థ్యాన్ని బట్టి ఆర్బీకేలను క్లస్టర్లుగా గుర్తించారు. ఎన్టీఆర్ జిల్లాలో ఏ-కేటగిరీలో 15, బీ-కేటగిరీలో 40, సీ-కేటగిరీలో 114 ఆర్బీకేలను చేర్చారు. టెక్నికల్ అసిస్టెంట్లు 169 మంది, వలంటీర్లు 522 మంది, కస్టోడియన్ అధికారులు 30 మందిని నియమించారు. 48 వేబ్రిడ్జిలు అవసరమని గుర్తించారు. కృష్ణా జిల్లాలో ఏ-కేటగిరీలో 145, బీ-కేటగిరీలో 106, సీ-కేటగిరీలో 72 ఆర్బీకేలను చేర్చారు. టెక్నికల్ అసిస్టెంట్లు 323 మంది, వలంటీర్లు 1,114 మంది, కస్టోడియన్ అధికారులు 138 మందిని నియమించారు. 46 వేబ్రిడ్జిలు అవసరమని గుర్తించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి కృష్ణా జిల్లాలో ఈ నెల 12వ తేదీ నుంచి, ఎన్టీఆర్ జిల్లాలో శనివారం నుంచి అధికారులకు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి.

ఈ-క్రాప్ ఆధారంగా కొనుగోళ్లు



ఎన్టీఆర్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నాం. రైతులు ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకు ధాన్యం విక్రయించేలా చర్యలు తీసుకున్నాం. ధాన్యం సేకరణలో దళారులకు అడ్డుకట్ట వేసేలా ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తెస్తోంది. ఈ-క్రాప్ ఆధారంగా ధాన్యం కొనుగోలు చేస్తాం. రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలి. ధాన్యం కొనుగోలుకు అవసరమైన 37.50 లక్షల సంచులను సిద్ధం చేస్తున్నాం.

– శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్, జాయింట్ కలెక్టర్, ఎన్టీఆర్ జిల్లా

సజావుగా ధాన్యం సేకరణ



ఆర్బీకేల్లో సజావుగా ధాన్యం కొనుగోళ్లు జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నాం. తూకంలో వ్యత్యాసాలు, తేమ శాతం పేరుతో మద్దతు ధరలో కోతపెట్టకుండా చర్యలు తీసుకొంటున్నాం. ఇందు కోసం మిల్లుల వద్ద కస్టోడియన్ అధికారులను నియమిస్తున్నాం. జిల్లాకు అవసరమైన 1.37 కోట్ల సంచులను సిద్ధం చేస్తున్నాం. ధాన్యం కొనుగోలు సిబ్బందికి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి.

– మహేష్‌కుమార్ రావిరాల, జాయింట్ కలెక్టర్, కృష్ణా జిల్లా


చలనచిత్ర వాణిజ్య మండలి ఉపాధ్యక్షుడిగా రాంప్రసాద్



గుడివాడ టౌన్: దక్షిణ భారత చలన చిత్ర వాణిజ్య మండలి ఉపాధ్యక్షుడిగా తాను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు గుడివాడ పట్టణానికి చెందిన తుమ్మల రాంప్రసాద్ శనివారం తెలిపారు. ఈ ఎన్నికలు ఈ నెల 12వ తేదీన చెన్నై నగరంలో జరిగాయని పేర్కొన్నారు. 72 సంవత్సరాల అనంతరం ఈ పదవికి తాను ఏకగ్రీవంగా ఎన్నికయ్యానని వివరించారు. చెన్నైలో ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. రాంప్రసాద్ ప్రస్తుతం ఫిలిం ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యనిర్వాహక సభ్యుడిగా కొనసాగుతున్నారు. గతంలో ఆయన రెండు పర్యాయాలు ఆంధ్రప్రదేశ్ ఫిలిం చాంబర్ కార్యదర్శిగా పని చేశారు. తెలుగు ఫిలిం చాంబర్ ఎగ్జిబిటర్ల సెక్టార్ అధ్యక్షుడిగానూ సేవలు అందించారు.

కృష్ణమ్మకు వరద ఉధృతి

కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక



సముద్రంలోకి విడుదలవుతున్న వరద

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణానది వరద ఉధృతితో పరవళ్లు తొక్కుతోంది. ఎగువ ప్రాజెక్టుల నుంచి వస్తున్న వరద, తెలంగాణతోపాటు ఎన్టీఆర్ జిల్లాలో విస్తారంగా వర్షాలు పడటంతో బ్యారేజీకి భారీగా నీరు వచ్చి చేరుతోంది. బ్యారేజీకి చెందిన 70 గేట్లను 13 అడుగుల మేర ఎత్తివేసి వరద నీటిని సముద్రంలోకి వదిలారు. ఎగువ నుంచి 4,53,067 క్యూసెక్కులు వరద వస్తుండగా, కాలువలకు 2,827 క్యూసెక్కులు, 4,50,240 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలారు. బ్యారేజీ వద్ద ఒకటో నంబర్ ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని పర్యవేక్షిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలకు కట్టలేరు, వైరా, ఏనుగు గడ్డ వాగు పొంగిపొర్లుతున్నాయి. పలు చోట్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వీరులపాడు మండలం పల్లంపల్లి నుంచి నందిగామ మండలంలోని దాములూరు కూడలి వద్ద, గంపలగూడెం మండలం తోటమూల – వినగడప గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పంట పొలాలు నీటమునిగాయి. మరో రెండు, మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.

నకిలీ డాక్యుమెంట్లు సృష్టించిన ఇద్దరిపై కేసు

పెనమలూరు: యనమలకుదురులో నకిలీ డాక్యుమెంట్లు సృష్టించిన ఇద్దరు వ్యక్తులపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురుకు చెందిన మంచికలపూడి రాజేంద్రప్రసాద్, రావి సాంబశివరావు నిర్మాణం చేసిన భవనానికి తాడిగడప కమిషనర్ ప్రకాశరావు అక్రమ నిర్మాణంగా గుర్తించి నోటీసు ఇచ్చారు. దీనిపై ఆ ఇద్దరు వ్యక్తులు హైకోర్టును ఆశ్రయించి రిట్ పిటీషన్ 28448/2022 వేశారు. దీనికి గాను రెస్పాండెంట్‌గా ఉన్న కమిషనర్ ప్రకాశరావు కౌంటర్ వేయటానికి కోర్టు నుంచి పిటీషనర్లు వేసిన ఎగ్జిబిట్స్ (డాక్యుమెంట్లు)తీసుకున్నారు. అయితే భవన నిర్మాణానికి సంబంధించిన అనుమతులు 2015 వ సంవత్సరంలో పూర్వ యనమలకుదురు గ్రామ పంచాయతీ పేరున ఇచ్చినట్లు ఉన్నాయి. మునిసిపల్ సిబ్బంది పంచాయతీ పూర్వ రికార్డులతో పాటు ప్రస్తుత మునిసిపాలిటీ రికార్డులు పరిశీలించగా అసలు ఎటువంటి నిర్మాణాలకు అనుమతులు ఇచ్చినట్లు రికార్డుల్లో లేవని గుర్తించారు. దీంతో ఆ ఇద్దరు వ్యక్తులు భవన నిర్మాణానికి సంబంధించిన ఉత్తర్వులు ఫోర్జరీ చేసినట్టు నిర్ధారించుకుని కమిషనర్ ప్రకాశరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మంచికలపూడి రాజేంద్రప్రసాద్, రావి సాంబశివరావులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుకు వ్యవసాయ కూలీ మృతి


పిడుగుపడి మరణించిన దుర్గారావు(ఫైల్)

వత్సవాయి(జగ్గయ్యపేట): పిడుగుపాటుకు వ్యవసాయ కూలీ మృతిచెందిన సంఘటన శనివారం జరిగింది. గ్రామానికి చెందిన భీమాల దుర్గారావు(45) వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. ఉదయాన్నే వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లగా పిడుగుపాటుకు గురై పొలంలోనే మరణించాడు. మృతునికి భార్య పిల్లలున్నారు. వీఆర్వో వివరాలు నమోదు చేసుకుని తహసీల్దార్‌కు అందించారు.

రిమాండ్ ఖైదీల కేసులు సత్వరమే పరిష్కరించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక

చిలకలపూడి(మచిలీపట్నం): జైలులో ఉన్న రిమాండ్ ఖైదీల కేసులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక అన్నారు. జిల్లా కోర్టులోని తన చాంబర్‌లో శనివారం సాయంత్రం కో–ఆర్డినేషన్ కమిటీ, అండర్ ట్రైల్ ప్రిజన్స్ కమిటీ, ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలు కేసుల్లో రిమాండ్ విధించబడి పెండింగ్‌లో ఉన్న ఖైదీల కేసులను పరిష్కరించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అత్యాచారం, పోక్సో, హత్య కేసుల్లో నష్టపోయిన బాధితులకు జాతీయ న్యాయసేవాధికార సంస్థ సూచనల ప్రకారం నష్టపరిహారం చెల్లించే అవకాశం ఉందన్నారు. అటువంటి కేసులపై కమిటీ సమావేశంలో చర్చించి రెండు కేసుల్లో బాధితులకు నష్టపరిహారాన్ని మంజూరు చేశారు. ఈ నెల 22న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో దివ్యాంగుల సంక్షేమం, మాదకద్రవ్యాల బాధితులకు న్యాయసేవలు తదితర అంశాలపై సదస్సు నిర్వహిస్తామన్నారు. నవంబరు 12వ తేదీన నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో కూడా పోలీస్, రెవెన్యూ, న్యాయవాదుల ద్వారా కక్షిదారులు కేసులు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లు పి.రంజిత్‌బాషా, ఎస్.ఢిల్లీరావు, కృష్ణా, ఏలూరు జిల్లాల ఎస్పీలు పి.జాషువా, రాహుల్‌దేవ్ శర్మ, విజయవాడ మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి, విజయవాడ డీసీపీ మేరీప్రశాంతి, జిల్లా జైలు సూపరింటెండెంట్ హంసపాల్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.పద్మ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పులి చర్మం అమ్ముతున్న ఐదుగురు అరెస్టు

పెనమలూరు: నకిలీ పులిచర్మం, గోళ్లు విక్రయించి సొమ్ము చేసుకోవాలని యత్నిస్తున్న ఐదుగురిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. కృష్ణాజిల్లా పెనమలూరు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా వర రామచంద్రాపురానికి చెందిన కానూరి వంశీ వెంకట లక్ష్మీనారాయణ రూ.10 వేలతో కృత్రిమంగా తయారు చేసిన నకిలీ పులి చర్మం, గోళ్లను మూడేళ్ల క్రితం వేటపల్లి గ్రామంలో ఒకరి వద్ద కొన్నాడు. రెస్టారెంట్ వ్యాపారంలో నష్టపోయిన లక్ష్మీనారాయణ ప్రస్తుతం క్యాటరింగ్ పని చేస్తున్నాడు. అతని వద్ద పనిచేస్తున్న విజయవాడ కొత్తపేటకు చెందిన జి.యోగేంద్రభాస్కర్‌తో కలిసి నకిలీ పులి చర్మం అమ్మాలని నిర్ణయించుకున్నాడు. వీరికి గన్నవరం బీబీ గూడెంకు చెందిన దేవరపల్లి మోహనరావు, అదే ప్రాంతానికి చెందిన జలసూత్రం రాజు, దాసరి వినయ్‌కుమార్ కలిశారు. వీరు అయిదుగురూ కలసి నకిలీ పులిచర్మం, గోళ్లను అమ్మేందుకు శుక్రవారం రాత్రి కానూరు శ్మశానవాటిక వద్ద అనుమానాస్పద స్థితిలో తిరుగుతుండగా పోలీసుల తనిఖీలో పట్టుబడ్డారు. వారి వద్ద నకిలీ పులిచర్మం, గోళ్లు, ఐదు సెల్‌ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ పులిచర్మం, గోళ్లు

జిల్లాలో ఆరుగురు ఎస్ఐలు బదిలీ

కోనేరుసెంటర్(మచిలీపట్నం): జిల్లాలో ఆరుగురు సబ్ ఇన్‌స్పెక్టర్‌లు బదిలీ అయ్యారు. జిల్లా ఎస్పీ పి.జాషువా శనివారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన ఎస్ఐలంతా త్వరగా ఆయా స్టేషన్‌లలో బాధ్యతలు స్వీకరించాలని ఆయన ఆదేశించారు.

బదిలీ అయిన వారి వివరాలు

పేరు	ప్రస్తుత స్టేషన్	బదిలీ ప్రాంతం
డి.ఎస్ తాతాచార్యులు	పెదపారుపూడి	స్పెషల్‌బ్రాంచ్, కృష్ణా
టి.మురళి	పెడన	డీసీఆర్‌బీ, కృష్ణా
వి.రవిచంద్రకుమార్	వీఆర్, కృష్ణా	పెడన
డి.రాజేష్	బందరు ట్రాఫిక్	పెదపారుపూడి
కె.ఉషారాణి	హనుమాన్‌జంక్షన్	స్పెషల్‌బ్రాంచ్, కృష్ణా
జె.లక్ష్మి	కంకిపాడు (అటాచ్‌డ్)	కంకిపాడు

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి


మృతి చెందిన హిమబిందు మాధవి

పెనమలూరు: యనమలకుదురులో ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. సీఐ ఆర్.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు ఐదవ సచివాలయంలో వలంటీర్‌గా పనిచేస్తున్న వల్లభనేని హిమబిందుమాధవి(33) గ్రామంలోని ఇందిరానగర్‌లో భర్త విశ్వనాథపల్లి మోహనకృష్ణ ,ఇద్దరు కుమార్తెలతో ఉంటోంది. అట్లతద్దికి మచిలీపట్నంలోని పుట్టింటికి వెళ్లి ఈనెల 13న యనమలకుదురుకు తిరిగి వచ్చింది. అయితే శుక్రవారం రాత్రి భార్యాభర్తల మధ్య వివాదం తలెత్తింది. అనంతరం రాత్రి హిమబిందుమాధవి ఇంట్లో చీరతో ఉరేసుకుని మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న మృతురాలి పుట్టింటి వారు ఘటనాస్థలానికి వచ్చారు. మృతురాలి సోదరుడు వల్లభనేని సాయినాథ్ ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

క్లుప్తంగా

వాన నీరు నిలవకుండా చర్యలు

వీఎంసీ కమిషనర్



పాలిక్లినిక్ రోడ్డుల్లో ప్రధాన కాల్వను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రోడ్లపై వర్షం నీరు నిలవకుండా ఇంజినీరింగ్, ప్రజారోగ్యం, పట్టణప్రణాళిక విభాగం అధికారులు సమన్వయంతో పని చేసి చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చెప్పారు. ఆయన శనివారం పాలీక్లినిక్ రోడ్డులో పర్యటించారు. ఇక్కడ ప్రధాన మురుగు కాల్వను పరిశీలించారు. పూడికలను ఎప్పటికప్పుడు తొలగించాలని చెప్పారు. మరుగుదొడ్డి వ్యర్థాలు సైడు కాల్వలోకి వదలకుండా చూడాలని చెప్పారు. యూజీడీ తీసుకోని గృహాలు గుర్తించి నోటీసులివ్వాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ రోడ్డులో కల్వర్టుల వద్ద సిమెంట్ రాళ్లు ధ్వంసం కావడాన్ని గమనించిన కమిషనర్ వెంటనే వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. లార్వా నిర్మూలనకు ఆయిల్ బాల్స్, ఫాగింగ్ చేయించాలని తెలిపారు. అదనంగా కార్మికులను నియమించుకుని సమర్థంగా ఆ పనులు చేయాలని ఆరోగ్య విభాగం అధికారులను కమిషనర్ ఆదేశించారు. కార్పొరేషన్ ప్రజారోగ్య, ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఆయన వెంట ఉన్నారు.

గోదాముల నిర్మాణం వేగవంతం చేయాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): జిల్లాలో రైతు భరోసా కేంద్రాలకు అనుబంధంగా ఏర్పాటుచేస్తున్న గోదాముల (మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్లు) నిర్మాణాలను వేగవంతం చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాస్థాయి అమలు కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. రైతుల చేతికి పంట అందేలోపు గోదాముల నిర్మాణాలు పూర్తిస్థాయిలో జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, డీసీసీబీ, నాబార్డ్ సహకారంతో జిల్లాకు ప్రభుత్వం మొదటి దశలో మంజూరు చేసిన 500 టన్నుల సామర్థ్యంగల 52, 1000 టన్నుల సామర్థ్యం కలిగిన ఆరు గోదాముల నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. వీరులపాడు మండలంలోని ఆరు గ్రామాలు, విజయవాడ రూరల్ పరిధిలోని మూడు గ్రామాల్లో భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా సహకార శాఖ అధికారి సీహెచ్.శైలజ మాట్లాడుతూ.. మొదటి దశలో మంజూరయిన 58 గోదాముల్లో 49 వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని, నిర్ణీత సమయంలో పూర్తి చేస్తామని తెలిపారు. మార్కెటింగ్ శాఖ ద్వారా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు కంప్యూటర్లు, ఎలక్ట్రానిక్ మిషన్లు, తేమ శాతం కొలిచే డిజిటల్ మీటర్లు వంటి పరికరాల కొనుగోలుకు రూ.44 లక్షల విడుదలకు సమావేశంలో ఆమోదం తెలిపారు. జేసీ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.విజయభారతి, మార్కెటింగ్ ఏడీ కిషోర్, డీసీసీబీ ఏజీఎం వాసవికుమారి, సింధూజ పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయండి



క్రీస్తురాజుపురం యూపీహెచ్‌సీలో తనిఖీలు చేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లోని వైద్యులు, సిబ్బంది విధుల్లో అంకితభావంతో పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. ఆరోగ్య సమస్యలతో వచ్చే వారికి నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును తెలుసుకునేందుకు డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని శనివారం క్రీస్తురాజుపురం యూపీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. రోజువారీ అవుట్‌పేషెంట్స్ సంఖ్య, మందులు నిల్వలు, రక్తపరీక్షలు వంటి సేవలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు చేరువలోనే అందించే ఉద్దేశంతో యూపీహెచ్‌సీలో మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్దేశ్యం, లక్ష్యాలకు అనుగుణంగా వైద్యులు, సిబ్బంది పనిచేయాలని కోరారు. ఇక్కడకు వచ్చే ప్రతిరోగికి వ్యాధి నిర్ధారణ పరీక్షలకు పాటు, సరైన చికిత్స అందించాలని సూచించారు. ఆర్‌బీఎస్‌కే సమన్వయ అధికారి డాక్టర్ మాధవి, క్రీస్తురాజుపురం యూపీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అందరికీ స్ఫూర్తి అబ్దుల్‌కలాం



నివాళులర్పిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్



బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ అనురాధ, సంతోష్ తదితరులు



పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ఎం.రమేష్, రాజేష్ సీ జంపాల

పటమట(విజయవాడ తూర్పు): అబ్దుల్ కలాం అందరికీ స్ఫూర్తి అని మేయర్ భాగ్యలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 91వ జయంతి శనివారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అధికారులతో కలసి అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కలాం సైంటిస్ట్‌గా కెరీర్ మొదలుపెట్టి భారత సంరక్షణ కోసం అగ్ని అనే క్షిపణిని తయారు చేయడంలో కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో 53వ డివిజన్ కార్పొరేటర్ మహదేవ్ అప్పాజీరావు, అదనపు కమిషనర్(జనరల్) ఎం.శ్యామల, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, ప్రాజెక్ట్ ఆఫీసర్ యు.సి.డి శకుంతల, సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, ఎ.డి.హెచ్ శ్రీనివాసు, మేనేజర్ బి.శ్రీనివాసరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నలందలో..

లబ్బీపేట(విజయవాడతూర్పు): మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం అందరికీ స్ఫూర్తి అని నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ అన్నారు. అబ్దుల్ కలామ్ జయంతి , వరల్డ్ స్టూడెంట్స్ డే సందర్భంగా నలంద డిగ్రీ కళాశాలలో శనివారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. అబ్దుల్ కలామ్ జీవిత విశేషాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, బుక్ రివ్యూ, ప్రాజెక్ట్, చార్ట్ ప్రిపరేషన్ వంటి పోటీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కలాం విద్యార్థులతో ప్రేమగా కలిసిపోయేవారన్నారు. విలువలు, జీవిత లక్ష్యాలపై సందేశాలు ఇచ్చే వారన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న కోల్‌కత్తాలోని సంకల్ప్ సెమీ కండక్టర్స్ సీనియర్ డిజైన్ ఇంజినీర్ సంతోష్ మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ రంగంలోనే కాక, ఎలక్ట్రానిక్స్ రంగంలో కూడా అనేక రకాల ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. మరో అతిథి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌లో పరిశోధన చేస్తున్న అసోసియేట్ స్టాఫ్ ఇంజినీర్ సురేష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి స్వల్పకాలిక, దీర్ఘకాలిక కోర్సులపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

కలాం కృషి అభినందనీయం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): శాస్త్ర, సాంకేతిక రంగాల్లో డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం కృషి అభినందనీయమని పీబీ సిద్ధార్థ కళాశాల డీన్ రాజేష్ సీ జంపాల, ప్రిన్సిపాల్ ఎం.రమేష్ అన్నారు. శనివారం కళాశాల ఆవరణలోని సెమినార్ హాలులో కలాం జయంతి వేడుకలను నిర్వహించారు. ది మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలను అందిచారని రాజేష్ సీ జంపాల వివరించారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అధ్యాపకులు డాక్టర్ కె.శాంతకుమారి, సీహెచ్ రాజేశ్వరి, కె.చారి, అనంత సాయిలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.



చేతుల శుభ్రతను వివరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

చేతులు శుభ్రంగా ఉండాలి



చేతుల శుభ్రతపై ర్యాలీని నిర్వహిస్తున్న వీఎంసీ యూసీడీ పీవో శకుంతల



చేతులు కడుక్కోవడంపై అవగాహన పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న డీఈఐసీ సిబ్బంది

పటమట(విజయవాడ తూర్పు): చేతుల పరిశుభ్రత పాటించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. అంతర్జాతీయ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా శనివారం పటమట కేబీసీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల్లో గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ చేతుల శుభ్రతతో పలు రకాల వ్యాధులు ప్రబలకుండా కాపాడుకోవచ్చన్నారు. అనంతరం ఆయన చేతుల పరిశుభ్రత పద్ధతులను స్వయంగా చేసి చూపించారు. ప్రతి ఒక్కరూ ఈ పద్ధతులు పాటిస్తే వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సుహాసిని, జిల్లా విద్యాశాఖాధికారి రేణుక, జిల్లా గ్రామీణ నీటి సరఫరా పారిశుధ్య శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ డి.వెంకట రమణ, జిల్లా బాల స్వస్థ కార్యక్రమం సమన్వయ అధికారి డాక్టర్ మాధవి, డి.పి.ఆర్.సి డి.సి, ప్రాజెక్ట్ మేనేజర్ కృష్ణప్రసాద్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.ఎ.ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

వీఎంసీ ఆధ్వర్యంలో..

పటమట(విజయవాడ తూర్పు): గ్లోబల్ హ్యాండ్ వాష్ డే సందర్భంగా నగరపాలక సంస్థ 3 సర్కిళ్లలో నగరపాలక సంస్థ స్కూల్స్, అంగన్ వాడీ కేంద్రంలో, నైట్ షెల్టర్స్‌లలో వీఎంసీ యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శకుంతల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని, ర్యాలీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భోజనానికి ముందుగా చేతులు శుభ్రం చేసుకోవాలని చెప్పారు. అంటు రోగాలను నిరోధించాలంటే చేతులు నిరంతరం శుభ్రంగా ఉండాలన్నారు.

లబ్బీపేట(విజయవాడ తూర్పు): సబ్బుతో చేతులను పరిశుభ్రంగా కడుక్కోవడంతో ఎన్నో వ్యాధులను నివారించవచ్చని ఆర్‌బీఎస్‌కే , ఎన్‌సీడీ కార్యక్రమాల జిల్లా సమన్వయకర్త డాక్టర్ మాధవి అన్నారు. గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే పురస్కరించుకుని పాత ప్రభుత్వాస్పత్రిలోని జిల్లా ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్(డీఇఐసీ), జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఏటా ప్రపంచ వ్యాప్తంగా 35 లక్షల మంది చిన్నారులు డయేరియా, నిమోనియా వంటి వ్యాధులతో మరణిస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి వ్యాధులకు అడ్డుగట్ట వేయడానికి హ్యాండ్ వాష్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కరోనా నేపథ్యంలో చేతులు కడుక్కోవడం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డీఈఐసీ ఫిజియోథెరపిస్ట్ రాజేష్, సైకాలజిస్ట్ దుర్గాప్రసాద్, ఆప్టోమెట్రిస్ట్ ప్రతాప్‌కుమార్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అనస్థీషియాలో ఎన్నో అద్భుత ఆవిష్కరణలు



వేడుకల్లో అనస్థీషియాలజిస్టులు

ప్రభుత్వాస్పత్రి అనస్థీషియా హెచ్ఓడీ డాక్టర్ సూర్యశ్రీ

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రస్తుతం అనస్థీషియా వైద్య శాస్త్రంలో ఎన్నో అద్భుత ఆవిష్కరణలు జరిగినట్లు ప్రభుత్వాస్పత్రి అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ టి.సూర్యశ్రీ అన్నారు. అక్టోబరు 16 ప్రపంచ 176వ అనస్థీషియా డే పురస్కరించుకుని నగరంలోని ఓ హోటల్‌లో శనివారం వేడుకలు నిర్వహించారు. విజయవాడ సొసైటీ ఆఫ్ అనస్థీషియాలజిస్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నగరంలోని మత్తు వైద్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ దేవుడు ప్రాణం పోస్తాడన్నది నమ్మకమైతే, ఆ ప్రాణానికి ముప్పు వస్తే కాపాడేది వైద్యుడే అన్నది వాస్తవమన్నారు. అక్టోబరు 16, 1846న అనస్థీషియా చరిత్రలో అద్భుతాన్ని వైద్యులు ప్రదర్శించారని, మొదటి సారిగా అమెరికాలోని న్యూయార్క్ నగరంలో మసెచ్యూసెట్ ఆస్పత్రిలో ఓ రోగికి నాటి ఈథర్ వాయువు వాడకాన్ని ప్రయోగించినట్లు తెలిపారు. ఆ తర్వాత రోగి మెడపై ఉన్న కణితిని ఏ మాత్రం నొప్పి, బాధ తెలియకుండా సర్జరీ చేసినట్లు తెలిపారు. అప్పటి నుంచి నేటి వరకూ ఎన్నో అద్భుతాలు జరిగినట్లు తెలిపారు. కరోనా సమయంలో ఐసీయూల్లో ఉన్న రోగులకు మత్తు వైద్యులు అందించిన సేవలు ఎనలేనివని తెలిపారు. పూర్వం అశాస్త్రీయ పద్ధతిలో నిర్వహించిన సర్జరీలు తక్కువ సంఖ్యలో విజయవంతమయ్యేవని చెప్పారు. నేడు అత్యంత ఆధునికమైన నాణ్యమైన పద్ధతుల్లో విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎముకలు కీళ్లు, ఇఎన్‌టీ, పీడియాట్రిక్స్, జనరల్‌సర్జరీ, క్యాన్సర్ చికిత్సలు, గుండె మార్పిడి, వంటి అనేక సర్జరీల్లో మత్తు వైద్యుల పాత్ర మరువలేనిదన్నారు. నొప్పుల నియంత్రణకు పెయిన్‌క్లినిక్స్‌లో సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

నేడు సదస్సు

విజయవాడ సొసైటీ ఆఫ్ అనస్థీషియాలజీ ఆధ్వర్యంలో ఆదివారం సిద్ధార్థ వైద్య కళాశాలలో సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ర్యాలీతో పాటు, సైంటిఫిక్ సదస్సు నిర్వహించనున్నారు.

మగపిల్లల నడవడికపై నిఘా అవసరం

సాక్షి, అమరావతి: మగపిల్లల నడవడికపై తల్లిదండ్రుల నిఘా లోపిస్తే విద్యార్థి దశలో నేరాలకు పాల్పడే ప్రమాదముందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ హెచ్చరించారు. కడప జిల్లా గోపవరం మండలం రాచాయపేటలో వెలుగుచూసిన బాలికపై అత్యాచార ఘటన గురించి ఆమె శనివారం స్పందించారు. కడప జిల్లా పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నారు. ఘటనలో మైనర్లు నేరానికి పాల్పడటంపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. బాలికపై అత్యాచారం, అశ్లీల వీడియోలు బయట పెట్టడం తదితర అంశాలు తీవ్రంగా మనసును కలచివేశాయన్నారు. క్రమశిక్షణ కొరవడటం..సెల్ ఫోన్ల వినియోగంతో ఇష్టానురీతిగా ప్రవర్తించడం జీవితాలపై ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలు, ఇంటి కుటుంబ వాతావరణంలో పిల్లలకు మంచి అలవాట్లు, సంస్కారాన్ని నేర్పే కౌన్సెలింగ్ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

పటమట(విజయవాడ తూర్పు): నగరపాలక సంస్థ పరిధిలోని స్విమ్మింగ్‌పూల్స్(లైఫ్‌గార్డ్)లు, జిమ్ కోచ్‌లుగా తాత్కాలిక పద్ధతిలో రూ.12 వేల గౌరవ వేతనంపై పని చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్విమ్మింగ్ పూల్‌లో లైఫ్‌గార్డ్‌కు నాలుగు ఖాళీలున్నాయని, అభ్యర్థులు ఇంటర్మీడియట్ విద్యార్హతతో, 40 ఏళ్లలోపు, స్పోర్ట్ అథారిటీ నుంచి సేవింగ్ స్విమ్మింగ్ కోర్సు చేయాలని, మూడేళ్ల అనుభవంతోపాటు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొన్న వారికి ప్రాధాన్యమని తెలిపారు. జిమ్‌కోచ్‌లకు ఇంటర్మీడియట్ విద్యార్హతతోపాటు 40 ఏళ్లలోపు వయస్సు, గుర్తింపు పొందిన సంస్థ నుంచి జిమ్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉండాలని పేర్కొన్నారు. మూడేళ్ల అనుభవం జాతీయ, రాష్ట్ర, జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనడాన్ని ప్రాధాన్యమిస్తామని తెలిపారు. అభ్యర్థులు బయోడేటా, ధ్రువీకరణ పత్రాలతో 24వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

1 నుంచి సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాలు, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నవంబర్ ఒకటో తేదీ నుంచి సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌పై నిషేధం అమల్లోకి వస్తుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధం అమలుపై నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జగ్గయ్యపేట, నందిగామ, తిరువూరు, కొండపల్లి మునిసిపల్ కమిషనర్లు, పర్యావరణ అధికారులు, ఫ్లెక్సీ బ్యానర్ల తయారీదారులు, వ్యాపారులతో కలెక్టర్ శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేసి తీరాలని అధికారులకు సూచించారు. నిషేధాన్ని అతిక్రమించే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లోనూ సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధంపై దృష్టి పెట్టాలని పంచాయతీ అధికారులకు సూచించారు. నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్లాంట్ల ద్వారా ఘన వ్యర్థాల నిర్వహణ చేపట్టినట్లు చెప్పారు. నిషేధిత ప్లాస్టిక్‌కు సంబంధించి ఇప్పటి వరకు 2069.1 కేజీల ప్లాస్టిక్‌ను సీజ్ చేసి, రూ.4.76 లక్షల జరిమానా విధించామని తెలిపారు. ప్లాస్టిక్ బ్యానర్ల నిషేధంతో 30 వేల కుటుంబాలు ఉపాధి కోల్పోతాయని ఫ్లెక్సీ బ్యానర్స్ మ్యానిఫాక్చరింగ్ అసోసియేషన్ ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కలెక్టర్ స్పందించి క్లాత్ బ్యానర్ల తయారీకి అవసరమైన క్లాత్ సమకూరుస్తామని, బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ సత్యవతి, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఈఈ ప్రసాదావు, డీటీసీ పురేంద్ర, డీపీఓ జె.సునీత తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమ ఫలాలు



సమస్యలు తెలుసుకుంటున్న దేవినేని అవినాష్, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ

గుణదల (విజయవాడ తూర్పు): గడప గడపకూ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ తెలిపారు. గుణదలలో శనివారం ఉదయం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ సంక్షేమమే లక్ష్యంగా, అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాక్షేత్రంలో సీఎం జగన్‌కు పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. సీఎం జగన్ చేస్తున్న కార్యక్రమాలు ఆమోదయోగ్యంగా ఉన్నాయని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందడానికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు, మహిళలు, రైతులు ఇలా ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వివరించారు. టీడీపీ నేతలు దీనిని ఓర్చుకోలేక పోతున్నారని విమర్శించారు. అసత్య ప్రచారాలు చే స్తున్నారని దుయ్యబట్టారు. మూడు రాజధానుల వ్యవహారాన్ని వక్రీకరిస్తూ రాష్ట్రాభివృద్ధికి అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు సమ్మతిని తెలుపుతున్నా టీడీపీ నాయకులు మాత్రం వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. టీడీపీ హయాంలో రాష్ట్రం దోపిడీకి గురైందన్నారు. తెరవెనక రాజకీయాలు మాని టీడీపీ నేతలు ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, మూడో డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక, వైఎస్సార్ సీపీ నాయకులు ఏలూరి శివాజీ, రమేష్, డేవిడ్ రాజు, బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎంలో ఇన్నోవా ఎక్స్‌పో

పటమట(విజయవాడ తూర్పు): ఎన్ఎస్ఎం స్కూల్లో శనివారం ఇన్నోవా ఎక్స్‌పో–2022 ఎగ్జిబిషన్ జరిగింది. విజ్ఞానశాస్త్రం, గణితశాస్త్రం, సాంఘిక శాస్త్రం ప్రాజెక్టులను ప్రదర్శించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాయప్పరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజన వెలికితీయటానికి, ఆయా సబ్జెక్టుల్లో ఆసక్తిని పెంచడానికి ఇలాంటి ప్రదర్శనలు దోహదపడతాయని, ఆలోచనలు పంచుకునేందుకు ఇవి వేదికలని తెలిపారు. విద్యార్థులు వాటర్ కన్జర్వేషన్, సోలార్ శక్తితో వివిధ రకాల పరికరాలు పనిచేసే విధానం తదితరాలు ప్రదర్శించారు. కరస్పాండెంట్ మాంట్‌ఫోర్ట్, వైస్ ప్రిన్సిపాల్ బాలారెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రవేత్తలను తయారుచేయడం మన బాధ్యత

డీఈఓ సీవీ రేణుక

గుణదల(విజయవాడ ఈస్ట్): విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి వారిని భావితరాల శాస్త్రవేత్తలుగా తయారుచేయాల్సిన బాధ్యత ప్రతి సైన్స్ టీచర్‌పై ఉందని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక అన్నారు. 30వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్(ఎన్‌సీఎస్సీ) 2022–23 జిల్లా స్థాయి గైడ్ టీచర్స్ అవగాహన సమావేశం ఆంధ్ర లయోల కళాశాల ఆడిటోరియంలో శనివారం జరిగింది. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు సైన్స్‌పై మక్కువ పెంచేందుకు, ప్రకృతిని నిశితంగా పరిశీలించడం, పరిశోధించడం, పర్యావరణాన్ని పరిరక్షించుట వంటి అంశాలను క్షుణ్ణంగా తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు. అప్‌కాస్ట్ డీసీ ఎం.హుస్సేన్ మాట్లాడుతూ ఫోకల్ థీమ్, సబ్ థీమ్స్ గురించి టీచర్లకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ రెవరెండ్ కిషోర్, వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ రెవ.ప్రభు, అప్‌కాస్ట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఢిల్లేశ్వరరావు, రిసోర్స్ పర్సన్ డాక్టర్ సంధ్యశ్రీ, బి.సురేష్ కుమార్, కె.ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. కూచిపూడి నృత్యోత్సవం



అలరించిన శ్రీకృష్ణ పారిజాతం నృత్యరూపకం



నాట్య గురువులతో కలిసి నృత్యం చేస్తున్న మంత్రి రోజా



నాట్యాచార్యులకు పురస్కారం ప్రదానం చేస్తున్న మంత్రి రోజా, ఎమ్మెల్యే విష్ణు

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో సేవ్ కూచిపూడి ఆర్టిస్ట్, జయహో భారతీయం, సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో ప్రముఖ నాట్యాచార్యుడు వెంపటి చిన సత్యం 93 జయంతి సందర్భంగా దుర్గాపురంలోని ఘంటసాల సంగీత కళాశాలలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ కూచిపూడి నృత్యోత్సవాలు రెండవ రోజుకు చేరుకున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నృత్య కళాకారులు కూచిపూడి నాట్య సంప్రదాయాన్ని పాటిస్తూ పలు అంశాలను మనోహరంగా ప్రదర్శించారు. కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ (చెన్నై) నిర్వాహకులు వెంపటి చిన సత్యం కోడలు శ్రీమయి వెంపటి బృందం ప్రదర్శించిన శ్రీ కృష్ణ పారిజాతం నృత్య రూపకం నేత్ర పర్వంగా సాగింది. ప్రముఖ నాట్యకళాకారిణి ఏబీ బాలకొండలరావు బృందం, కార్తికేయ అవినాష్, అక్షరా నటరాజ్, బృందం పలు అంశాలను ప్రదర్శించారు. స్పెషల్ ఫోర్స్ కమాండెంట్ కొండా నరసింహారావు దంపతులు శంఖారావంతో అలరించారు. వెంపటి చిన సత్యం నృత్య సేవలను గుర్తు చేసుకుంటూ 300 మంది చిన్నారులు మహా బృంద నాట్యం ప్రదర్శించారు. కూచిపూడి నాట్యాచారి పద్మజారెడ్డిని నిర్వాహకులు సత్కరించారు. వెంపటి చినసత్యం కుటుంబసభ్యులు శ్రీమయి వెంపటి, అంబేద్కర్ యూనివర్సిటీ అధికారి డాక్టర్ జోషి, పారిశ్రామికవేత్త శశిధర్ పాల్గొన్నారు. నాట్యాచార్యులు, నృత్య కళాకారులను సత్కరించారు.

పవన్.. చిల్లర వేషాలేస్తే ఊరుకోం

- ఎయిర్‌పోర్టు వద్ద దాడి మంచి పద్ధతి కాదు
- కర్రలతో కొట్టటం, రాళ్లతో గుద్దడం ఏమిటీ?
- అరాచక శక్తుల వికృత చేష్టలు, భౌతిక దాడులు సహించం
- మా కార్యకర్తలను పురమాయిస్తే పవన్ తిరగగలడా?
- మంత్రి జోగి రమేష్ హెచ్చరిక



సాక్షి, అమరావతి: 'విశాఖ గర్జన'లో పాల్గొని విమానాశ్రయానికి వస్తున్న తమపై జనసేన కార్యకర్తలు దాడిచేశారని, ఇలాంటి చిల్లర వేషాలేస్తే ఊరుకోబోమని ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌ను మంత్రి జోగి రమేష్ శనివారం హెచ్చరించారు. ఈ ఘటనలో తమ వాళ్లకు గాయాలయ్యాయని దాడి అనంతరం ఆయన 'సాక్షి'కి చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఇది సరికాదన్నారు. వికేంద్రీకరణకు మద్దతుగా విశాఖ గర్జన ర్యాలీ, బహిరంగ సభను ముగించుకుని ఎయిర్‌పోర్టుకు టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి ఆర్కే రోజా, తాను వస్తున్నామని.. విమానాశ్రయానికి రాగానే తమ కార్లపై జనసేన కార్యకర్తలు కర్రలు, రాళ్లతో దాడికి తెగబడ్డారని మంత్రి వివరించారు. ఈ దాడిలో తమ కార్ల అద్దాలు ధ్వంసం కావడంతో పాటు మంత్రి రోజా సహాయకుడికి గాయాలయ్యాయని తెలిపారు. తాగుబోతు కుర్రాళ్లను, అరాచక శక్తులను, అల్లరి మూకలను, రౌడీలను పోగుచేసి దాడిచేయించటం సరికాదని.. పవన్ తన కార్యకర్తలను అదుపులో పెట్టుకోవాలని.. లేదంటే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని జోగి రమేష్ హితవు పలికారు. తమ కార్యకర్తలను పురమాయిస్తే పవన్ ఎక్కడ కూడా తిరగలేడని ఆయన హెచ్చరించారు. నాయకుడికి స్వాగతం చెప్పుకోడానికి, జిందాబాద్.. అని నినాదాలు ఇవ్వడానికి వచ్చిన వారి వద్ద రాళ్లు, కర్రలు ఎందుకు ఉన్నట్లని మంత్రి ప్రశ్నించారు. జనసైనికుల దాడిపై పవన్‌కల్యాణ్ వెంటనే సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

పరిపాలన రాజధాని వచ్చే వరకూ విశ్రమించం



జోరు వానలో విశాఖ గర్జనకు ర్యాలీగా వెళ్తున్న మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతలు, ప్రజలు

విశాఖ గర్జన సభలో మంత్రులు, జేఏసీ నేతలు

- ఇంకోసారి నష్టపోకుండా వచ్చిన అవకాశాన్ని కాపాడుకుందాం
- మన ఆకాంక్ష నెరవేరే వరకు ఈ పోరాటాన్ని కొనసాగిద్దాం
- ఈ ప్రాంత అభివృద్ధిని వ్యతిరేకిస్తూ ఇక్కడే వ్యాపారాలు చేస్తారా?
- అన్ని ప్రాంతాల అభివృద్ధిని కాంక్షిస్తున్న సీఎం జగన్‌కు మద్దతిద్దాం
- విశాఖ రాజధానితో 130 ఏళ్ల సమస్యకు పరిష్కారం : మంత్రి ధర్మాన
- ఈనాడు, జ్యోతి, టీవీ–5లను బహిష్కరించాలి : మాజీ మంత్రి కొడాలి నాని
- పోరాటం చేసి సాధించుకుందాం : స్పీకర్ తమ్మినేని
- పెళ్లికి, పోటీకి పనికొచ్చిన విశాఖ..రాజధానిగా పనికి రాదా పవన్ : మంత్రి రోజా
- జేఏసీ కార్యక్రమాల్లో పాల్గొంటాం : వైవీ సుబ్బారెడ్డి

సాక్షి, విశాఖపట్నం : 'ఉత్తరాంధ్ర వెనుకబాటుతనానికి స్వస్తి పలుకుతూ.. అభివృద్ధి బాటలో నడిపించేందుకు చేపట్టిన ఉద్యమంలో ఇది తొలి అడుగు. విశాఖను కార్యనిర్వాహక రాజధానిగా ఏర్పాటు చేసుకునేంత వరకు ఊరూ వాడా ఏకమై ఉద్యమిద్దాం. మరోసారి రాష్ట్రం విడిపోకుండా సమగ్రాభివృద్ధిని కాంక్షిస్తూ సీఎం వైఎస్ జగన్ విప్లవాత్మక నిర్ణయానికి ప్రతి ఒక్కరం మద్దతు పలుకుదాం. ఉత్తరాంధ్ర అభివృద్ధిని వ్యతిరేకిస్తున్న వారిని ఈ ప్రాంతంలో నిషేధిద్దాం. ఉద్యమాల పురిటిగడ్డపై వేషగాళ్ల వెనకడుగు వేసేంత వరకూ గర్జిద్దాం..' అంటూ నాన్ పొలిటికల్ జేఏసీ, మద్దతునిచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు పిలుపునిచ్చారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచెయ్యకుండా సాగిన విశాఖ గర్జన ర్యాలీ ముగింపు సభ బీచ్‌రోడ్డులోని వైఎస్సార్ విగ్రహం సమీపంలో జరిగింది. విశాఖ కేంద్రంగా పరిపాలన రాజధాని ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో ఏర్పాటైన జేఏసీ నేతృత్వంలో జరిగిన ఈ సభలో ప్రజా ప్రతినిధులు, మేధావులు, న్యాయవాదులు, ప్రజా, యువజన సంఘాల నేతలు పాల్గొని తమ ఆకాంక్షను చాటారు. జేఏసీ నేతలు దేవుడు, కొయ్య ప్రసాద్‌రెడ్డి, డిప్యూటీ సీఎంలు పీడిక రాజన్న దొర, బూడి ముత్యాల నాయుడు, మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, జోగి రమేష్, సీదిరి అప్పలరాజు, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, గొడ్డేటి మాధవి, భీశెట్టి సత్యవతి, బెల్లాన చంద్రశేఖర్, మాజీ మంత్రులు పేర్ని నాని, ధర్మాన కృష్ణదాస్, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కురసాల కన్నబాబు, మేయర్ జి.హరి వెంకటకుమారి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

విశాఖకు రాజధాని రావాల్సిందే



వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రజల అభివృద్ధి కోసం న్యాయంగా చేస్తున్న మా పోరాటానికి అన్ని రాజకీయ పార్టీలు మద్దతు పలకాలి. ఇప్పటికే మూడుసార్లు మన రాష్ట్రాన్ని విభజించారు. మళ్లీ అమరావతే ఏకైక రాజధాని అయితే.. భవిష్యత్తులోనూ మళ్లీ విభజన డిమాండ్ పురుడు పోసుకుంటుందనడంలో సందేహం లేదు. రాజధాని వచ్చేంత వరకూ పోరాటం సాగిద్దాం. భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకుందాం. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ అవకాశాన్ని వదులుకోవద్దు. విశాఖకు రాజధాని రావాల్సిందే.

– ప్రొఫెసర్ లజపతిరాయ్, నాన్ పొలిటికల్ జేఏసీ చైర్మన్

టీడీపీ, జనసేనకు ఉత్తరాంధ్ర అభివృద్ధి ఇష్టం లేదు



మన హక్కుల్ని మనం కాపాడుకుందాం. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ఇదే తరహాలో నినదిద్దాం. ఏపీ సువిశాలంగా.. మూడు ప్రాంతాలూ సమానంగా అభివృద్ధి చెందాలని సీఎం వైఎస్ జగన్ కాంక్షిస్తుంటే.. అమరావతి పేరుతో 29 గ్రామాలున్న ప్రాంతానికి మాత్రమే అభివృద్ధిని పరిమితం చేయాలని చంద్రబాబు, పవన్ కల్యాణ్ కుతంత్రాలు పన్నుతున్నారు. పైన ఆకుపచ్చ చొక్కాలు.. లోపల పసుపు పచ్చ ఆలోచనలతో.. తమ రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం పాదయాత్ర పేరుతో వారు దండయాత్ర చేస్తుండటం సిగ్గు చేటు. అధికారంలో ఉండగా, అమరావతి ప్రాంతంలో రైతులను దోచుకున్న చంద్రబాబే.. అమరావతి రైతుల పేరుతో పాదయాత్ర చేయిస్తున్నారు. కేవలం విశాఖ మాత్రమే కాకుండా.. అమరావతి, కర్నూలు ప్రాంతాలు కూడా సమానాభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి జగన్ సంకల్పించినా.. ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందడం ఇష్టం లేని టీడీపీ, జనసేన దాన్ని ఆపేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. మూడు రాజధానులే ఈ రాష్ట్రానికి శరణ్యం.

– మేరుగు నాగార్జున, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి

ఉత్తరాంధ్ర ప్రజలకు సెల్యూట్



విశాఖను రాజధానిగా చేయాలన్న ఆకాంక్ష ప్రజల మనసుల్లో బలంగా నాటుకుపోయింది. వర్షాన్ని లెక్క చేయకుండా వచ్చిన జనానికి సెల్యూట్ చేస్తున్నా. విశాఖ రాజధాని ఉద్యమానికి మద్దతిచ్చేందుకు ఇంత మంది జనం తరలివస్తారని ఊహించలేదు. విశాఖ గర్జనకు అడుగడుగునా అడ్డంకులు సృష్టించేందుకు ప్రతిపక్షాలు తీవ్రంగా ప్రయత్నించినా, వారి కుట్రలు ఫలించలేదు. ఇప్పటికైనా టీడీపీ, జనసేన, ఇతర పార్టీల నేతలు ప్రజల మనోభావాలు, ఆకాంక్షలను గౌరవించి విశాఖ రాజధాని ఉద్యమానికి మద్దతివ్వాలి.

– గుడివాడ అమర్‌నాథ్, ఐటీ శాఖ మంత్రి

జగన్ ఉండగా.. మనకెందుకు భయం?



విశాఖను పాలన రాజధానిగా చేయాలన్న తపన.. వేలాది మందిని ఇక్కడికి నడిపించింది. ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందాలంటూ ప్రకృతి కూడా గర్జించి.. ఆమోదం తెలిపింది. తాతముత్తాతలు మూడేళ్లు కర్నూలు రాజధానికి వెళ్లారు. మన తండ్రులు, మనం హైదరాబాద్ వెళ్లాం. ఇకపై అక్కడెక్కడికో వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తకూడదనే ఉద్దేశంతో.. ఉత్తరాంధ్రని వెనుకబాటు నుంచి అభివృద్ధి పథంలోకి తీసుకురావాలన్న సంకల్పంతో సీఎం వైఎస్ జగన్ విశాఖను పాలన రాజధానిగా ఎంపిక చేస్తూ అరుదైన అవకాశం కల్పించారు. ఈ అవకాశాన్ని మనం వదులుకోరాదు. మా ప్రాంతానికి ఉద్యోగాలు రాకుండా, ఉపాధి లేకుండా, పరిశ్రమలు రాకుండా అడ్డుకోవాలనుకుంటున్న వారి ఆటలిక సాగవు. 130 ఏళ్ల నుంచి వస్తున్న వెనుకబాటుతనానికి వ్యతిరేకంగా ఉత్తరాంధ్ర ప్రజలు ఈ రోజు గర్జిస్తుంటే.. దాన్ని అడ్డుకోవాలని చూస్తున్న వారు మిత్రులు కాదు.. ఉత్తరాంధ్ర ద్రోహులు. విభజన చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన శివరామకృష్ణన్ కమిటీ రాష్ట్రంలో భిన్నమైన అభిప్రాయాలు కలిగిన నేపథ్యంలో అన్ని ప్రాంతాల్లోనూ అభివృద్ధి అవసరమని సూచించింది. రాష్ట్రంలో అన్ని నగరాలకంటే విశాఖపట్నం రాజధానికి సరైనదని స్పష్టం చేసింది. దీనికి భిన్నంగా.. చంద్రబాబు తన తొత్తులైన నారాయణ, సుజనా చౌదరి, ఇతర నేతలతో కూడిన కమిటీ వేసి రాజధాని అమరావతి అని నిర్ణయించేశారు. ఈ అధికారం ఎవరు ఇచ్చారు? అప్పటికే రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం, ఏపీని తాకట్టు పెట్టడానికి 35వేల ఎకరాలు చుట్టేసి, చుట్టూ భూముల్ని చంద్రబాబు సన్నిహితులు, టీడీపీ నేతలు కొనుగోలు చేసేశారు. భవిష్యత్తులో హైదరాబాద్ మాదిరిగా.. అమరావతి నుంచి మనల్ని వెళ్లగొడితే దిక్కెవరు? ఇప్పటికైనా మనం గట్టిగా నిలబడదాం. బలమైన నాయకుడు సీఎం వైఎస్ జగన్ ఉండగా.. మనకెందుకు భయం? పోరాటాన్ని మరింత ఉధృతం చేద్దాం.

– ధర్మాన ప్రసాదరావు, రెవెన్యూ శాఖ మంత్రి

అందరూ బాగుండాలన్నదే మా ఆకాంక్ష



విశాఖ వాసులు ఉక్కు సంకల్పంతో రాజధానిని సాధించుకోవాలనే కాంక్షతో భారీ వర్షాన్ని సైతం లెక్క చెయ్యకుండా గర్జించారు. విశాఖ రాజధానిని సాధించుకొని బానిస సంకెళ్ల నుంచి బయటపడాలి. కర్నూలు, హైదరాబాద్‌ని రాజధాని చేసినా ఉత్తరాంధ్ర ప్రజలు సరే అన్నారు. కానీ.. ఈసారి మాత్రం ఆ తప్పు చేయకూడదు. వికేంద్రీకరణ జరగాల్సిందే. విశాఖలో రాజధాని ఏర్పాటు కావాల్సిందే. నాది గుంటూరు జిల్లా అయినా.. వికేంద్రీకరణ మా అభిమతం. విశాఖ ప్రజల ఉగ్రరూపం ఎలా ఉంటుందో అందరూ చూశారు. ఈరోజు విశాఖ గర్జన చూస్తే చంద్రబాబు బ్యాచ్‌కు నిద్రపట్టదు. ఉక్కు సంకల్పంతో విశాఖను పరిపాలన రాజధానిగా ఉత్తరాంధ్ర ప్రజలు సాధిస్తారు. పెయిడ్ ఆర్టిస్టులతో చేస్తున్న పాదయాత్రతో దేనికి సంకేతమిస్తున్నారు? అందరూ బాగుండాలని మేము కోరుకుంటే.. అమరావతి మాత్రమే బాగుండాలని టీడీపీ, జనసేన, ఇతర నేతలు కోరుకోవడం సమంజసమేనా?

– విడదల రజిని, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి

రూ.5 లక్షల కోట్ల ప్రజాధనాన్ని వృథా చెయ్యాలనుకుంటున్నారా?

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్నది దివంగత వైఎస్సార్ కల. ఇవాళ విశాఖ గర్జన ర్యాలీకి ఇంత మంది తరలి రావడం చూసి ఆనందం ఉప్పొంగుతోంది. విశాఖలో రాజధాని ఏర్పాటు చేయాలన్న బలమైన ఆకాంక్షతోనే ఇంత మంది ప్రజలు విశాఖ గర్జనకు తరలివచ్చారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ఇంత మంది వచ్చారంటే వారంతా విశాఖకు మద్దతిస్తున్నారనే అర్థం. విశాఖ రాజధాని కేవలం ఆ నగర ప్రజలకు మాత్రమే కాదు.. రాష్ట్రం మొత్తానికి అవసరం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను మెరుగు పరిచేందుకు విశాఖకు రాజధాని రావాల్సిన అవసరం ఉంది. పోర్టులు, రైల్వే ఫ్యాక్టరీ వంటి సదుపాయాలున్న విశాఖకు రాజధాని వస్తే పెట్టుబడులు పెరిగి నిధులు సమకూరుతాయి. ఇలాంటి నగరాన్ని వదిలేసి రూ.5 లక్షల కోట్లతో రాజధానిని కట్టి చంద్రబాబు ప్రజాధనాన్ని వృథా చేయాలనుకుంటున్నారు. అసలు అమరావతి ఎలా రాజధాని అవుతుంది? అది కేవలం దోపిడీ మాత్రమే. 29 గ్రామాలనే అభివృద్ధి చేసి దానిని రాజధాని అంటే ఎవరు నమ్ముతారు? అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసమే సీఎం జగన్ వికేంద్రీకరణ నిర్ణయం తీసుకున్నారు. దానికి అందరూ మద్దతివ్వాలి.

– బొత్స సత్యనారాయణ, విద్యా శాఖ మంత్రి


టీడీపీ కార్యాలయాల్లో క్షుద్రపూజలు!



ఉత్తరాంధ్ర ప్రజలు ఎన్నాళ్లో బానిస బతుకులు బతకాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ విశాఖని కార్యనిర్వాహక రాజధానిగా చేయాలని సంకల్పించారు. పరిపాలన రాజధాని వస్తే.. ఈ ప్రాంతంలో అభివృద్ధి జరుగుతుంది. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. కానీ.. మనం స్వతంత్రంగా ఉండకూడదనే కుటిలబుద్ధితో కొందరు లుచ్చాలు, పచ్చ నేతలు.. టీడీపీ, దానికి కొమ్ముకాస్తున్న పార్టీలు కలిసి.. టీడీపీ కార్యాలయాల్లో క్షుద్ర పూజలు చేస్తున్నారు. ఎన్ని క్షుద్ర పూజలు చేసినా.. ఈ పోరాటం ఆగదు. రాబందుల్ని ఇక్కడి నుంచి పంపించి.. ఉత్తరాంధ్రకు రాజధాని సాధించేంత వరకు చేయి చేయి కలుపుతూ.. సీఎం జగన్ ఇచ్చిన అవకాశాన్ని నెరవేర్చుకుందాం.

– కరణం ధర్మశ్రీ, ప్రభుత్వ విప్

విశాఖ నుంచి త్వరలో పరిపాలన



అన్ని ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలని సీఎం జగన్ సంకల్పిస్తే.. అమరావతి ఒక్కటే రాజధానిగా ఉండాలని, ఆ ప్రాంతంలో తమ భూముల రేట్లు పెంచుకుని దోచుకోవాలని టీడీపీ, ఇతర ప్రతిపక్షాలు చూస్తున్నాయి. సీఎం జగన్ నిర్ణయం మేరకు మూడు రాజధానులను ఏర్పాటు చేసుకుంటాం. విశాఖ నుంచే సీఎం త్వరలో పరిపాలన సాగిస్తారు. ఇందులో ఎలాంటి సందేహం లేదు. పాదయాత్ర పేరుతో ఈ ప్రాంతంపై దండయాత్ర చేస్తున్న వారు, ఆ దండయాత్రకు మద్దతిస్తున్న టీడీపీ, చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్ కల్యాణ్‌లను ఉత్తరాంధ్ర ప్రజలు నిలదీయాలి. విశాఖను పరిపాలన రాజధానిగా సాధించుకునేందుకు, జేఏసీ ఏ పోరాటం చేసినా మద్దతు ఇస్తాం.

– వైవీ సుబ్బారెడ్డి, టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి విశాఖ ఇన్‌చార్జ్

మన ఆకాంక్ష నెరవేరే వరకు పోరాడుదాం



ఈ ప్రాంతంపై దశాబ్దాలుగా పాలనా పరమైన వివక్ష చూపారు. ఈ కారణంగానే ఉత్తరాంధ్ర వెనుకబాటుతనానికి గురైంది. ఉద్యమాలకు పురిటిగడ్డ ఉత్తరాంధ్ర ప్రాంతం. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం నాడు ఉద్యమాలు జరిగితే.. ఈరోజు మళ్లీ మన బతుకుల బాగు కోసం విశాఖే పరిపాలన రాజధానిగా ఉండాలని ఉద్యమిస్తున్నాం. ఆకలి మంటలతో చచ్చే బదులు.. పోరాడి చద్దాం. ప్రతి పురుషుడు, ప్రతి మహిళ, ప్రతి యువకుడు.. ఈ కదన రంగంలోకి దిగాలి. మరో ఉద్యమం రాకుండా వికేంద్రీకరణ అనే పవిత్రమైన నిర్ణయాన్ని సీఎం జగన్ తీసుకున్నారు. ఏపీని సర్వతోముఖాభివృద్ధిగా తీర్చిదిద్దాలని భావిస్తున్నారు. విశాఖ రాజధానిని వ్యతిరేకిస్తున్న రాజకీయ పార్టీల్ని నిలదీయాలి. మన హక్కుల్ని సాధించుకునే అవకాశం దశాబ్దాల తర్వాత సీఎం జగన్ ఇచ్చారు. పోరాడి తెచ్చుకుందాం. సీఎం ఇక్కడి నుంచి పాలన ప్రారంభించేంత వరకూ ఈ పోరాటాన్ని కొనసాగిద్దాం.

– తమ్మినేని సీతారాం, శాసనసభ స్పీకర్

చంద్రబాబును, దత్తపుత్రుడిని తరిమికొట్టాలి



రాయలసీమలో పుట్టినా ఉత్తరాంధ్ర ప్రజలకు మద్దతు ఇస్తున్నాను అంటే సీఎం జగన్ నిర్ణయం ఎంత బలమైనదో అర్థం చేసుకోవాలి. దేశంలో చక్రం తిప్పానని చెప్పుకుంటూ, తుప్పు పట్టిన సైకిల్ చక్రం అధినేత చంద్రబాబు మన రాష్ట్రానికి చేసిందేమీ లేదు. చంద్రబాబు అసమర్థ పాలన వల్లే ఉత్తరాంధ్ర, రాయలసీమలు అన్యాయానికి గురయ్యాయి. సీఎం జగన్ వికేంద్రీకరణ నిర్ణయానికి 26 జిల్లాల ప్రజలు మద్దతు తెలియజేస్తుంటే.. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు.. అమరావతి రైతుల ముసుగులో వస్తున్న పెయిడ్ ఆర్టిస్టులకు మద్దతిస్తున్నారు. వారిని తమిరి కొట్టాలా.. వద్దా? చంద్రబాబు దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ పెళ్లి చేసుకోడానికి విశాఖ అమ్మాయి కావాలి. షూటింగులకు విశాఖ కావాలి. నటన నేర్చుకోడానికి వైజాగ్ కావాలి. చివరికి ఎన్నికల్లో పోటీ చేయడానికి కూడా విశాఖ కావాలి. కానీ.. వైజాగ్‌కు రాజధాని వద్దు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందకూడదా? గాజువాక ప్రజలు విజన్ ఉన్న వాళ్లు కాబట్టే.. ఈయన నిజ స్వరూపం ముందే తెలుసుకొని చిత్తుగా ఓడించారు. ఆకలి పోరాటం విలువ తెలిసిన ఉత్తరాంధ్ర ప్రజలు తొడగొడితే.. పవన్ కల్యాణ్ చిత్తు అవ్వడం ఖాయం. వికేంద్రీకరణ కోరుకున్న వాళ్లంతా పిచ్చికుక్కలంటూ ఉత్తరాంధ్రలో పుట్టిపెరిగిన అచ్చోసిన ఆంబోతులా అచ్చెన్న మాట్లాడుతున్నారు. 26 జిల్లాల అభివృద్ధిని 29 గ్రామాలకు మాత్రమే కావాలనుకుంటున్న వారే పిచ్చికుక్కలు, గజ్జికుక్కలు, ఊరకుక్కలు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకుంటున్న చంద్రబాబు చెయ్యలేని అభివృద్ధిని సీఎం జగన్ మూడేళ్లలో చేసి చూపించారు.

– ఆర్కే రోజా, పర్యాటక శాఖ మంత్రి

ఇక్కడ పేపర్లు, పచ్చళ్లు అమ్మడం లేదా?

హైదరాబాద్ తరహాలో రాష్ట్ర సంపదంతా ఒకే చోట అమరావతిలో ఖర్చు చేశాక, మిగతా ప్రాంతాల్లో ఉద్యమాలు వస్తే దానికి ఎవరు బాధ్యులు? ఇకపై ఇలా జరగరాదనే సీఎం జగన్ ముందు చూపుతో వ్యవహరిస్తున్నారు. విశాఖ గర్జన చూశాక అయినా, చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, ఈనాడు రామోజీరావు, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ, టీవీ 5 బీఆర్ నాయుడు ప్రజల మద్దతు ఎవరికి ఉందో తెలుసుకోవాలి. అమరావతికే మద్దతు ఇస్తున్న తెలుగుదేశం పార్టీ ఉత్తరాంధ్రలో లేదా?



ఈనాడు రామోజీరావు ఇక్కడ పేపర్లు, పచ్చళ్లు అమ్ముకోవడం లేదా? రాధాకృష్ణ, టీవీ–5 చానళ్లు ఇక్కడ నడపడం లేదా? వీళ్లందరికీ అమరావతి మీదే ఎందుకు ప్రేమ అంటే, వీళ్లంతా ఆ ప్రాంతంలో భూములు కొనుగోలు చేసి, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేద్దామనుకున్నారు. జగన్ సీఎం అయ్యాక వారి పప్పులు ఉడకడం లేదు. అమరావతిలో రూ.40లక్షలు పెట్టి కొన్న భూములు రూ.4 కోట్లు కాలేదన్న బాధతో వీరంతా మూడు రాజధానులను వ్యతిరేకిస్తున్నారు. తమ ఆస్తుల కోసం ఉత్తరాంధ్ర మీద విషం చిమ్ముతున్నారు. చంద్రబాబు ఒక 420. పిల్లనిచ్చి, పార్టీలో చేర్చుకున్న ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి, పార్టీని, ముఖ్యమంత్రి పదవిని ఆక్రమించుకున్నారు. జూనియర్ ఎన్టీఆర్‌తో పాటు ఎందర్నో వేధించి.. 210 లోకేష్ కోసం దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారు. చంద్రబాబుకు తన ఆస్తుల మీద, పార్టీ మీద, కొడుకు లోకేష్ మీద తప్పితే.. ప్రజల మీద ప్రేమ, దయ, బాధ్యత ఉండదు. ఉత్తరాంధ్ర ద్రోహులందరినీ బ్యాన్ చెయ్యాలి. వారి పేపర్లు, పచ్చళ్లు కొనొద్దు, చానల్స్ రాకుండా కేబుల్ ఆపరేటర్లతో మాట్లాడండి. కుక్కకాటుకు చెప్పుదెబ్బ అన్నట్లు.. వారు ఇటువైపు చూడాలంటే భయం కలిగేలా చేయండి. కృష్ణా, గుంటూరు జిల్లాలు కూడా ఉత్తరాంధ్ర అభివృద్ధిని కోరుకుంటున్నాయి. విశాఖను ఎగ్జిక్యూటివ్ రాజధానిగా చేస్తే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందు తుంది.

– కొడాలి నాని, మాజీ మంత్రి, గుడివాడ ఎమ్మెల్యే.

రాజధానిగా అమరావతికే కట్టుబడి ఉన్నాం

కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జ్ మురళీధరన్



అనకాపల్లి టౌన్: రాష్ట్రంలో ఏకైక రాజధానిగా అమరావతి ఉండాలని బీజేపీ నిర్ణయం తీసుకుందని.. ఇప్పటికీ దానికే కట్టుబడి ఉన్నామని కేంద్ర విదేశాంగ సహాయ మంత్రి, బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జ్ మురళీధరన్ చెప్పారు. అనకాపల్లిలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజధానిగా అమరావతి అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.7,500 కోట్లు ఇచ్చిందని పేర్కొన్నారు. కేంద్ర పథకాల అమలు నిమిత్తం దాదాపు రూ.3,500 కోట్లు ఇచ్చినట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్ మూడు రాజధానుల పేరుతో ప్రజల్ని మోసం చేస్తున్నారని విమర్శించారు. ప్రజల ఆమోదంతోనే కర్నూలులో హైకోర్టు పెట్టాలన్నారు. అలాగే హైకోర్టు తీర్పును అమలు చేయాలని... అమరావతిలో అన్ని కీలక ప్రభుత్వ భవనాల నిర్మాణం చేపట్టాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, బీజేపీ నాయకుడు గండి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజలందరి కోసం మూడు రాజధానులు

వైఎస్సార్‌సీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి

తిరుపతి రూరల్: చంద్రబాబు అమరావతిని కొందరికే పరిమితం చేయగా.. సీఎం వైఎస్ జగన్ పాలన వికేంద్రీకరణ ద్వారా మూడు రాజధానులను ప్రజలందరికీ చేరువ చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి చెప్పారు. మూడు రాజధానులు రాష్ట్ర ప్రజలందరి ఆకాంక్ష అని చెప్పారు. తిరుపతిలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాల్సిన అవసరముందన్నారు. విశాఖ గర్జనలో లక్షలాది మంది వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పాల్గొని విజయవంతం చేశారని చెప్పారు. మూడు రాజధానుల వల్ల కోస్తాంధ్రతో పాటు రాయలసీమ, ఉత్తరాంధ్ర సమానంగా అభివృద్ధి చెందుతాయన్నారు. అందుకే చంద్రబాబు పాదయాత్రల పేరుతో ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.



వికేంద్రీకరణకు మద్దతుగా..

అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం అంగళ్లలో శనివారం పలువురు ప్రజలు, నాయకులు తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని కలిసి మూడు రాజధానులకు మద్దతుగా ప్లకార్డులు ప్రదర్శించారు. వికేంద్రీకరణకు మద్దతుగా నినాదాలు చేశారు. – బి.కొత్తకోట

గూండాగిరితో రాజకీయాల్లో రాణించలేవు పవన్..

సాక్షి, అమరావతి: బీసీ మంత్రులు జోగి రమేష్, విడదల రజినీలపై జరిగిన దాడిని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం తీవ్రంగా ఖండిస్తోందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మారేష్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జరిగిన దాడిపై జోగి రమేష్, రజినీలకు తక్షణం పవన్ క్షమాపణ చెప్పాలని, లేకుంటే రాష్ట్రంలో ఆయన ఎక్కడ పర్యటించినా బీసీ సంఘాలు అడ్డుకుంటాయని హెచ్చరించారు. దౌర్జన్యాలు, గూండాగిరితో రాజకీయాల్లో రాణించలేరన్న విషయాన్ని పవన్ గుర్తించాలని హితవుపలికారు. దాడికి పాల్పడిన జనసేన పార్టీ కార్యకర్తలను వెంటనే గుర్తించి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. బీసీ మంత్రులపై దాడిని జాతీయ బీసీ సంక్షేమ సంఘ ప్రచార కమిటీ చైర్మన్ జక్కా శ్రీనివాస్‌యాదవ్, బీసీ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వేముల బేబీరాణి ఖండించారు. ఈ దాడిని పిరికి చర్యగా అభివర్ణించారు. అల్లరి మూకలతో జనసేన దాడిని యావత్ బీసీ సమాజం వ్యతిరేకిస్తోందన్నారు.



విశాఖపట్నంలో పరిపాలన రాజధాని ఏర్పాటు చేయాలని జేఏసీ నేతృత్వంలో శనివారం నిర్వహించిన ర్యాలీలో విశేషంగా ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు


కేతకి సేథ్

కళ

ఫొటోస్టూడియో ఆటోబయోగ్రఫీ

ఒకసారి కళ్లు మూసుకొని స్మార్ట్‌ఫోన్ కెమెరాలు లేని ఫొటోస్టూడియోల కాలంలోకి వెళ్లండి. దీపావళి పండగరోజు అక్కయ్య, అన్నయ్యలతో కలిసి దిగిన బ్లాక్ అండ్ వైట్ ఫొటో గుర్తుందా? 'రెడీ... అనగానే అలా కళ్లు మూయవద్దు తల్లీ' అని సుతిమెత్తగా మందలించిన మీ ఊరిలోని ఫొటోగ్రాఫర్ గుర్తున్నాడా? ఫిల్టర్‌లు, మొబైల్ ఫోన్ అప్లికేషన్‌లు లేని ఆ కాలంలో స్టూడియోలలోని అద్భుతమైన బ్యాక్‌డ్రాప్ పెయింటింగ్స్ గుర్తుకొస్తున్నాయా?

కేతకి సేథ్ తన 'ఫొటోస్టూడియో' ప్రాజెక్ట్‌తో ఆ కాలంలోకి తీసుకువెళుతుంది. పదండి ఒకసారి...



సెల్‌ఫోన్ కెమెరాలు వచ్చిన తరువాత 'ఫొటో స్టూడియో'లు తగ్గిపోయాయి. ఉన్నవి ఆనాటి వెలుగును కోల్పోయాయి. ఎన్నో కుటుంబాలతో అనుబంధాలు పెనవేసుకున్న అలనాటి ఫొటోస్టూడియోల గత వైభవాన్ని 'ఫొటోస్టూడియో' ప్రాజెక్ట్‌తో మన కళ్ల ముందుకు తీసుకువస్తుంది ప్రసిద్ధ ఫొటోగ్రాఫర్ కేతకి సేథ్.

2014లో నార్త్ ముంబైలోని 'జగదీష్ ఫొటోస్టూడియో'లోకి కేతకి అడుగుపెట్టినప్పుడు అది ఫొటో స్టూడియోలా లేదు. గత కాల వైభవంలోకి వెళ్లినట్లుగా అనిపించింది. ఇక అది మొదలు 2018 వరకు దేశంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న 67 పాత ఫొటోస్టూడియోలను సందర్శించింది. ఆ జ్ఞాపకాలను రికార్డ్ చేసింది. ఢిల్లీలోని 'ఫొటోఇంక్' గ్యాలరీలో తొలిసారిగా 'ఫొటోస్టూడియో' పేరుతో ఫొటోఎగ్జిబిషన్ నిర్వహించింది. దీనికి అద్భుతమైన స్పందన వచ్చింది. కేతకి ప్రాజెక్ట్‌పై 'ఫొటోస్టూడియో' పేరుతో నాణ్యమైన పుస్తకం కూడా వచ్చింది.

తాజాగా... పాతతరానికి సంబంధించిన కొత్త ఫొటోలతో ముంబైలో చెమౌల్డ్ ప్రిస్కాట్ రోడ్‌లో ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసింది కేతకి. ఈ ఫొటోలలో వంద సంవత్సరాల చరిత్ర ఉన్న ఫొటోస్టూడియోలు ఉండడం విశేషం. అప్పట్లో ఇమేజ్–క్రేజ్ బాగా ఉండేది. స్క్రీన్‌కి అవతలి ప్రపంచాన్ని ఊహించేవారు కాదు. అందమైన ప్రకృతి దృశ్యాల నుంచి అభిమాన తారల వరకు ఎన్నో బ్యాక్‌డ్రాప్ పెయింటింగ్స్ స్టూడియోలలో కనిపించేవి. ఆ దృశ్యాలకు సంబంధించిన ఫొటోలు ఈ ఎగ్జిబిషన్‌లో కనిపించి కనువిందు చేస్తాయి.

కేతకి తన ప్రయాణంలో నాటి ఫొటోగ్రాఫర్‌లతో మాత్రమే కాదు, ఫొటోస్టూడియోలలో బ్యాక్‌గ్రౌండ్ పెయింటింగ్స్ గీసే ఆర్టిస్ట్‌లతో కూడా మాట్లాడింది. అలనాటి ఫొటో స్టూడియో యజమానులతో మాట్లాడుతున్నప్పుడు వారు మాట్లాడుతున్నట్లుగా అనిపించలేదు. ఫొటోస్టూడియోలు తమ ఆటోబయోగ్రఫీని చెప్పుకుంటున్నట్లుగా ఉంది!

'గతంలో ఎన్నో ఫొటో ఎగ్జిబిషన్‌లకు వెళ్లాను. కాని వాటన్నిటికంటే ఈ ఎగ్జిబిషన్ నాకు బాగా దగ్గరైంది. నా కాలంలోకి, సొంత ఇంట్లోకి అడుగుపెట్టినట్లుగా ఉంది. ఒక్కో ఫొటో చూస్తూ వెళుతున్నప్పుడు ఎన్నో జ్ఞాపకాలు నన్ను చుట్టుముట్టాయి. గ్యాలరీ నుంచి బయటికి వచ్చినా ఆ జ్ఞాపకాల నుంచి బయటికి రావడానికి మాత్రం చాలా సమయం పట్టింది' అంటుంది ఫొటో ఎగ్జిబిషన్‌కు వెళ్లి వచ్చిన అరవై అయిదు సంవత్సరాల పూర్ణ.

'ఫొటోస్టూడియో' ప్రాజెక్ట్ సూపర్‌హిట్ అయిందని చెప్పడానికి ఇంతకుమించి ఉదాహరణ ఏముంటుంది!

నాట్యభూషణం

**'వాగ్గేయకార' గుర్తింపు పొందిన ఏకైక మహిళ.
పద్మభూషణ్ అందుకున్న నాట్యవిలాసిని.
ఆమ్రపాలి రూపకల్పనకు ఢిల్లీ ప్రభుత్వ పురస్కారగ్రహీత.
ఇంటర్నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో ప్రదర్శనకారిణి.
యంగ్ కల్చరల్ అంబాసిడర్‌గా భారత ప్రతినిధి.
మూడు నాట్యరీతుల సాధన కర్త...
నాట్యానికి స్వీయ గాత్ర సహకార ప్రత్యేకత.
ఇన్నిటి సమ్మేళనం వక్కలంక స్వప్న సుందరి.**



''నా కళాప్రస్థానం గురించి చెప్పే ముందు మా అమ్మ గురించి చెప్పాలి. అమ్మమ్మ తరం వరకు మా గాత్రప్రతిభ ఇంటికే పరిమితం. అమ్మ వక్కలంక సరళ నేపథ్య గాయని. తెర ముందుకు రావడం మాత్రం నాతోనే మొదలు. అమ్మకు యామినీ కృష్ణమూర్తి నాట్యం ఇష్టం. నేను కడుపులో ఉండగానే అమ్మాయి పుడితే కళాకారిణిని చేయాలనుకుంది. తన మిత్రురాలైన బెంగాలీ గాయని గీతాదత్‌తో 'బెంగాలీలో మంచి పేరు సూచించ'మని కూడా కోరిందట. గీతాదత్ సూచించిన పేర్లలో మా అమ్మమ్మ సుందరమ్మ పేరు అమరేటట్లున్న పేరు స్వప్న. అలా స్వప్నసుందరినయ్యాను. మా నాన్న ఆర్మీలో డాక్టర్. ఆ బదిలీల ప్రభావం నా మీద ఎలా పడిందంటే... మేము వెళ్లినచోట భరతనాట్యం గురువు ఉంటే భరతనాట్యం, కూచిపూడి గురువు ఉంటే కూచిపూడి... అలా సాగింది నాట్యసాధన. పదమూడేళ్లకు చెన్నైలో తొలి భరతనాట్య ప్రదర్శన, పద్నాలుగేళ్లకు ఢిల్లీలో కూచిపూడి ప్రదర్శన ఇచ్చాను. మూడవది నేను ఇష్టంగా సాధన చేసిన విలాసిని నాట్యం. రాజమండ్రి సమీపంలోని కోరుకొండ నరసింహస్వామి ఆలయంలో మా గురువు మద్దుల లక్ష్మీనారాయణమ్మ స్వయంగా తన గజ్జెలను నాకు కట్టి ఆరంగేట్రం చేయించారు. నేను మా సొంత ప్రదేశం కోనసీమను చూసింది కూడా అప్పుడే. మా ఇంటిపేరు, ఊరిపేరు ఒకటే. గోదావరి లంకల్లోని వక్కలంక. విలాసిని నాట్య తొలి ప్రదర్శన తర్వాత అనేక ప్రయోగాలు చేశాను. అంతరించి పోతున్న నాట్యరీతిని తర్వాతి తరాలకు అందుబాటులోకి తీసుకురావడానికి, ఆ నాట్యరీతి ప్రాచుర్యానికి నేను చేసిన ప్రయత్నాలను గుర్తించిన భారత ప్రభుత్వం పద్మభూషణ్‌తో సత్కరించింది.

బీఏ ఆగిపోయింది!

నేను స్కూల్ ఫైనల్‌లో ఉన్నప్పుడు మా అమ్మానాన్నలు నన్ను యామినీ కృష్ణమూర్తిగారి ప్రదర్శనకు తీసుకెళ్లారు. ఆమెను చూసిన తర్వాత నాట్యమే జీవితం అని నిర్ణయించుకున్నాను. ఇంట్లో మాత్రం ఎంతటి కళాకారిణివి అయినా చదువులేకపోతే ఎలాగ అన్నారు. రోజూ కాలేజ్‌కెళ్లాలంటే డాన్సు అవకాశాలు ఒకదాని మీద మరొకటి వస్తున్నాయి. టీనేజ్‌లోనే లండన్‌లోని క్వీన్ ఎలిజిబెత్ హాల్‌లో ప్రదర్శన ఇచ్చాను. ప్రైవేట్‌గా బీఏలో చేరాను, కానీ సెకండియర్‌లో మూడు నెలల యూరప్ టూర్‌తో నా బీఏ ఆగిపోయింది. నాట్యం నేర్చుకున్నాను, నాట్యమే చదువుకున్నాను. నాట్యంలో పీహెచ్‌డీ స్కాలర్స్‌కి ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వెళ్తుంటాను. చిన్న వయసులో నాట్యంలో స్థిరపడితే ప్రొఫెషన్‌లో కనీసం 30 ఏళ్లయినా రాణించవచ్చని ఇంట్లో వాదించాను. నేను అనుకున్నట్లే నలభై ఐదేళ్లుగా నాట్యంలో రాణిస్తున్నాను. పాటల విషయానికి వస్తే... నాట్యంలో నేపథ్యంగా వినిపించే ట్రాక్ నేనే పాడుతాను. బాలమురళి అంకుల్‌తో ఆల్బమ్ చేశాను, తమిళ్ గజల్స్ పాడాను. అమ్మతో కలిసి పాడడం, అమ్మ పాడిన పాటలను ఆమెకు నివాళిగా పాడడం గొప్ప అనుభూతి.

నాట్యజ్ఞానకేంద్రం

ఢిల్లీలో స్థాపించిన డాన్స్ సెంటర్ ద్వారా నాట్యానికి సంబంధించిన జ్ఞానాన్ని పంచడంతోపాటు ప్రచారంలోకి తెస్తున్నాను. నాట్యం, సంగీతం, ఆధ్యాత్మికం ఒకదానితో ఒకటి మమేకమై ఉంటాయి. అన్నీ కలిపితేనే సంస్కృతి. అలా నేను సాంస్కృతికవేత్తగా ఆవిష్కారమయ్యాను. నేడు హైదరాబాద్‌లో జరుగుతున్న 'నైమిశం' జిడ్డు కృష్ణమూర్తి 'సెంటర్ ఫర్ కల్చరల్ రీసోర్సెస్ అండ్ ట్రెనింగ్' కోసం సాంస్కృతిక కార్యక్రమాల రూపకల్పన ప్రారంభించాను. కళాసాధనకు, కళాసేవకు... శిఖరాన్ని చేరడం, ప్రయాణం పూర్తవడం అనేది ఉండదు. పరిపూర్ణతను, కొత్త రూపునూ సంతరించుకుంటూ... కళాకారులకు, కళాభిమానులకు సాంత్వననిస్తూ కొత్త పుంతలు తొక్కుతూ సాగుతూనే ఉంటుంది'' అన్నారు స్వప్నసుందరి. ప్రభుత్వం ఆమె నాట్యప్రతిభను పద్మభూషణ్‌తో గౌరవించింది. నిజానికి ఆమె నాట్యానికే భూషణం.

– వాకా మంజులారెడ్డి
ఫొటోలు : నోముల రాజేశ్ రెడ్డి

తెలుగు విలాసిని... విలాసిని నాట్యం మన తెలుగు వారి భారతం. భారతం అంటే మహాభారతం కాదు. భారతం– భాగవతం అని మన ప్రాచీన కళారూపాలు ఈ రెండూ. భారతం శాస్త్రీయంగా ఉంటే భాగవతం సామాన్యులకు అర్థమయ్యేటట్లు సరళంగా ఉండేది. భారతం సోలో డాన్స్, భాగవతం బృంద ప్రదర్శన. లాలిత్యం, సొగసుతో కూడిన ఈ తెలుగు నాట్యరీతిని రాజాస్థానాల్లో రాజదాసీలు, ఆలయాల్లో దేవదాసీలు ప్రదర్శించేవారు. రాజాస్థానాలు పోవడం, కొన్ని సామాజిక దురన్యాయాలను అడ్డుకునే క్రమంలో ఆలయాల్లో నాట్యాలను నిషేధిస్తూ చట్టం వచ్చిన తర్వాత ఆ నాట్యసాధన దాదాపుగా అంతరించి పోయే దశకు చేరుకుంది. ఆ సమయంలో నేను ఈ నాట్యం నేర్చుకుని, అందులో ప్రయోగాలు, విస్తరణ కోసం పని చేస్తున్నాను. నేను విలాసిని మీద పుస్తకం రాసే నాటికి ఆ నాట్యరీతికి తెలుగుభారతం అనే ప్రాచీన నామమే ఉంది. నిష్ణాతులైన కవులు, కళాకారులు, చరిత్రకారులు సంయుక్తంగా చర్చించిన తర్వాత 'విలాసిని' అనే పేరు ఖరారు చేశాం.

- వక్కలంక స్వప్న సుందరి,
సాంస్కృతికవేత్త



కళల కలయిక 'కూచిపూడి'

భాగవతం, యక్షగానం, నాటకం, పగటివేషం వంటి ప్రాచీన కళారూపాల నుంచి ఒక్కో ప్రత్యేకతను మమేకం చేస్తూ రూపొందిన నాట్యప్రక్రియనే మనం కూచిపూడి అని పిలుస్తున్నాం. నిజానికి కూచిపూడి అనే పేరు రావడానికి కారకులు గోల్కొండ పాలకుడు తానీషా. ఆ నాట్యకళాకారుల స్థిరనివాసం కోసం కూచిపూడి అగ్రహారాన్ని ఇచ్చారాయన. కూచిపూడి గ్రామంలోని నాట్యకారుల నాట్యరీతి కూడా ఆ ఊరిపేరుతోనే వ్యవహారంలోకి వచ్చింది. సిద్ధేంద్రయోగికంటే ముందు రెండు వందల సంవత్సరాల నుంచి వచ్చిన పరిణామక్రమాన్ని నేను నా తొలి రచన 'ద వరల్డ్ ఆఫ్ కూచిపూడి డాన్స్'లో రాశాను.

OCTOBER **రొమ్ముక్యాన్సర్ అవగాహన మాసం**

హెల్త్

గమనిక : రొమ్ములో గడ్డలు రావడం చాలా సాధారణం. ఇలా వచ్చిన ప్రతి గడ్డ/కణితి క్యాన్సర్ కాదని గుర్తుంచుకోవాలి.



HER-2 ఆమెకు వచ్చే క్యాన్సర్!

హర్–2 పాజిటివ్ బ్రెస్ట్ క్యాన్సర్ అనేది రొమ్ము క్యాన్సర్లలో ఒక రకం. ఇది వ్యాపించే వేగమూ ఎక్కువే. దీని విస్తృతీ ఎక్కువే. ఎంతంటే... ప్రతి ఐదు రొమ్ము క్యాన్సర్లలోనూ ఈ తరహా కేసు ఒకటి తప్పక కనిపించేంత! ఇంత వేగంగా విస్తరించినప్పటికీ దీనికి సమర్థమైన చికిత్స కూడా అందుబాటులో ఉంది. బాధితులు సైతం కోలుకుని, ఇంచుమించూ పూర్తిగా నార్మల్‌గా జీవించే అవకాశాలూ (ప్రోగ్నోసిస్) ఎక్కువే. అక్టోబరు నెలను 'బ్రెస్ట్ క్యాన్సర్ అవేర్‌నెస్ మంత్'గా చెబుతారు. ఈ సందర్భంగా రొమ్ముక్యాన్సర్లలో ఒకటైన 'హర్–2 పాజిటివ్ రొమ్ము క్యాన్సర్' అవగాహన కోసం ఈ కథనం.

ఇక్కడ 'హర్'... అంటే ఆమెది లేదా ఆమె తాలూకుది కాదు. కాకపోతే ఒకరకంగా చూస్తే... ఈ 'హర్'... 'ఆమె తాలూకుద'ని అర్థమొచ్చేలా యాదృచ్ఛికంగా పేరు కుదిరింది. 'హ్యూమన్ ఎపిడర్మల్ గ్రోత్ ఫ్యాక్టర్ రిసెప్టార్స్ – 2' అనే మాటకు సంక్షిప్తరూపమే ఈ 'హర్–2'. నిజానికి ఇదో రకం రొమ్ముక్యాన్సర్.

మహిళకు రొమ్ముక్యాన్సర్ వచ్చినప్పుడు అందుకు కారణాలను పరీక్షిస్తారు. అప్పుడొకవేళ ఈ తరహా రిసెప్టార్‌ల సంఖ్య ఎక్కువగా ఉండి... వైద్య పరీక్షల్లో పాజిటివ్ అనే రిపోర్టు వస్తే... అది ఖచ్చితంగా 'హర్–2 రిసెప్టార్'లు ఎక్కువగా ఉండటం వల్ల వచ్చిన క్యాన్సరని తెలిసిపోతుంది.

కనుగొనడానికి పరీక్షలేమిటి?

ఈ క్యాన్సర్‌ను కనుగొనడానికి కొన్ని స్కాన్‌లు, ల్యాబ్ టెస్టులు అవసరమవుతాయి. ఈ క్యాన్సర్‌ను అనుమానించినప్పుడు రొమ్ము కణితిని ట్రుకట్ లేదా కోర్ నీడిల్ బయాప్సీ ద్వారా పరీక్షిస్తారు. ఈ పరీక్షను 'ఐహెచ్‌సీ' (ఇమ్యూనో హిస్టో కెమిస్ట్రీ)గా పేర్కొంటారు. ఇందులో 0 – 3 వరకు స్కోర్లు ఉంటాయి. స్కోరు 0 నుంచి 1+ వరకు వస్తే క్యాన్సర్ లేనట్టు. ఒకవేళ 2+ వస్తే క్యాన్సర్ బార్డర్‌లైన్‌లో ఉన్నట్లు. ఇలా 2+ వచ్చినవారికి ఫిష్ (ఫ్లోరోసెంట్ ఇన్ సిట్యూ హైబ్రిడైజేషన్) టెస్ట్ చేయించాల్సి ఉంటుంది. అదే 3+ వచ్చిందంటే 'హర్ – 2' క్యాన్సర్ పాజిటివ్ అన్నమాట.

నయం చేసే మార్గాలేమిటి?

తొలి దశలో మాత్రం దాదాపు పూర్తిగా నయమయ్యే క్యాన్సర్ ఇది. తర్వాతి దశల్లోని క్యాన్సర్లకు చికిత్స మాత్రం ఉంటుంది. కీమోథెరపీతో పాటు టార్గెటెడ్ థెరపీ కూడా ఇచ్చి... నాలుగో దశకు (స్టేజ్ – 4కు) వెళ్లకుండా నివారించడం, మళ్లీ మళ్లీ రాకుండా చూడటం (రికరెన్స్) సాధ్యమౌతుంది. కీమోను ఇస్తూనే 'ట్రాస్టుజుమాబ్' అనే 'హర్ – 2 యాంటీబాడీ' మందు; లేదా పెర్టుజుమాబ్ వంటి టార్గెటెడ్ థెరపీ మందులను నోటిద్వారా ఇస్తూ ఈ క్యాన్సర్‌ను నయం చేయవచ్చు. వీటితోపాటు హార్మోన్ థెరపీ, ఇమ్యూనోథెరపీ వంటి అత్యాధునిక చికిత్స ప్రక్రియలూ అందుబాటులో ఉన్నాయి. ఒక ఏడాది ఈ మందులు వాడాక, ఆ తర్వాత కొంతమందిలో ఇచ్చే నెరాటినిబ్ అనే మందు ఇప్పుడు కొత్తగా అందుబాటులోకి వచ్చింది. దీన్ని మరో ఏడాది పాటు వాడాల్సి ఉంటుంది.

ఆరోగ్యవంతుల్లోనూ 'హర్–2', రిసెప్టార్‌లు ఉంటాయా?

ఆరోగ్యవంతులైన మహిళల రొమ్ములో సాధారణ ఎపిడెర్మల్ సెల్స్‌తో పాటు 'హర్–2' కూడా ఉంటాయి. అయితే వీటి సంఖ్య చాలా చాలా తక్కువ. ఒక అంచనా ప్రకారం 20,000 రిసెప్టార్‌లలో కేవలం రెండు మాత్రమే 'హర్–2' జన్యువుల కాపీలు ఉంటాయి. అదే రొమ్ముక్యాన్సర్ వచ్చిన సందర్భాల్లో మాత్రం వీటి సంఖ్య 40 నుంచి 100 రెట్ల వరకు పెరుగుతుంది.

నిజానికి 'హర్–2' రిసెప్టార్ పనేమిటి?

హర్ –2 అనే ప్రొటీన్స్ రొమ్ము కణాల్లో ఉంటాయి. సాధారణంగానైతే... ఈ 'హర్–2' రిసెప్టార్‌లు రొమ్ము పెరుగుదలకు, అక్కడి కణాలు ఆరోగ్యవంతంగా విభజితం అయ్యేందుకు, కణాలేవైనా దెబ్బతింటే వాటిని రిపేర్లు చేసేందుకు అవసరమైన ఆదేశాలను అక్కడి కణాలకు అందిస్తాయి. కానీ అవే క్యాన్సర్ కారకాలుగా పరిణమించాయంటే... అవి తాము నెరవేర్చాల్సిన విధులను సక్రమంగా చేయని విధంగా దెబ్బతిన్నాయని అర్థం. అప్పుడా దెబ్బతిన్న 'హర్–2' రిసెప్టార్లకు చెందిన జన్యువులు తమను తాము చాలా పెద్ద సంఖ్యలో కాపీలు చేసుకుని పెరుగుతుంటాయి. ఈ పరిస్థితినే 'హర్ – 2' జీన్ యాంప్లిఫికేషన్ అంటారు. ఇలాంటప్పుడు రొమ్ము క్యాన్సర్ కోసం చేసే పరీక్షల్లో 'హర్–2' పాజిటివ్ వస్తుంది. అంటే ఈ పాజిటివ్ కణాల సంఖ్య విపరీతంగా పెరిగిపోయి ఉంటుందన్నమాట. దాదాపు 10% నుంచి 20% రొమ్ము క్యాన్సర్ కేసుల్లో ఇది జరుగుతుంది.

దీని వాస్తవ స్థానం (ఎగ్జాక్ట్ లొకేషన్) ఎక్కడ?

'హర్ – 2' అనేది ఇక్కడ ఒక రకం రొమ్ముక్యాన్సర్‌కు కారణమయ్యే రిసెప్టార్. మానవదేహంలోని 17వ క్రోమోజోముపై (లాంగ్ ఆర్మ్ ఆఫ్ హ్యూమన్ క్రోమోజోమ్ తాలూకు 17వ దానిపై) ఉంటుందిది. కణంలో కచ్చితంగా దీని లొకేషన్ తెలియడానికి '17క్యూ12' అని సాంకేతికంగా చెబుతారు.


డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ రావు
సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్ట్

వాటికి 'హర్–2' అనే పేరెందుకు?

ఎందుకంటే... మనుషుల్లో సాధారణంగా ఉండే 'ఎపిడర్మల్ గ్రోత్ ఫ్యాక్టర్ రిసెప్టార్ - 1' (అంటే హర్–1) అనే అసలు కణాలతో చాలా ఎక్కువగా పోలి ఉంటాయి. దాదాపుగా వాటిలాగే అనిపిస్తాయి. అందుకే వీటికి 'హర్–2' అని పేరు.

దేహంలో ఎక్కడెక్కడ, ఏయే వ్యవస్థల్లో ఉంటాయి?

శరీర నిర్మాణంలో ఇవి అనేక రకాల వ్యవస్థ (బాడీ సిస్టమ్స్)ల్లోని కణజాలాల్లో ఉంటాయి. ఉదాహరణకు నాడీ వ్యవస్థల్లో, అనేక భాగాల్లోని ఉపరితల కణాల్లో... అంటే ఎపిథీలియల్‌సెల్స్‌లో, రొమ్ముల్లో ఉంటాయి. ఇవి అక్కడ కణాల పెరుగుదలకు దోహదపడుతుంటాయి. అయితే సాధారణంగా కణాల విభజనకూ, పెరుగుదలకూ దోహదపడే ఇవి... ఇబ్బడి ముబ్బడిగానూ, ఆ పైన అనియంత్రితంగా పెరిగిపోయినప్పుడు క్యాన్సర్ కణాలుగా మారతాయి.

ఈ క్యాన్సర్‌లో నయమయ్యే అవకాశాలు ఎంత?

తొలి దశలో కనుక్కుంటే (అర్లీ బ్రెస్ట్ క్యాన్సర్స్‌లో) దాదాపు పూర్తిగా నయమవుతుంది. 'హర్ –2' పాజిటివ్ రొమ్ము క్యాన్సర్‌లో నయమయ్యే పర్సెంటేజీ చాలా ఎక్కువ. దాదాపు 95 శాతం. కచ్చితంగా చెప్పాలంటే 92.5% కంటే ఎక్కువే. కాబట్టి ఈ క్యాన్సర్ బాధితులు బాధపడాల్సిన అవసరం పెద్దగా ఉండదు.

ఈ రొమ్ముక్యాన్సర్‌కు గురైనవారు చాలా తేలిగ్గా కోలుకుంటారు. మందులు వాడుతూ, చికిత్స తీసుకున్న చాలా కేసుల్లో రొమ్మును తొలగించాల్సిన అవసరం ఉండదు. కానీ కొన్ని పరిస్థితుల్లో మాత్రం (స్టేజ్ 2, 3లలో) రొమ్ము తొలగింపు తప్పనిసరి కావచ్చు. ఇందుకు విచారించాల్సిన అవసరం లేదు. ఇలా రొమ్ము తొలగించాల్సి వచ్చినప్పుడు జబ్బు పూర్తిగా తొలగిపోయాక మళ్లీ ప్లాస్టిక్ సర్జరీ ద్వారా రొమ్మును రీ–కన్‌స్ట్రక్ట్ చేయవచ్చు. కాబట్టి రొమ్ము తొలగింపు వల్ల వ్యాధి దూరం కావడం తప్ప నష్టమేమీ ఉండదు.

పెందలకడనే లేవాలి... పొద్దు గూటిలో పడకముందే రాత్రి భోజనం చేసేయాలి. ఇవి మన పెద్దలు చెప్పే సుద్దులు. ఈ తరహా ఆరోగ్య సూత్రాలు భాషా, ప్రాంత భేదాలు లేకుండా అన్ని సంస్కృతుల్లోనూ ఉన్నాయి. ఉదాహరణకు ఇదే అర్థం వచ్చే ఇంగ్లిష్ వాడుక 'అర్లీ టు బెడ్, అర్లీ టు రైజ్'! బాగా పొద్దుబోయి తినడం వల్ల, మరీ అర్ధరాత్రి భోజనాల వల్ల బరువు పెరిగే అవకాశం ఉన్నట్లు చెబుతారు. ఇప్పుడు ఓ అమెరికన్ అధ్యయనంలో ఇది వాస్తవమని తేలింది. కొంతవరకు కారణాలు కూడా. ఆ వివరాలివే...



లేట్ నైట్ భోజనం వద్దు... బ్రేక్‌ఫాస్ట్ స్కిప్ చేయవద్దు...

ఈ అధ్యయనాన్ని చేపట్టడం కోసం ముందుగా కొంతమందిని ఎంపిక చేశారు. వీళ్లంతా వేర్వేరు వేళలకు భోజనాలు చేసేవారు. ఈ ఎంపిక చేసిన వ్యక్తులను రెండు గ్రూపులుగా విభజించారు. మొదటి గ్రూపు ప్రతిరోజూ నిద్ర లేచాక ఉదయం ఫలహారం (టిఫిన్) ఇచ్చే సమయానికీ వారు రాత్రి భోజనం చేసిన సమయానికి మధ్య వ్యవధి సరిగ్గా గం. 6.40 నిమిషాలు ఉండేలా చూశారు. అంతేకాదు వీళ్లు పెందలకడనే భోజనం చేస్తారు. ఇందుకోసం వాళ్లు రాత్రి భోజనం కూడా చాలా త్వరగానే పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇక రెండో గ్రూపు వారికి మాత్రం పెందలకడనే కాకుండా... మొదటి గ్రూపునకు బ్రేక్‌ఫాస్ట్ ఇచ్చిన నాలుగు గంటల తర్వాత భోజనం పెట్టారు. వాళ్లకు పొద్దుటి ఫలహారం (బ్రేక్‌ఫాస్ట్/టిఫిన్) ఇవ్వకుండా స్కిప్ చేసి, నేరుగా మధ్యాహ్నభోజనం (లంచ్) పెట్టారన్న మాట. ఈ రెండు గ్రూపులకు ఇచ్చే భోజనం, దాని పరిమాణం అంతా పూర్తిగా ఒకేలా ఉండేలా చూశారు. ఆ తర్వాత ఆ రెండు గ్రూపుల వారిని మూడు అంశాల్లో పరీక్షించారు.

1. **వాళ్లలో ఆకలి ఎలా ఉంది?**
2. **వారి భోజనం వేళల ఆధారంగా వాళ్ల క్యాలరీల ఖర్చు (క్యాలరీస్ బర్న్‌డ్) ఎలా జరిగింది?**
3. **కొవ్వు కణజాలంలో వచ్చిన మార్పులు ఏమిటి?**

ఆకలిని కొలవడానికి వారు రెండు టెక్నిక్స్ అవలంబించారు. మొదటిది.. వేర్వేరు వేళల్లో వారి ఆకలి ఎలా ఉంది? రెండోది... వాళ్ల రక్తనమూనాలు సేకరించి, ఆకలిని నియంత్రించే హార్మోనుల మోతాదులను పరీక్షించారు. అంటే భోజనం పూర్తి కాగానే కడుపు నిండిందని తెలిపే లెప్టిన్, అలాగే ఆకలేయగానే ... ఆ ఫీలింగ్‌ను తెలిపే గ్రెలిన్ హార్మోనుల మోతాదులను పరీక్షించారు. అలాగే 'ఇండైరెక్ట్ కెలొరీమెట్రీ' అనే పద్ధతి ద్వారా వాళ్లు వినియోగించిన క్యాలరీలను తెలుసుకున్నారు. ఆలస్యంగా తినడం కారణంగా వాళ్లలో నిల్వ ఉన్న కొవ్వు మోతాదులు ఎలా మారుతున్నాయో తెలుసుకునేందుకు పొట్ట దగ్గర బయాప్సీ చేసి, కొవ్వు మోతాదులను అంచనా వేశారు.

వీటన్నింటి ద్వారా తెలిసిందేమిటంటే... రాత్రి త్వరగా భోజనం చేయని వాళ్లు, అలాగే తెల్లవారగానే బ్రేక్‌ఫాస్ట్ చేయకుండా, నేరుగా లంచ్ చేసేవాళ్లలో శరీర వ్యవస్థల పనితీరులో మార్పులు (ఫిజియొలాజికల్ ఛేంజెస్), మాలెక్యులార్ మార్పులు వచ్చి అది క్రమంగా వారిలో బరువు పెరగడానికి దారితీస్తుందని తేలింది. మనం పగలు చురుగ్గా ఉండటం, రాత్రి సమయానికి నిద్రపోవడం... ఇలా జరిగేలా చేసే 'సర్కాడియన్ రిథమ్'ను సైతం... మన భోజనవేళలు ప్రభావితం చేస్తాయని పరిశోధకులు తెలుసుకున్నారు. మన భోజన సమయాలను బట్టి మన దేహంలో స్రవించే హార్మోన్ల మార్పు వల్ల ఇలా జరుగుతుందని తెలిసింది.

సమయానికి భోజనం చేయని వాళ్లు, రాత్రుళ్లు ఆలస్యంగా భోజనం చేసేవారు, అలాగే ఉదయం బ్రేక్‌పాస్ట్ స్కిప్ చేసేవాళ్లలో బరువు పెరిగే అవకాశాలుంటాయనీ, అలాగే ఇలాంటివాళ్లలో రక్తపోటు పెరగడం వల్ల హైబీపీ, టైప్–2 డయాబెటిస్ వచ్చే అవకాశాలూ ఉంటాయని తేలింది. యూనివర్సిటీ ఆఫ్ అబెర్డీన్‌లోని 'ద రోవెట్ ఇన్‌స్టిట్యూట్'కు చెందిన 'పర్సనల్ ఛైర్ ఇన్ న్యూట్రిషన్ అలెక్స్ జాన్‌స్టోన్ ఈ వివరాలను వెల్లడించారు.



మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో సిక్కి రెడ్డి-రోహన్ జోడీ

ఇండియా ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నీలో తెలంగాణ అమ్మాయి సిక్కి రెడ్డి మిక్స్‌డ్ డబుల్స్‌లో ఫైనల్‌కు చేరింది. బెంగళూరులో శనివారం జరిగిన సెమీఫైనల్లో సిక్కి రెడ్డి-రోహన్ కపూర్ (భారత్) జోడీ 21-17, 14-21, 21-16తో షేక్ గౌస్-మనీషా (భారత్) ద్వయంపై గెలిచింది. నేడు జరిగే ఫైనల్లో అశ్విని పొన్నప్ప-సాయి ప్రతీక్ (భారత్)లతో సిక్కి-రోహన్ తలపడతారు. మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో తెలంగాణ అమ్మాయి గద్దె రుత్విక శివాని ఫైనల్లోకి దూసుకెళ్లింది. సెమీఫైనల్లో రుత్విక 21-16, 19-21, 21-16తో మాన్సి సింగ్ (భారత్)పై నెగ్గింది. నేడు జరిగే ఫైనల్లో తాన్యా హేమంత్‌తో రుత్విక ఆడుతుంది. పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో పంజాల విష్ణువర్ధన్ గౌడ్-గరగ కృష్ణప్రసాద్ (భారత్) జోడీ 15-21, 18-21తో చలోంపన్-నాంథకర్న్ (థాయ్‌లాండ్) ద్వయం చేతిలో ఓడిపోయింది.

మనదే ఆసియా కప్



- ఏడోసారి విజేతగా నిలిచిన భారత మహిళల జట్టు
- ఫైనల్లో శ్రీలంకపై 8 వికెట్లతో గెలుపు
- రాణించిన రేణుక, స్మృతి మంధాన

సిల్హెట్ (బంగ్లాదేశ్): మరోసారి తమ ఆధిపత్యాన్ని చాటుకున్న భారత మహిళల జట్టు ఆసియా టి20 క్రికెట్ టోర్నీలో చాంపియన్‌గా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్లో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా ఎనిమిది వికెట్ల తేడాతో శ్రీలంకను చిత్తుగా ఓడించి ఏడోసారి ఆసియా టైటిల్‌ను సొంతం చేసుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 65 పరుగులు సాధించింది. భారత బౌలర్లు రేణుక సింగ్ (3/5), రాజేశ్వరి గైక్వాడ్ (2/16), స్నేహ రాణా (2/13) ధాటికి శ్రీలంక 32 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఒషాడి రణసింఘే (13; 1 ఫోర్), ఇనోకా రణవీర (18 నాటౌట్; 2 ఫోర్లు) మాత్రమే రెండంకెల స్కోరు దాటారు. అనంతరం భారత్ 8.3 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 71 పరుగులు చేసి గెలిచింది. షఫాలీ వర్మ (5), జెమీమా రోడ్రిగ్స్ (2) తక్కువ స్కోరుకే అవుటవ్వగా... స్మృతి మంధాన (25 బంతుల్లో 51 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), హర్మన్‌ప్రీత్ (14 బంతుల్లో 11 నాటౌట్; 1 ఫోర్) దూకుడుగా ఆడి భారత విజయాన్ని ఖాయం చేశారు. రేణుక సింగ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద ఫైనల్' అవార్డు... దీప్తి శర్మకు 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డు లభించాయి.

18 ఏళ్ల ఆసియా కప్ టోర్నీ చరిత్రలో భారత్ నాలుగుసార్లు వన్డే ఫార్మాట్‌లో (2004, 2005-2006, 2006, 2008), మూడుసార్లు టి20 ఫార్మాట్‌లో (2012, 2016, 2022) విజేతగా నిలిచింది. ఈ టోర్నీ చరిత్రలో ఐదోసారి భారత్‌తో ఫైనల్ ఆడిన శ్రీలంక ఐదుసార్లూ ఓడి రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకుంది.

ఈ మ్యాచ్‌తో అత్యధిక టి20 మ్యాచ్‌లు ఆడిన మహిళా క్రికెటర్‌గా హర్మన్‌ప్రీత్ (137) గుర్తింపు పొందింది. న్యూజిలాండ్ క్రికెటర్ సుజీ బేట్స్ (136) రెండో స్థానంలో, ఇంగ్లండ్ ప్లేయర్ డాని యెలా వ్యాట్ (135) మూడో స్థానంలో ఉన్నారు.

ఇషా పసిడి గురి



కైరో (ఈజిప్ట్): ప్రపంచ జూనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ షూటర్ ఇషా సింగ్ స్వర్ణ పతకం సాధించింది. శనివారం జరిగిన జూనియర్ మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో ఇషా సింగ్ చాంపియన్‌గా అవతరించింది. ఫైనల్లో ఇషా 29 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానంలో నిలిచింది. సిజువాన్ ఫెంగ్ (చైనా; 26 పాయింట్లు) రజతం, మిరియమ్ జాకో (హంగేరి; 18 పాయింట్లు) కాంస్యం గెలిచారు. పురుషుల జూనియర్ 25 మీటర్ల పిస్టల్, స్టాండర్డ్ పిస్టల్ ఈవెంట్స్‌లో భారత్‌కే చెందిన ఉదయ్‌వీర్ సిద్ధూ పసిడి పతకాలు సొంతం చేసుకున్నాడు. పిస్టల్ విభాగంలో ఉదయ్‌వీర్ 580 పాయింట్లు స్కోరు చేసి టాప్ ర్యాంక్‌లో నిలిచాడు. మాస్ట్రోవలెరియో (ఇటలీ; 579 పాయింట్లు) రజతం, లియు యాంగ్‌పన్ (చైనా; 577 పాయింట్లు) కాంస్యం సాధించారు. స్టాండర్డ్ పిస్టల్ ఈవెంట్‌లో ఉదయ్‌వీర్ 568 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. సమీర్ (భారత్; 567 పాయింట్లు) కాంస్యం గెలిచాడు.



టి20 ప్రపంచకప్ ట్రోఫీతో 16 జట్ల కెప్టెన్లు

పద పద పరుగుల పండగ వైపు...

నేటినుంచి టి20 ప్రపంచ కప్ • బరిలో 16 జట్లు • 21 వరకు తొలి రౌండ్ మ్యాచ్‌లు • 22 నుంచి గ్రూప్ సమరం

మెల్‌బోర్న్: టి20 ప్రపంచకప్-2021 ఫైనల్ నవంబర్ 14న జరిగింది. క్యాలెండర్‌లో సంవత్సరం కూడా పూర్తి కాకుండానే మరోసారి ధనాధన్ ఆటలో విశ్వ సమరానికి సమయం వచ్చేసింది. డిఫెండింగ్ చాంపియన్, మాజీ చాంపియన్లు, కొత్త చాంపియన్‌గా నిలవాలని పట్టుదలగా ఉన్న జట్లన్నీ మరోసారి సత్తా చాటేందుకు బరిలోకి దిగబోతున్నాయి. వన్డే వరల్డ్ కప్‌లను రెండు సార్లు దిగ్విజయంగా నిర్వహించిన ఆస్ట్రేలియా తొలిసారి పొట్టి ప్రపంచకప్‌నకు ఆతిథ్యం ఇస్తుండగా, కొత్తగా అమల్లోకి వచ్చిన ఐసీసీ నిబంధనలతో మెగా ఈవెంట్ మరింత ఆసక్తికరంగా మారనుంది. తొలి రౌండ్‌లో 8 జట్ల మధ్య జరిగే 12 మ్యాచ్‌ల పోరు తర్వాత 12 జట్ల రెండో దశ సమరంతో మొదలు పెట్టి మరో 33 మ్యాచ్‌లు ఆసాంతం వినోదాన్ని పంచడం ఖాయం. మొత్తంగా 29 రోజుల పాటు క్రికెట్ అభిమానులకు పరుగుల పండగే.

ఏడాది వ్యవధిలోనే...

ఐసీసీ లెక్కల ప్రకారం 2010 నుంచి ప్రతీ రెండేళ్లకు ఒకసారి టి20 వరల్డ్ కప్ జరగాలి. అయితే 2016 తర్వాత ఏకంగా ఐదేళ్ల విరామం వచ్చింది. 2018లో పెద్ద సంఖ్యలో ద్వైపాక్షిక సిరీస్‌లు ఖరారు కావడంతో టోర్నీ సాధ్యం కాలేదు. ఆ ఏడాది దక్షిణాఫ్రికాలో జరిపేందుకు ప్రయత్నించినా... 'నల్లజాతీయుల రిజర్వేషన్' సమస్యలతో అక్కడి ప్రభుత్వం అదే సమయంలో దక్షిణాఫ్రికా బోర్డుపై నిషేధం విధించింది. 2019లో వన్డే వరల్డ్ కప్ ఉంది కాబట్టి దానిని 2020కి మార్చారు. అయితే కరోనా కారణంగా వాయిదా తప్పలేదు. 2021లో భారత్‌లో చాంపియన్స్ ట్రోఫీ జరగాల్సి ఉండగా, దానిని రద్దు చేసి టి20 ప్రపంచకప్‌గా మార్చారు. అయితే తమ హక్కులను వదులుకునేందుకు భారత్ ఇష్టపడకపోవడంతో అదే ఏడాది భారత్ (యూఏఈలో) నిర్వహించింది. 2020లో నిర్వహించాల్సిన ఆస్ట్రేలియా దానిని 2022కు మార్చుకోవాల్సి వచ్చింది. గతంలోనూ చాంపియన్స్ ట్రోఫీ సమస్యలతోనే 2009, 2010లో వరుసగా రెండు ప్రపంచకప్‌లు జరిగాయి.

ఫార్మాట్

గత వరల్డ్ కప్ తరహాలోనే ఎలాంటి మార్పూ లేదు. తొలి రౌండ్‌లో 8 జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. ప్రతీ టీమ్ తన గ్రూప్‌లోని మిగిలిన 3 టీమ్‌లతో తలపడుతుంది. గ్రూప్‌లో టాప్-2 జట్లు తర్వాతి దశకు అర్హత సాధిస్తాయి.

- గ్రూప్ 'ఎ'లో మాజీ చాంపియన్ శ్రీలంక, నమీబియా, నెదర్లాండ్స్, యూఏఈ ఉండగా... గ్రూప్ 'బి'లో రెండుసార్లు చాంపియన్ వెస్టిండీస్, స్కాట్లాండ్, ఐర్లాండ్, జింబాబ్వే ఉన్నాయి. ఇక్కడ ముందంజలో నిలిచిన నాలుగు టీమ్‌లతో పాటు ర్యాంకింగ్ ద్వారా నేరుగా అర్హత సాధించిన భారత్, పాకిస్తాన్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్‌లు కలిసి 'సూపర్ 12' మ్యాచ్‌లు ఆడతాయి. 'సూపర్ 12' మ్యాచ్‌లు ఈనెల 22 నుంచి మొదలవుతాయి.
- 'సూపర్ 12' గ్రూప్-1లో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, అఫ్గానిస్తాన్... గ్రూప్-2లో భారత్, పాకిస్తాన్, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్ జట్లు ఉన్నాయి.
- 'సూపర్ 12'లోని రెండు గ్రూపుల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. తొలి సెమీఫైనల్ నవంబర్ 9న... రెండో సెమీఫైనల్ నవంబర్ 10న జరుగుతాయి. ఫైనల్ నవంబర్ 13న నిర్వహిస్తారు.

గత రికార్డు

ఇప్పటి వరకు 7 టి20 ప్రపంచకప్‌లు జరగ్గా... వెస్టిండీస్ రెండు సార్లు (2012, 2016), భారత్ (2007), పాక్ (2009), ఇంగ్లండ్ (2010), శ్రీలంక (2014), ఆస్ట్రేలియా (2021) ఒక్కోసారి విజేతగా నిలిచాయి.

నేటి మ్యాచ్‌లు

శ్రీలంక X నమీబియా (ఉదయం గం. 9:30 నుంచి)
నెదర్లాండ్స్ X యూఏఈ (మధ్యాహ్నం గం. 1:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్-1,2లో ప్రత్యక్ష ప్రసారం

'మేం క్రికెట్ గురించి మాట్లాడుకోం'

భారత్, పాక్ ఆటగాళ్ల స్నేహంపై రోహిత్

ప్రపంచకప్‌లో భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్ అంటే కొత్తగా చెప్పేదేముంది. ఆటగాళ్లు తాము దానిని ప్రత్యేకంగా చూడమని, అన్ని మ్యాచ్‌లలో ఒకటని పైకి ఎన్ని మాటలు చెప్పినా ఆ ఉత్కంఠ, ఉద్వేగాలే వేరు. టి20 ప్రపంచకప్‌లో మెల్‌బోర్న్ వేదికగా ఈ నెల 23న మరోసారి అలాంటి సమరమే జరగనుంది. 90 వేల సామర్థ్యం గల స్టేడియం ఇరు జట్ల అభిమానులతో హోరెత్తిపోవడం ఖాయం. అయితే మైదానం బయట మాత్రం ఇటీవల ఇరు జట్ల క్రికెటర్లు తరచుగా ఎంతో స్నేహంగా, సాన్నిహిత్యంతో కనిపిస్తున్నారు. దీనిపై భారత కెప్టెన్ రోహిత్ శర్మ స్పందించాడు. మ్యాచ్‌కు ప్రాధాన్యత ఉందని అంగీకరిస్తూనే మరో ఆసక్తికర విషయాన్నీ అతను పంచుకున్నాడు. 'ఆ మ్యాచ్‌కు ప్రత్యేకత ఉందనే విషయాన్ని కాదనలేం. అయితే ఎప్పుడూ దాని గురించే మాట్లాడుతూ ఒత్తిడి పెంచుకోవడం కూడా అనవసరం. అందుకే ఇరు జట్లు ఆటగాళ్లం కలిసినప్పుడు మాత్రం అసలు క్రికెట్ గురించే మాట్లాడం. కుటుంబసభ్యుల గురించి, ఇంటి విషయాల గురించే చర్చించుకుంటాం. జీవితం ఎలా సాగిపోతోందని, ఇటీవల కొత్తగా కొన్న కారు గురించో, లేదంటే కొనబోయే కారు గురించే కబుర్లు చెప్పుకుంటాం' అని రోహిత్ వెల్లడించాడు. జట్టులో షమీ చేరిక పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన రోహిత్... భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుంటే బుమ్రా ఈ టోర్నీకి దూరం కావడమే మంచిదని అభిప్రాయపడ్డాడు. ప్రపంచకప్ కంటే కెరీర్ ముఖ్యమని, ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా గాయాలు ఆటలో భాగమనే సంగతి మరచిపోవద్దని రోహిత్ అన్నాడు. రోహిత్ తనకంటే పెద్దవాడని, అతని నుంచి ఏదైనా నేర్చుకునేందుకు ప్రయత్నిస్తానని పాక్ కెప్టెన్ బాబర్ ఆజమ్ చెప్పాడు.



సినిమా

మల్టీ హంగామా

ఈ ఏడాది మల్టీస్టారర్ ట్రెండ్ తెలుగులో బాగా కనిపించింది. 'ఆర్ఆర్ఆర్', 'భీమ్లానాయక్', 'బంగార్రాజు, 'ఆచార్య' వంటి మల్టీస్టారర్ సినిమాలు వచ్చాయి. ఇద్దరు స్టార్ హీరోలు కనిపించిన ఈ 'మల్టీ హంగామా'లను ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేశారు. వచ్చే ఏడాది మరికొన్ని మల్టీస్టారర్ ఫిల్మ్స్ రానున్నాయి. ప్రస్తుతం సెట్స్‌లో ఉన్న ఆ సినిమాలపై ఓ లుక్ వేయండి.



• అఖిల్, నాగార్జున



• రవితేజ, చిరంజీవి



• రామ్‌చరణ్, సల్మాన్‌ఖాన్, వెంకటేశ్

దాదాపు ఇరవైరెండు సంవత్సరాల తర్వాత హీరో చిరంజీవి, రవి తేజ స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు. కేఎస్ రవీంద్ర (బాబీ) దర్శకత్వంలో రూపొందుతున్న 'వాల్తేరు వీరయ్య' (ప్రచారంలో ఉన్న టైటిల్) సినిమాలోనే స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు చిరంజీవి, రవితేజ. ఇంతకు ముందు ఈ ఇద్దరూ కలిసి 'అన్నయ్య' (2000) సినిమా చేశారు. ఆ చిత్రంలో చిరంజీవి తమ్ముడు పాత్ర చేశారు రవితేజ. ఇప్పుడు వాల్తేరు వీరయ్య' చిత్రంలో కూడా చిరంజీవి, రవితేజ బ్రదర్స్‌గానే కనిపిస్తారనే టాక్ ఫిల్మ్ నగర్‌లో వినిపిస్తోంది. ఇందులో రవితేజ పోలీసాఫీసర్ పాత్రలో నటిస్తున్నారని సమాచారం. చిరంజీవి, రవితేజల కాంబినేషన్ సీన్స్ చిత్రీకరణ కూడా ఇటీవల వైజాగ్‌లో జరిగింది. ఇక అప్పుడు 'అన్నయ్య' చిత్రం జనవరిలో సంక్రాంతి పండక్కి రిలీజ్ కాగా, ఇప్పుడు 'వాల్తేరు వీరయ్య' సినిమా కూడా సంక్రాంతి సందర్భంగానే రిలీజ్ కానుండటం విశేషం. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమాలో శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇక వెంకటేష్, సల్మాన్ ఖాన్, రామ్‌చరణ్‌లు కలిసి సిల్వర్ స్క్రీన్‌పై ఒకేసారి కనిపిస్తే వారి అభిమానులు విజిల్స్ వేయాల్సిందే. ఈ ముగ్గురూ కలిసి హిందీ చిత్రం 'కిసీ కీ భాయ్ కిసీ కీ జాన్' అనే సినిమాలో స్క్రీన్ షేర్ చేసుకున్నారు. సల్మాన్ ఖాన్, వెంకటేశ్ లీడ్ హీరోలుగా నటిస్తున్న ఈ చిత్రంలో రామ్‌చరణ్‌ది అతిథి పాత్ర. ఓ పాటలో మాత్రమే చరణ్ కనిపిస్తారు. ఫర్హాద్ సామ్జీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో పూజా హెగ్డే, జగపతిబాబు ఇతర లీడ్ రోల్స్ చేస్తున్నారు. ఈ సినిమాను వచ్చే ఏడాది రంజాన్‌కి రిలీజ్ చేయాలనుకుంటున్నారు. మరోవైపు 'మనం', 'బంగార్రాజు' చిత్రాల్లో పెద్ద కుమారుడు నాగచైతన్యతో కలిసి నటించిన నాగార్జున ఇప్పుడు చిన్న కుమారుడు అఖిల్‌తో ఓ సినిమా చేయనున్నారు. అక్కినేని నాగేశ్వరరావు-నాగార్జున- నాగచైతన్య నటించిన 'మనం'లో అఖిల్ ఓ గెస్ట్ రోల్‌లో కనిపించిన విషయం తెలిసిందే. ఇప్పుడు నాగార్జున, అఖిల్ హీరోలుగా మోహన్‌రాజా దర్శకత్వంలో ఓ భారీ మల్టీస్టారర్ ఫిల్మ్ తెరకెక్కనుంది. ఇంకోవైపు 'అగ్ని నక్షత్రం' కోసం తొలిసారి స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు తండ్రీకూతురు మంచు మోహన్ బాబు, మంచు లక్ష్మి. ప్రతీక్ ప్రజోష్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో విశ్వంత్, చిత్రా శుక్లా, మలయాళ నటుడు సిద్ధిఖ్ ఇతర లీడ్ రోల్స్ చేస్తున్నారు. శ్రీ లక్ష్మీ ప్రసన్న పిక్చర్స్, మంచు ఎంటర్‌టైన్‌మెంట్‌పై ఈ చిత్రం రూపొందుతోంది. మలయాళ హిట్ 'ఆండ్రాయిడ్ కుంజప్పన్ వెర్షన్ 5.25' తెలుగు రీమేక్ హక్కులను హీరో- నిర్మాత విష్ణు మంచు దక్కించుకున్నారని తెలిసింది. ఈ సినిమాలో తండ్రి పాత్రలో మోహన్‌బాబు నటించనున్నారు. తనయుడు పాత్రలో టాలీవుడ్‌లోని ఓ యంగ్ హీరో కనిపిస్తారట. ఒకవేళ మంచు విష్ణుయే ఈ పాత్రనూ చేస్తే అది మరో మల్టీస్టారర్ అవుతుంది. ఇంకోవైపు మేనమామ... మేనల్లుడు పవన్ కల్యాణ్- సాయిధరమ్ తేజ్‌లు స్క్రీన్ షేర్ చేసుకోనున్నారనే వార్తలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. తమిళంలో విజయం సాధించిన 'వినోదాయ సిత్తమ్' తెలుగులో రీమేక్ కానుందని, ఈ చిత్రంలోనే పవన్ కల్యాణ్, సాయిధరమ్ నటించనున్నారన్నది ఫిల్మ్ నగర్ టాక్. సముద్రఖని ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తారట. ఇంకోవైపు మీడియమ్ రేంజ్ హీరోల మల్టీస్టారర్ మూవీస్ కూడా రానున్నాయి. హీరో సత్య దేవ్, డాలీ ధనంజయ ('పుష్ప' సినిమాలో యాక్ట్ చేశారు) కలిసి ఓ మల్టీస్టారర్ ఫిల్మ్ చేస్తున్నారు. ఈ సినిమాకు ఈశ్వర్ కార్తీక్ దర్శకుడు. అలాగే రాజ్ తరుణ్, 'జార్జిరెడ్డి' ఫేమ్ సందీప్ మాధవ్ 'మాస్ మహారాజు' అనే సినిమా చేస్తున్నారు. ఇవేకాదు.. మరికొన్ని మల్టీస్టారర్ ఫిల్మ్స్‌కి కాంబినేషన్ సెట్ అవుతోందని తెలిసింది.



• రాజ్‌తరుణ్, సందీప్ మాధవ్



• సాయిధరమ్ తేజ్, పవన్ కల్యాణ్



• సత్యదేవ్, డాలీ ధనంజయ



• మణిశర్మ, నరేంద్ర, ప్రకీర్తి, ప్రసీద, మెహర్ రమేశ్, అలీ

నాన్న సేవా కార్యక్రమాలను మేం కొనసాగిస్తాం - ప్రసీద

''షుగర్ వ్యాధి తీవ్రంగా ఉన్న రోగులకు చికిత్స అందించే 'యూకే - ఇండియా డయాబెటిక్ ఫుడ్ ఫౌండేషన్'లో మా నాన్నగారు (కృష్ణంరాజు) భాగస్వామిగా ఉన్నారు. 'బిల్లా' సినిమా వసూళ్లను ఆ ఫౌండేషన్‌కు ఇస్తాం.. అంతేకాదు.. ఈ సేవా సంస్థ కార్యక్రమాలను మేము కొనసాగిస్తాం'' అని దివంగత రెబల్‌స్టార్ కృష్ణంరాజు కుమార్తె, నిర్మాత ప్రసీద అన్నారు. ప్రభాస్ హీరోగా మెహర్ రమేశ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'బిల్లా'. కృష్ణంరాజు సమర్పణలో నరేంద్ర, ప్రబోధ్ నిర్మించిన ఈ సినిమా 2009 ఏప్రిల్ 3న విడుదలై, హిట్ అయింది. కాగా ఈ నెల 23న ప్రభాస్ బర్త్ డే సందర్భంగా 'బిల్లా'ని 4కె వెర్షన్‌లో రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రెస్‌మీట్‌లో ప్రసీద మాట్లాడుతూ- ''గోపీకృష్ణా మూవీస్‌లో మా నాన్న, అన్నయ్య కలిసి నటించిన 'బిల్లా' మాకెంతో స్పెషల్. నాన్నకి ఇష్టమైన ఈ సినిమాని అన్నయ్య బర్త్‌డేకి రీ రిలీజ్ చేయడం ఆనందంగా ఉంది'' అన్నారు. మెహర్ రమేష్ మాట్లాడుతూ-''పెదనాన్న, నేను కలిసి నటించాలనేది ఫ్యాన్స్ కోరిక అని ప్రభాస్ అనడంతో కృష్ణంరాజుగారితో 'బిల్లా'లో పాత్ర చేయించాం. ఈ 4కే షోను కృష్ణంరాజుగారు ముఖ్య అతిథిగా పిలిచి ప్రదర్శించాలనుకున్నాం.. కానీ దురదృష్టవశాత్తు ఆయన మనకు దూరమయ్యారు'' అన్నారు. ''బిల్లా' షూటింగ్‌లో కృష్ణంరాజుగారితో ఎక్కువ టైమ్ గడిపే అవకాశం రావడం నా అదృష్టం'' అన్నారు నటుడు అలీ. ''బిల్లా' వంద రోజుల తర్వాత తమిళంలో హీరో విజయ్‌తో ఓ సినిమా చేసేందుకు వెళ్లాను. 'మీ బిల్లా పాటలన్నీ మాకు ఇచ్చేయండి.. ఈ సినిమాలో పెట్టుకుంటాం' అని విజయ్ అన్నారంటే ఆ పాటల క్రేజ్ అలాంటిది'' అన్నారు సంగీత దర్శకుడు మణిశర్మ. ఈ కార్యక్రమంలో పాటల రచయిత రామజోగయ్య శాస్త్రి, నటుడు సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ నిర్మాత కె. మురారి ఇకలేరు



• కాట్రగడ్డ మురారి

ప్రముఖ నిర్మాత కాట్రగడ్డ మురారి (78) శనివారం రాత్రి చెన్నైలో కన్నుమూశారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లా విజయవాడ మురారి సొంత ఊరు. 1944 జూన్ 14న జన్మించారు. ఎంబీబీఎస్ చదువుతున్న సమయంలో సినిమా అంటే ప్రేమతో చెన్నైకి చేరుకున్నారు. తొలుత దర్శకుడు వి. మధుసూదన్ దగ్గర సహాయ దర్శకుడిగా కెరీర్ ప్రారంభించిన మురారి ఆ తర్వాత నిర్మాతగా మారి, యువచిత్ర ఆర్ట్స్ పతాకంపై పలు చిత్రాలు నిర్మించారు. 1978లో కె. విశ్వనాథ్ దర్శకత్వంలో నిర్మించిన 'సీతామహాలక్ష్మి' నిర్మాతగా మురారికి తొలి చిత్రం. ఆ తర్వాత శోభన్‌బాబు కథానాయకుడిగా దాసరి నారాయణరావు దర్శకత్వంలో 'గోరింటాకు', సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో 'జేగంటలు', కృష్ణంరాజు హీరోగా కె. రాఘవేంద్రరావు దర్శకత్వంలో 'త్రిశూలం', దాసరి నారాయణరావు దర్శకత్వంలో 'అభిమన్యుడు', బాలకృష్ణ హీరోగా రెండు చిత్రాలు 'సీతారామ కళ్యాణం', 'నారి నారి నడుమ మురారి', వెంకటేష్ కథానాయకుడిగా కోడి రామకృష్ణ దర్శకత్వంలో 'శ్రీనివాస కళ్యాణం', నాగార్జున హీరోగా 'జానకి రాముడు' వంటి ఉత్తమ చిత్రాలను నిర్మించారు. మురారికి సంగీతం అంటే ఇష్టం. ఆయన నిర్మించిన వాటిలో దాదాపు అన్నీ మ్యూజికల్ హిట్సే. అన్ని చిత్రాలకు కేవీ మహదేవన్ సంగీతదర్శకుడిగా చేశారు. దక్షిణ భారత చలన చిత్ర మండలికి, తెలుగు నిర్మాతల మండలికి గౌరవ కార్యదర్శిగానూ బాధ్యతలు నిర్వర్తించారు. కాగా కె. మురారి సాహితీ ప్రియుడు కూడా. 'నవ్వి పోదురుగాక నాకేంటి' అనే పుస్తకం రచించడంతో పాటు 'తెలుగు చలనచిత్ర నిర్మాతల చరిత్ర' (1931-2005)కు సంపాదకుడిగా వ్యవహరించారు. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ నవయుగ ఫిలింస్ మురారి బాబాయి కాట్రగడ్డ శ్రీనివాస రావుదే. మురారి ముక్కుసూటి మనిషి. నిజాన్ని నిర్భయంగా మాట్లాడే వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి. చెన్నై, నీలాంగరైలో నివసిస్తున్న కె. మురారి శనివారం రాత్రి 8. 55 గంటల ప్రాంతంలో భోజనం చేశాక, గ్యాస్ సమస్య కారణంగా సిరప్పు వేసుకున్నారు. ఆ వెంటనే కార్డియాక్ అరెస్ట్‌కు గురై తుది శ్వాస విడిచారు. పలువురు సినీ ప్రముఖులు ఆయన మృతికి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మురారికి భార్య, కొడుకు-కోడలు ఉన్నారు. ఆయన భౌతికకాయానికి ఆదివారం చెన్నైలో అంత్యక్రియలు జరగనున్నాయి.

సాక్షి పెళ్ళిచూపులు

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



SC మాల/B.Tech/ Govt.Asst. ఇంజినీర్/ట్రాన్స్‌కో/80,000/-PM/5'10" ఎత్తు / 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-14542]

రజక/కట్నం ప్రసక్తి లేదు/B.Tech/C. Govt. ఎలక్ట్రికల్ ఇంజినీర్/ రైల్వే/80,000/-PM/ 5'10"ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-14542]

పద్మశాలి/M.Tech, NIT/SWE/TCS/ 18 Lakhs. PA/5'9"ఎత్తు/28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. Ph: 9908209244 [HA-14542]

యాదవ/కట్నం ప్రసక్తి లేదు/B.Tech/ Govt. AE/ఇరిగేషన్ Dept/80,000/-PM/5'10" ఎత్తు/28 సం॥ల వరునికి అందమైన వధువు కావలెను. Ph: 7842467951, 7075953400 [HA-14542]

క్రిస్టియన్/2వ పెళ్లి/కుల ప్రసక్తి లేదు/ MBBS, MD/డాక్టర్/3 Lakhs PM/ 5'8" ఎత్తు/37 సం॥ల పిల్లలు లేని అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8374801504 [HA-14542]

క్రిస్టియన్ మాల/కట్నం ప్రసక్తి లేదు/ B.Tech/Govt.AEE/ఇరిగేషన్ Dept/ 90,000/-PM/5'10"ఎత్తు/28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-14542]

ఓం గణేషాయ నమః CNB రెడ్డి /35 సం॥/5'9"/MA/ 12.5 లక్షలు నెలకు పెళ్ళి కాని అందమైన వరుడికి మొదటి/ రెండవ వధువు కావలెను. డైరెక్ట్. Ph: 8309834152 [H-776456]

ఓం గణేషాయ నమః CNB/పెళ్ళి కాని బ్రాహ్మణ, 3 Cr ఆస్తి, 45K వరునికి రెండవ, 4 సం॥లలోపు పిల్లలున్న వధువు కావలెను. కెనడా దాస్ డైరెక్ట్. Ph: 9912736916 [H-776456]

SC మాదిగ/కట్నం ప్రసక్తిలేదు/28/ 5'10"/ B.Tech (IIT) G.S.T Officer in Central Excise Customs/ 80,000/- pm, Wellsettled వరునికి తగిన వధువు కావలెను. Ph: 9059470587 [H-776456]

యాదవ/M.Tech/C.Govt. Asst Engineer/ (HPCL)/ 80,000/-pm/5'8"/ ఎత్తు/ 28 సం॥ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 8008965895 [HA-6914]

మాల హిందూ/M.Tech/C.Govt. Asst Engineer (IOCL)/ 85,000/-pm/5'8"/ ఎత్తు/ 28 సం॥ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9866034870 [HA-6914]

మాల క్రిస్టియన్/M.Tech/C.Govt. Scientist (DRDO)/1 Lakh pm/ 5'8"/ ఎత్తు/ 28 సం॥ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9866034870 [HA-6914]

మున్నూరుకాపు/49/5'8"B.Sc/ బిజినెస్, అగ్రికల్చర్ ల్యాండ్స్, వెల్ సెటిల్డ్, డైవర్సీ వరునికి బాధరాబందీలేని కాపు/మున్నూరుకాపు వధువు కావలెను. Ph: 9573943211, 9849555638. [HA-6917]

SC మాల/డైవర్సీ/48/5'7"/ MBA, DME/ C.Govt. Job గల వరునికి తగిన 1వ, 2వ వధువు కావలెను. కుల ప్రసక్తిలేదు. డైరెక్ట్ సంప్ర: 7382130246 [HA-6917]

యాదవ/B.Tech, IT/C.Govt.డిప్యూటీ మేనేజర్/ SBI / 80,000/-PM/ 5'9" ఎత్తు/28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. Ph: 9515755529 [HA-14543]

SC మాల/M.Tech((IT)/Govt. AEE/ ఇరిగేషన్ Dept/14 Lakhs PA/5'9" ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9666887287 [HA-14543]

కాపు/2వ పెళ్లి; 48Y, లెక్చరర్, 1,50,000/- PM Own House గల పిల్లలులేని వరునికి తగిన వధువు కావలెను. Any FC/BC only. Ph: 9701605100 [HA-14543]

రెడ్డి/విడో/45 సం॥ /5'7"/MBA/ బిల్డర్/ కోట్ల ఆస్తి గల రెడ్డి వరుడికి కుల ప్రసక్తి లేని వధువు కావలెను. నో బ్రోకర్స్. డైరెక్ట్. వాట్సాప్: Ph: 9032744799 [HA-14543]

కాపు/CNB35/5'5"/M.Tech/MBA/20 Lakhs. PA/ Hyd/Own House, బెంగుళూర్/20Cr. ఆస్తి/ వరునికి వధువు కావలెను. 1st/2nd OK. వెరీ అర్జెంట్. Ph: 6303293337, 8187053655 (వాట్సాప్) [HA-14543]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Address: 106, A K Enclave, Phase II, 8-2-350, Road No. 3, Banjara Hills (Near Furniture Mall), Hyderabad. Ph: 9849321309 / 9347807015. PLEASE CHECK MY WHATSAPP STATUS. Email: koreddy43@gmail.com, Facebook.com/koreddymarriagebureau

వధువు కావలెను

Reddy/B.Tech/(VIT)/MS/H1/USA/ Now in Hyd/1994/6'/135K/15Cr * Cont: K.C. Reddy- Mar-Bur- Hyd.-B.Hills- Ph: 9849321309/ 9347807015

Reddy/ Business/ B.Tech/ MBA/ Very Handsome Boy/ 1995/ 6'/ Jubli Hills - Hyd/ 100Cr. * Cont : K.C. Reddy, Hyd. Ph:9849321309

Reddy/ B.Tech/ Business/ 1992/ 5'10"/ 300Cr * Cont: K.C. Reddy, Mar-Bureau- Road No. 3, B.Hills- Hyd. Ph:9849321309/ 9347807015

Reddy/B.Tech/Business/1990/6'/1000 Cr. *1989/5'11"/500Cr. *1992/6'/ 100Cr. *1994/5'9"/250Cr. * Cont: K.C.Reddy- Hyd. Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/Business/Royal Family/1994/5'11"/250Cr. *1988/5'11" / 100Cr. *1997/6'/300Cr. * Cont: K.C. Reddy- Hyd-Ph: 9347807015

Reddy/B.Tech/MS/Job/Hyd/1994/ 5'8"/Father Bureaucrat/ 200Cr. * Cont: K.C. Reddy, Road No.3, B.Hills- Hyd. Ph:9849321309/ 9347807015

Reddy/Very Handsome Boy/B.Tech (VIT) MBA(IIM)/ 1993/6'/50Cr/ Business/ (No Dowry) Cont: K.C. Reddy- Hyd. Ph: 9347807015/ 9849321309

Reddy/B.Tech/NIT/1992/5'11"/18L/yr/50Cr. * Cont: K.C. Reddy- Mar-Bureau/Road No.3, B.Hills/ Hyd. Ph: 9849321309/9347807015

Reddy/MBBS/PG.DM/MCH/1993/5'10"/ 50Cr. *1994/5'10"/25Cr. *1995/5'10"/ 300 Cr. * 1994/5'9"/50Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph:9849321309/ 9347807015

Reddy/B.Tech/MS/USA/Very Handsome Boy/1997/6'/300Cr/25 Lakhs/ M/ Rental income. * Cont : K.C. Reddy - Hyd. Ph: 9849321309/9347807015

వరుడు కావలెను

Reddy/(Divorcee) BPT/ MPT/ USA/H1/ i140/ Most Beautiful/ 1987/5'3"/200K/ 9Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/ MBA/Most Beautiful/(Father Burocrat)/1995/5'5"/70Cr * Cont: K.C. Reddy-Mar-Bureau- Hyd. Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/MS/H1/USA/Most Beautiful/1996/5'9"/100Cr. * Cont: K.C. Reddy-Mar-Bureau-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/ B.Tech/ 1994/ 5'6"/ 100Cr * 1995/ 5'8"/ 100Cr. * Cont: K.C. Reddy- Mar-Bureau-Road No.3, B.Hills- Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/ MS/ INDIA/ 1995/ 5'7"/ 150Cr. * 1996/ 5'5"/ 120Cr * Cont: K.C. Reddy-Mar-Bureau-B.Hills- Hyd. Ph: 9849321309/9347807015

Reddy/ MBA/ 1998/ 5'5"/ 100Cr. * 2000/ 5'5"/ 100Cr. * Cont: K.C. Reddy-Mar-Bureau-B.Hills- Hyd. Ph: 9849321309/9347807015

Reddy/ MS/ INDIA/ 1994/ 5'3"/ 200Cr/ * MBA/ 1988/ 5'3"/ 200Cr * Cont: K.C. Reddy-Mar-Bureau- Hyd. Ph: 9849321309/9347807015

Reddy/MBBS/1998/5'7"/50Cr. *1996/5'8"/40 Cr. *1999/5'4"/200Cr. *1995/5'2"/50Cr. * PG/1995/ 5'7"/20Cr. *1995/5'5"/50Cr. *1997/ 5'3"/25Cr. * Cont: Ph: 9849321309

Reddy/MBBS/PG. *1994/5'3"/75Cr. *1993/ 5'3"/50Cr. *1990/100Cr. *1993/5'7"/100Cr. *1994/5'4"/50Cr. *1994/5'10"/50Cr. *1996/ 5'4"/50Cr. Cont: K.C.Reddy. Ph: 9849321309

Reddy/B.Tech/ MS/ USA/1997/5'5"/10Cr. *1996/5'8"/15Cr. 1996/5'7"/50Cr. 1990/ 5'8"/100Cr. 1996/5'5"/15Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

[D-416]

నాయిబ్రాహ్మణ/B.Tech/C.Govt.Asst.మేనేజర్/SBI/78000/-PM/ 5'10" ఎత్తు/28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9581317506 [HA-14543]

క్రిస్టియన్ మాల/MBBS/ Govt. డాక్టర్/80,000/-PM/5'8"ఎత్తు/30 సం॥ల వెల్ సెటిల్డ్ వరునికి వధువు కావలెను. Ph: 8790016395 [HA-14543]

కమ్మ : M.Tech/C.Govt టెక్నికల్ ఆఫీసర్/DRDO/ 70,000/- pm, 5'-11" ఎత్తు. 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. సంప్ర: 6309319756 [H-6915]

SC హిందుమాల : MBA/C.Govt మేనేజర్/యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా/ 1LAKH P/M, '6" ఎత్తు. 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. సంప్ర: 9618007652 [H-6915]

క్రిస్టియన్ మాదిగ : B.Tech/ C Govt. Asst. మేనేజర్/కెనరాబ్యాంక్/ 75,000/- P/M, 5'-10" ఎత్తు. 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. సంప్ర: 9966760501 [H-6915]

మాల : MBBS; MD (Gen.Med.) DM(Neuro), 5'8 / 31 Y/ 10 Cr. / సొంత ప్రాక్టీస్ చేస్తున్న వరునికి కొరకు అర్జంట్‌గా సంప్రదించండి. సెల్ : 81065 01199, 92484 94810. [M-222]

మాల 26 Yrs. B.Com., Pvt. Job, 1st Marr. మంచి గుణం. Any Caste 1, 2 వధువు పర్వలేదు. Age : 20-35 ok. 3 to More Cr. ఉండాలి. Cont. Whatsapp 8985113626 [Y-772685]

రెడ్డి/30y/M.Tech/ Govt. ఆఫీసర్ పంచాయతీరాజ్/ 1 లక్ష pm, V. Fair, వెల్‌సెటిల్డ్ వరుడికి వధువు కావలెను. Ph: 8125176300 [H-778866]

2వ పెళ్ళి/కుల పట్టింపులేదు/40y/ MBBS, MD/ Govt. డాక్టర్, 3 లక్షలు pm, V. Fair, వెల్‌సెటిల్డ్ వరుడికి వధువు కావలెను. Ph: 8519990447 [H-778866]

2వ పెళ్ళి/కుల ప్రసక్తిలేదు/50y/ Govt. ఆఫీసర్ (DE), 3 లక్షలు pm, V. Fair, వెల్‌సెటిల్డ్ వరుడికి వధువు కావలెను. (పిల్లలున్నా Ok) Ph: 7729937291 [H-778866]

మాదిగ BC-C/27 Year/5.8/ B.Tech, EEE / Ware Software ఇంజనీర్ MNC / 13LPA జీతం గల వరునికి క్రైస్తవ సంప్రదాయ వధువు కావలెను. సంప్ర: 8179472119, 7382908400 [P-749585]

2వ పెళ్ళి/కుల ప్రసక్తిలేదు/45y/PG/ Govt. ఆఫీసర్ (ADE), 2 లక్షలు PM, పిల్లలులేని తెల్లని అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి వధువు కావలెను. (పిల్లలున్నా Ok). Ph: 7729937291 [H-778866]

REDDY, 27/5'9"/MBA/Rich/3 Cr P/A/ Hyd. Seeks Bride, Any Degree Good Looking. Cont- Prabhakar Reddy. Ph: 9391198332 [HA-6917]

★★

SC మాల క్రిస్టియన్ వయస్సు 50 సం॥లు, 2nd, మేచ్, లెక్చరర్, MA B.Ed. నెలకు 40 వేలు జీతం . బాగా ఆస్తి వున్న వరుడుకి వధువు కావలెను. డైరెక్ట్ ✆ : 98769 82230 [R-1493]

డైరెక్ట్/40/5.5/M.com,B.Ed/Own Shop ఉన్న వరుడికి కుల, వయసు, ఆస్తి ప్రసక్తి లేని వధువు పెళ్ళి లేదా తోడు కొరకు కావలెను. ఇల్లరికం అయిన OK. డైరెక్ట్: 83417 12438 [L-775615]

కుల పట్టింపు లేదు/రెడ్డి/కమ్మ/చౌదరి వరులకు 18 సం॥ల నుండి 60 సం॥ల మొదటి/రెండవ వధువులు కావలెను. Ph: 6305115254 Whatsapp, 9177213306 [HA-5205]

వధువు కావలెను: పెద్దసంపద మరియు వ్యాపారములో భాగస్వామ్యం కలిగి మోచేతి కర్రల సాయముతో నడుస్తూ, మరే యితర లోపము లేని 37 సం॥ ఆర్యవైశ్య అబ్బాయికి వధువు కావలెను. కట్నప్రసక్తి లేదు. పేదవారైననూ, వితంతువులైననూ ఆమోదిస్తాము. పెండ్లి మేమే చేస్తాము. బ్రాహ్మణులకు, ఆర్యవైశ్యులకు ప్రాధాన్యత ఇవ్వబడును. ✆ 94402 66029 [O-771643]

వరుడు కావలెను



రెడ్డి/కుల, ఆస్తి పట్టింపులేదు/ వ్యాపారం, ఉద్యోగం, కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకి 1వ, 2వ వరుడు కావలెను. ఇల్లరికం Ok. ముఖాముఖి కల్పించబడును. Ph: 8897738058 [H-776355]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి (Now-Hyd) 30, 5' 11", 138 K, BE, MS, H1, Handsome, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 50 Crores, 29, 5' 7", Business, 3 Cr P/A, Handsome Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Doctor, Residency USA, 32, 5' 10", Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, MBA, 42, 5'10", 165 K, 50 Crores.Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి MBBS, MS, 27, 5' 8", Rich Family, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Law, 25, 5' 8", Hyd, Fair& Slim, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, 25, 5' 8", Doctor, 10 Crores, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 26, 5' 4", 25 Crores, Fair & Slim, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి MBBS, MD, 27, 5' 11", Doctor, 2.3 L P/A, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి USA BE, MS, H1, I140, Software, 130 K, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, MS, USA, Citizen, 200 K, 33, 6'. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 28, 5' 8",10 L P/A, 75 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BS, USA Citizen, 28, 5' 2", Rich Family, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, Genpact, 75,000 P/M, 28, 5' 2", Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE,MS, 26, 5' 6", 3 Crores, Fair & Slim, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 27, 5' 5", Rich Family, USA, Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

No Caste Bar/ 1వ, 2వ, 1 కోటి నుండి 100 కోట్ల ప్రాపర్టీ గల వధువులు కలరు. వారికి తగిన వరులు కావలెను. ఇల్లరికం Ok త్వరగా చూసుకునే వారి కోసం మాత్రమే. Ph: 7794960803 [H-776355]

క్రిస్టియన్/2వ పెళ్లి/కుల ప్రసక్తి లేదు/ B.Tech/SWE/60,000/-PM/5'4" ఎత్తు/33 సం॥ల అందమైన పిల్లలు లేని వధువుకు వరుడు కావలెను. Ph: 8374801504 [HA-14542]

క్రిస్టియన్ మాల/B.Tech/SWE/10 Lakhs. P.A/5'5" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు SWE/Govt. ఎంప్లాయి వరుడు కావలెను. Ph: 7396369922 [HA-14542]

వడ్డెర/B.Tech/SWE/60,000/-PM/ 5'4"/ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 8341650195 [HA-14542]

క్రిస్టియన్ మాల/50 లక్షల ఆస్తి/B.Tech/ C.Govt.Asst.మేనేజర్/ కెనరా బ్యాంక్/ 55,000/-PM/5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6309258463 [HA-14542]

రజక/CA/Govt.అకౌంటెంట్/40,000/- PM/5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 7075953400, 7842467951 [HA-14542]

వడ్డెర/B.Tech/Govt.క్లర్క్/SBI/30,000/- PM/5'4"ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 7842467951, 7075953400 [HA-14542]

పద్మశాలి/విడో/60y/Fair / LIC Job/2 వాటాల ఇల్లు/సాంప్రదాయ వధువుకు మంచి కుటుంబానికి చెందిన మధ్య తరగతి వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. Ph: 9133521622 [H-784739]

వైశ్య/55y/విడో/5'3"/సెంట్రల్ గవర్నమెంట్ జాబ్/80K/PM/2 సొంత ఇళ్ళు/బిజినెస్/ 1L/PM ఆస్తి కుల పట్టింపులేని వధువుకి వరుడు కావలెను. Ph: 7396744919 [H-784739]

కమ్మ/విడో/55y/5'5"/V.Fair/Govt.Job/సొంత ఇల్లు & రెంట్స్/ఆంధ్రాలో 22 ఎకరాల పొలం/3L/PM ఆదాయం ఏ బాదరబందీలేని వెల్ సెటిల్డ్ సాంప్రదాయ వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తిలేదు. Ph: 7287079096 [H-784739]

బ్రాహ్మణ్/విడో/తెల్లని ఛాయ/58y/Govt పెన్షనర్/సొంత ఇల్లు/పిల్లలులేని ఉన్నత కుటుంబానికి చెందిన వధువుకు కులప్రసక్తి లేని వరుడు కావలెను. Ph: 9490470558 [H-784739]

కుల ప్రసక్తి లేని/59y/విడో/ప్రభుత్వ ఉద్యోగి/ సొంత ఇల్లు. ఆంధ్రా, తెలంగాణలో ప్రాపర్టీస్ కలిగిన వధువుకి ఏ బాదరబందీలేని వరుడు కావలెను. ఇల్లరికం OK. Ph: 9492213360 [H-784739]

వైశ్య/51y/విడో/5'5"/Own Shop/ VRS సొంత ఇల్లు గల వధువుకి వరుడు కావలెను. కుల, ఆస్తి పట్టింపులేదు. Ph: 9121433952 [H-784739]

కుల పట్టింపు లేదు/విడో/46y/రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఇంజినీర్/1.5L PM/Own House, పొలాలు/కోట్ల ప్రాపర్టీ గల ఆర్థికంగా స్థిరపడిన వధువుకు వరుడు కావలెను. Ph: 9502291405 [H-779959]

కుల పట్టింపు లేదు/విడో/59y/Fair/ఆంధ్ర/ Govt. Rtd/పెన్షనర్ 40K PM/Real Estate, Lands/ Own House పిల్లలులేని ఏ బాదరబందీలేని ఏకైక వధువుకు FC/BC ఇల్లరికం వరుడు కావలెను. Ph: 8519980423 [H-779959]

SC మాల/23y/5'5"/B.Tech(NIT)/ SWE/TCS/50,000/-PM అందమైన వెల్ సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 7095019114 [H-779959]

కుల పట్టింపు లేదు/విడో/48y/5'4"/PG/ Govt. Job/ VRS/50,000/-PM/Own House. Business, Lands/3L PM/కోట్ల ప్రాపర్టీ గల వధువుకు FC/BC ఇల్లరికం వరుడు కావలెను. పిల్లలున్నా OK. Ph: 7036603281 [H-779959]

రెడ్డి/డైవర్సీ/27y/5'5"/కాటన్ బిజినెస్/ కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకి కుల పట్టింపులేని వరుడు కావలెను. Ph: 6309354756 [H-776456]

రెడ్డి/28y/5'4"/ Unmarried/ గవర్నమెంట్ స్టాఫ్ నర్స్/ కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకి కుల పట్టింపులేని వరుడు కావలెను. Ph: 9849319880 [H-776456]

యాదవ/B.Tech/C.Govt. Officer (Income Tax Dept)/ 55,000/-pm/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 8008965895 [HA-6914]

మాల హిందూ/B.Tech/C.Govt. Asst. Manager (SBI)/ 50,000/-pm/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 9866034870 [HA-6914]

శ్రీ శ్రీరస్తు-శుభమస్తు మ్యారేజ్ బ్యూరో (ప్రభాకర్ రెడ్డి)

శ్రీ శ్రీరస్తు-శుభమస్తు (Only Reddy's) Branches: (Hyderabad, Vijayawada, Vizag రెడ్డీస్ : రిచ్ ఫ్యామిలీస్: డాక్టర్స్/ సాఫ్ట్‌వేర్స్/బిజినెస్/Govt./Civils All ఇండియా USA/UK/కెనడా/ ఆస్ట్రేలియా/సింగపూర్/ సంబంధాలు కలవు. సంప్ర: Mobiles: 9059189869, 9100454789

వధువు కావలెను

రెడ్డి/1990/5'11"/M.Sc Chemistry/500Cr Property/Own Pharma Company గల వరుడికి తగిన వధువు కావలెను. సంప్రదించండి : Ph: 9100454789

రెడ్డి/1994/5'10"/MBBS/Own Pharma Company/ 200Cr Property గల వరుడికి బిజినెస్ or మంచి ఫ్యామిలీ నుండి వధువు కావలెను. సంప్రదించండి : Ph: 9100454789

రెడ్డి/డైవర్సీ/1986/5'10"/MS Orthopedic/Own Clinic/20Cr/ గల వరుడికి డాక్టర్స్ (or) Graduation (or) Post Graduation వధువు కావలెను. సంప్రదించండి : Ph: 9100454789

రెడ్డి/డైవర్సీ/1988/5'9"/M.Tech/Own Business/200Cr గల వరుడికి 1వ, 2వ వధువు కావలెను. సంప్రదించండి : Ph: 9100454789

రెడ్డి/డైవర్సీ/1991/5'11"/MS Engg/ USA/I-140/40Cr Property/250 USD గల వరుడికి ఇండియా (or) USA 1వ, 2వ వధువు కావలెను. సంప్రదించండి : Ph: 9100454789

రెడ్డి/1992/5'9"/MS/(Engg)USA/50Cr Property ప్రాపర్టీ గల వరుడికి India (or) USAలో ఉన్న వధువు కావలెను. సంప్రదించండి : Ph: 9100454789

రెడ్డి/1995/6'2"/MS/Own Business/ 100Cr Property గల వరుడికి డాక్టర్ వధువు కావలెను. సంప్రదించండి : Ph: 9100454789

రెడ్డి/1989/5'10"/Mch Surgical Ancology/ 20Cr Property గల వరుడికి Doctor /Well Settled వధువు కావలెను. సంప్రదించండి : Ph: 9100454789

రెడ్డి/1994/5'8"/Mch Gasstro/30Cr Property గల వరుడికి MBBS/MD/ MA/ Any. Well Settled వధువు కావలెను. సంప్రదించండి: Ph: 9100454789

రెడ్డి/USA/1989/6Feet/MS Engg/H1 B/ 90Cr Property గల వరుడికి ఇండియా (or) USAలో వధువు కావలెను. సంప్రదించండి : Ph: 9100454789

వరుడు కావలెను

రెడ్డి/1997/5'4" / BBA/50Cr గల వధువుకి Business (or Software వరుడు కావలెను. సంప్రదించండి : Ph: 9059189869

రెడ్డి/USA/1992/5'5"/MS Engg/ H1B/ 120K గల వధువుకి Software (or) Business USAలో ఉన్న వరుడు కావలెను. సంప్రదించండి : Ph: 9059189869

రెడ్డి/USA/1996/5'8"/MS Engg / H1 B/ 150Cr గల వధువుకి Good Education గల USA లో ఉన్న వరుడు కావలెను. సంప్రదించండి : Ph: 9059189869

రెడ్డి/Divorce/USA/1993/5'6"/MBA/H1 B/150K/USAలో ఉన్న అమ్మాయికి USAలో ఉన్న వరుడు కావలెను. సంప్రదించండి : Ph: 9059189869

రెడ్డి/Divorce/USA/1988/5'7"/MS Engg /H1B/120K గల వధువుకి USA లో ఉన్న 1వ, 2వ వరుడు కావలెను. సంప్రదించండి : Ph: 9059189869

రెడ్డి/1991/5'2"/MBBS/150Cr గల వధువుకి Super Speciality Doctors (or) Well Settled, Business వరుడు కావలెను. సంప్రదించండి : Ph: 9059189869

రెడ్డి/1996/5'5"/MD / General Medicine/ 100Cr గల వధువుకి Super Speciality చేసిన Doctor వరుడు కావలెను. సంప్రదించండి : Ph: 9059189869

రెడ్డి/1998/5'6"/B.Tech/400 Cr/Own Company గల వధువుకి Own Companies ఉన్న Well Rich వరుడు కావలెను. సంప్రదించండి: Ph: 9059189869

రెడ్డి/1986/5'4"/MD Radiology/10Cr గల వధువుకి MD/MS (or) Business వరుడు కావలెను. సంప్రదించండి : Ph: 9059189869

రెడ్డి/1994/5'6"/B.tech MBA/200Cr గల వధువుకి Business (or) Job 200Cr above ఉన్న వరుడు కావలెను. సంప్రదించండి : Ph: 9059189869

[H-783590]

మాల క్రిస్టియన్/B.Tech/C.Govt. Asst. Manager (Canara Bank)/ 60,000/-pm/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 9866034870 [HA-6914]

కుల పట్టింపు లేదు/37/5'6"/B.Tech/MS USA/ H1B. * 27/5'6"/MBBS/MD. * 31/5'4"/B.Sc Nursing/ PG.Dip/Government/Chr/29/5'5"/MBA/CHR/Pvt Emp. అమ్మాయిలకు తగిన అబ్బాయిలు కావలెను. సంప్ర: శుభమస్తు DSNR:Hyd S.రాములు గౌడ్ Ph: 8790690309 [H-7831740]

రెడ్డి/30/5'5"/విడో/ కుల, ఆస్తి ప్రసక్తిలేదు, డిగ్రీ, బిజినెస్ గల అందమైన వధువుకు వరుడు కావలెను. (ఇల్లరికం Ok). సంప్ర: 9100717575 [HA-6917]

BC/39/5'4"/ డిగ్రీ, Hydలో సొంత ఫ్యాక్టరీ/ బంగ్లా, బాగా స్థిరపడిన అందమైన విడో వధువుకు, బాధరాబందీలేని ప్రొఫెషనల్ వరుడు కావలెను. Ph: 9573943211, 9346929647 [HA-6917]

కమ్మ/కుల పట్టింపులేదు/55 years/ 2nd మ్యారేజ్, ఇల్లరికం Ok/ 5'4"/ ఫెయిర్/Govt. జాబ్, 95 K pm/ స్వంత ఇల్లు గల వధువుకి వరుడు కావలెను. Ph: 8919882974 [HA-6917]

క్రిస్టియన్ మాల/ B.Tech/Govt.బ్యాంక్ మేనేజర్/బ్యాంక్ ఆఫ్ బరోడా/60,000/- PM/5'4"ఎత్తు/28 సం॥ల అందమైన వధువుకు SWE/Govt వరుడు కావలెను. Ph: 8790016395 [HA-14543]

బ్రాహ్మణ/27/5'4"/ ఇంటర్. *31/5'3"/B.Com. *35/5'3"/ఇంటర్ కట్నాలు ఇవ్వకోలేని వధువులకు వరులు కావలెను. అన్ని శాఖల/వయస్సుల వారికి త్వరగా కుదుర్చబడును. వాట్సాప్: 7815999246 [HA-14543]

మాదిగ/B.Tech (EEE)/C.Govt. డిప్యూటీ మేనేజర్/SBI/5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9515755529 [HA-14543]

బ్రాహ్మణ/35/5'3"/ఇంటర్ సాంప్రదాయ కుటుంబపు వధువుకు తగిన జాబ్/బిజినెస్ వరుడు కావలెను. Ph: 9676812525 [HA-14543]

గౌడ : ఏకైకకుమార్తె /B.Tech/ C. Govt క్లర్క్/SBI బ్యాంక్/, 42,000/- PM, 5'-5"ఎత్తు 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. సంప్ర: 9908222406 [H-6915]

యాదవ : M.Tech/ Govt. Asst. ఇంజనీర్/జన్‌కో/ 80,000/- PM, 5'-5" ఎత్తు, 25సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. సంప్ర: 9618008271 [H-6915]

క్రిస్టియన్ మాల : 50 లక్షల ఆస్తి, B.Tech/ Govt. Asst. ఇంజనీర్/RWS/ 50,000/- PM, 5'-5" ఎత్తు, 25సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. సంప్ర: 9618007652 [H-6915]

బ్రాహ్మణ/26/5'3"/ఇంటర్. *29/5'3"/ ఇంటర్. 34/5'4"/B.Sc. *38/5'3"/B.Com అందమైన వధువులకు వరులు కావలెను. బిజినెస్/పురోహితం OK. Ph: 7893005879 [HA-14544]

SC/ఆది ఆంధ్ర / ఇంటర్ /42y/5'3"/లేట్ మ్యారేజ్ వధువుకు Hydలో 50K పైన జీతం జాబ్ ఉన్న అప్పర్ క్లాస్ 1st మ్యారేజ్ వరుడు కావలెను. డైరెక్ట్. Ph: 9502172967 [H-783682]

SC. (సెకండ్ మ్యారేజ్) : MBBS., MS / 5'5" / 28Y / V.Fair, 2 Cr. / 1 Lac. వధువు కొరకు మెడిసిన్, IIT, IIM Govt. వరుడు (అర్జెంట్‌గా) కావలెను. 75699 05551, 92484 94810. [M-222]

రెడ్డి/45y/5'5" ఫెయిర్/ కుల పట్టింపులేదు/MA English/ Govt. జాబ్/ 75K pm, వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ, సొంత ఇల్లు & ల్యాండ్స్ కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం Ok). సంప్ర: 8008474869 [H-776355]

కుల పట్టింపులేదు/45y/5'4"/ Govt. ఎంప్లాయ్, 60K pm, వెల్‌సెటిల్డ్ గల అందమైన వధువుకి లేట్ మ్యారేజ్ & 2nd విడో అయిన వరుడు కావలెను (అర్జెంట్ నో బ్రోకర్స్ డైరెక్ట్). సంప్ర: 7286031653 [H-776355]

రెడ్డి/27y/5'4"/ B.Tech/ 5 కోట్ల స్థిరాస్తి కలిగి తండ్రిలేని అందమైన ఏకైక వధువుకు అర్జెంట్‌గా వరుడు కావలెను. (ఆస్తి, కుల పట్టింపులేదు) Send your Photos What'sapp. 9441145961 [H-776355]

బ్రాహ్మణ/వైదిక/B.Tech/ 25 సం॥/5'4"/ 37K pm/ బ్రాహ్మణ/ వైదిక/36y/25K pm వధువులకు బ్రాహ్మణ వరులు కావలెను. శాఖ పట్టింపులేదు. Ph: 9491168950 [H-776355]

2వ పెళ్ళి/కుల పట్టింపులేదు/35y, MBBS, MD గైనకాలజిస్ట్ Govt. డాక్టర్, 2 లక్షలు PM, V. Fair, వెల్‌సెటిల్డ్ వధువుకి వరుడు కావలెను. Ph: 8519990447 [H-778866]

★★

SC మాల క్రిస్టియన్ 2nd మేచ్, వయస్సు 44 సం॥లు, B.Tech., సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ లక్షరూపాయలు జీతం. వధువుకి వరుడు సాఫ్ట్‌వేర్ కావలెను. డైరెక్ట్ ✆ : 98498 14490 [R-1494]

రజక కన్వర్ట్ క్రిస్టియన్ 27సం॥లు ఎరుపు 5.3హైట్, యం.శాంతిస్వరూపా అందమైన వధువుకు ఉద్యోగము కల్గిన మంచి వరుడు కావలెను. నో బ్రోకర్ డైరెక్ట్. 9912895155 [G-790879]

వేదికలు



సునీతా మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ, లేట్ మ్యారేజస్, డైవర్సిస్, విడోస్, విడోయర్స్, పెన్షనర్లకు అన్ని కులాలవారికి త్వరగా చూపబడును. (స్త్రీలకు ఫ్రీ). Ph: 9110593035 [H-779959]

వెలమ వివాహ వేదిక : MBA 28 వధువునకు, LLM 27 వరునకు, (హైదరాబాద్‌లో సెటిల్ అయిన) సింగపూర్‌లో ఉంటున్న 29 డైవర్సీ వధువునకు వరుడు కావలెను. 9848068336 [H-784685]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ: Rahul, Ph: 8522047149/ Blue Trend Matrimonial (P) Ltd. [H-784689]

నూర్ బాషా ముస్లిం: 32y/ 5'3"/ Opthomology/ 26y/5'1"/MBBS, 27/5'6"/MBBS. 32y/ 5'10"/MDS గల వధూవరుల తగిన సంబంధాల కొరకు సంప్ర: 9948820402, 9640999003 [H-779959]

VEDIKA365.COM వెబ్‌సైట్‌లో బయోడేటా చూపించి ప్రొఫైల్స్ పొందండి. నచ్చితేనే ఫీజు. తక్కువ డిపాజిట్. వివరాలు గోప్యం ప్రతి నెల పరిచయ వేదిక వాలంటీర్స్‌కు స్వాగతం. 8985811875 [H-783588]

కుల పట్టింపులేని వారికి, అన్ని కులాల వారికి, 1st, 2nd లేట్ మ్యారేజ్, నో-ఏజ్-బార్, స్యూటబుల్ మ్యాచ్ వెంటనే సంప్ర @ Hyd: 7981454788, 9247209331 [HA-5541]

Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Rahul, Ph: 8522047149/ Blue Trend Matrimonial (P) Ltd. [H-784689]

కేవలం 500/-కే కమ్మ కాపు, రెడ్డి & అన్ని కులముల వారికి తగిన వివాహ సంబంధాలు చూడబడును. ఈ అవకాశం ఈ నెల 20 వరకు మాత్రమే. సంప్ర: నిశ్చయం మ్యాట్రిమోని Hyd & VJA. వాట్సాప్: 7724029999, 7724039999 [HA-14543]

అన్ని కులములవారికి 1వ, 2వ, లేటు, తోడు, NRI డాక్టర్స్, Govt. ఇంజినీర్స్, Pvt., బిజినెస్, రిటైర్డ్, మంచి వెల్‌సెటిల్డ్ సంబంధాలకై సంప్రదించండి. ఫోన్: 8341454870. [H-778866]

NRI Special-USA, UK, CANADA, AUS పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profiles. Shyam, Ph: 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. [H-784689]

ధృవ మ్యారేజెస్ / అన్ని కులాల వారికి 1 / 2 / విడో/డైవర్సీ తగిన సంబంధాలు చూడబడును. స్త్రీలకు ప్రత్యేకం. Ph: 9949395407 [H-784684]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM/ Est : 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st/ 2nd దేశ/విదేశ సంబంధాలకై సం॥ S.రాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకురాలు: స్వర్గీయ S.శారదాగౌడ్, Ph: 8790690309 [H-784732]

SC మాల హిందువులకు మాత్రమే. B.Tech/ M.Tech /IAS / IPS / MBBS / MD /MCA/Abroad & Govt Job Holders సంప్ర: శ్రీలక్ష్మి మ్యారేజ్ బ్యూరో సాయిరాం. Ph: 8008988513, 9000919182 [H-784774]

వడ్డెర వధూవరుల వివాహ సంబంధాలు కుదుర్చబడును. దేశ, విదేశ తక్షణ సంబంధాల కొరకు సంప్రదించండి. Ph: 9381553423 [HA-14517]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ: Shyam, Ph: 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. [H-784689]

శ్రీ లక్ష్మీ మ్యారేజ్ : అన్ని కులములకు, అన్ని వయస్సుల వారికి 1, 2వ పెళ్ళిళ్ళు, పెళ్ళి కాకుండా ఇతర సమస్యలతో బాధపడుతున్నారా? నో ప్రాబ్లమ్.100% నిజం. సంప్ర : ✆ 80191 90912 [B-762805]

15లో॥ అన్ని కులాల వారికి మీకు తగిన సంబంధాలు చూపించగల పెద్ద సంస్థ రోహిణి. www.rohinimarriages.com, ✆ 94418 29644, 9849058673, 94407 85888 వాట్సాప్ [B-602]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ: Sai Teja, Ph: 7702272594/ Blue Trend Matrimonial (P) Ltd. [H-784689]

Registration Free. మీకు తగిన సంబంధాలు ఉంటేనే Subscription తీసుకోండి. 25 సంబంధాలు కేవలం రూ. 500/- మాత్రమే. www.jeelakarrabellam.com, 98497 44707 [G-675]

రజక వివాహ వేదిక (1994)/ డాక్టర్స్/ ఇంజినీర్స్/ Abroad/ USA/ UK/ B.Ed/ Govt Job సంబంధాలకై సంప్రదించండి ఫోన్: 8106303155/ 9391265304. [H-776456]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Sai Teja, Ph: 7702272594/ Blue Trend Matrimonial (P) Ltd. [H-784689]

High Profiles బిజినెస్, డాక్టర్స్, సాఫ్ట్‌వేర్, గ్రూప్-1,విదేశీ, పొలిటికల్ వార్కి ప్రత్యేక శ్రద్ధతో పెళ్లి సంబంధాలు చూడబడును. పూర్ణమ్యాట్రిమోనీ, తిరుపతి, 7093722724. [T-1640]

★★

OC, BC,SC,ST అన్ని కులములలో క్రిస్టియన్ వివాహ సంబంధముల కొరకు సంప్రదించండి. ఫ్రీ రిజిస్ట్రేషన్, సంబంధం మాట్లాడిన తర్వాత Fees Pay చేయండి. 93920 75379. [B-762806]

మాల, (క్రైస్తవ, హిందూ) M.Tech, MS, MBBS చదువులతో డాక్టర్స్, సాఫ్ట్‌వేర్స్, బ్యాంక్ జాబ్స్ చేస్తున్న అనేక వధూవరుల వివరముల కొరకు kalyanamala.org ✆ 9440545049. [B-1166933]

కళ్యాణ కల్పవల్లి: గుంటూరు అన్ని కులముల వారికి దేశ విదేశీ సంబంధాలకై వెంటనే సంప్రదించండి. Y.రాఘవరెడ్డి. సంప్ర: 93941 10276 [G-784385]

మాల కులస్థులకు మాత్రమే ఫారిన్ సంబందాలు రోజా వారి కూలి, సంప్రదాయ కుటుంబ సంబంధాలు రెడిగా ఉన్నాయి. వధువు వరుడు కావలసిన వారు సంప్రదించండి. 7093366591 [G-782104]

వివాహ వేదిక అన్ని కులాల వారికి 1వ / 2వ / లేటు/విడో/ఒంటరి స్త్రీ/పురుషులకు పెళ్ళి సంబంధములు చూడబడును. సంప్ర॥ 8500153830 [G-782280]

గాంధర్వ మ్యారేజెస్. అన్ని కులముల వారికి వివాహ సంబంధములు చూడబడును. హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, కడప. 8985611100. [T-8234]

Mala - Madiga Christian/Hindu, IAS, IPS, Doctors (PG), Bank PO's, Railways, Govt. Employees, Software (IITs & NITs) ✆ 99497 20682. [T-1645]

కొత్త ఆవిష్కరణలకు నాంది పలకాలి

- పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్
- ముగిసిన యూడైస్ ప్లస్ వర్క్‌షాప్

సాక్షి, అమరావతి: నూతన ఆవిష్కరణలతో విద్యాభివృద్ధికి నాంది పలకాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ అన్నారు. విజయవాడలో జరిగిన యూడైస్ ప్లస్ 47వ రీజనల్ వర్క్‌షాప్ శనివారం ముగిసింది. ఈ వర్క్‌షాప్‌లో ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కేరళ రాష్ట్రాల తోపాటు అండమాన్ నికోబార్ దీవులు, పుదుచ్చేరి నుంచి రాష్ట్ర, జిల్లా ఎంఐఎస్ కో–ఆర్డినేటర్లు పాల్గొన్నారు. ముగింపు సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సురేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం అన్ని రాష్ట్రాలు బాగా కృషి చేస్తున్నాయని, ఆయా రాష్ట్రాల బెస్ట్ ప్రాక్టీస్‌ల ద్వారా కొత్త ఆలోచనలు పంచుకోవాలని అన్నారు. కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ గణాంక ప్రచురణల విభాగం (డీవోఎస్ఈ–ఎల్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వెంకట రమణ హెగ్డే వివిధ రాష్ట్రాల డ్రాప్ ఔట్‌ల వివరాలు, పాఠశాల విద్యలో పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్(పీజీఐ), యూడైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసే పద్ధతుల గురించి వివరించారు. అనంతరం ఆయా రాష్ట్రాల ప్రతినిధులు విద్యాభివృద్ధి కోసం అమలు చేస్తున్న పథకాలు, సాధించిన ప్రగతిని వివరించారు. మన రాష్ట్రంలో అమలు చేస్తున్న 'మన బడి: నాడు–నేడు', 'జగనన్న గోరుముద్ద', 'జగనన్న విద్యాకానుక' పథకాల స్టాల్లు అన్ని రాష్ట్రాల ప్రతినిధులను ఆకర్షించాయి. 'మన బడి : నాడు–నేడు' స్టాల్‌ను వివిధ రాష్ట్రాల ప్రతినిధులు తిలకించి ఈ పథకాన్ని తమ వద్ద కూడా అమలుకు ప్రయత్నిస్తామని వెల్లడించారు.

అది పిల్లి గర్జన..

ఉత్తరాంధ్ర టీడీపీ చర్చా వేదికలో నేతల ఎద్దేవా

- ప్రజా ఉద్యమాన్ని కించపరుస్తూ వ్యాఖ్యలు
- విశాఖపై మరోసారి విషం చిమ్మిన నాయకులు
- సమావేశానికి ఎమ్మెల్యేలు గంటా, గణబాబు డుమ్మా

సాక్షి, విశాఖపట్నం: వికేంద్రీకరణకు మద్దతుగా శనివారం విశాఖలో నిర్వహించిన గర్జన.. పిల్లి గర్జన అని టీడీపీ నేతలు ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి తలకాయ లాంటిది అమరావతి ఒక్కటేనని పునరుద్ఘాటించారు. పాలన రాజధానిగా విశాఖపట్నంకు, ఉత్తరాంధ్ర అభివృద్ధికి వ్యతిరేకంగా ఉత్తరాంధ్ర టీడీపీ నాయకులు 'వైఎస్సార్‌సీపీ బారి నుంచి ఉత్తరాంధ్రను కాపాడుకుందాం' అంటూ టీడీపీ ప్రధాన కార్యాలయంలో చర్చా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. అమరావతిలో రాజధాని 29 గ్రామాలకే పరిమితమని చెబుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు.. విశాఖ రాజధానిని ఎన్ని ఊళ్లకు విస్తరిస్తారని ప్రశ్నించారు. విశాఖ రాజధాని అయితే 151 మంది భూ బకాసురులుగా మారుతారని ఆరోపించారు. మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ వాళ్లు టీడీపీ నేతల్ని ఉత్తరాంధ్ర ద్రోహులని ఎందుకంటున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి తలకాయ లాంటిది అమరావతి ఒక్కటేనని వ్యాఖ్యానించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. ఎలాగైనా సరే ఉత్తరాంధ్రలో అమరావతి పాదయాత్రను విజయవంతం చేయాలని చెప్పారు. మాజీమంత్రి కళా వెంకట్రావు, సీనియర్‌నేత బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ.. విశాఖలో జరిగింది పిల్లి గర్జన అని విమర్శించారు. అమరావతే ఏపీకి రాజధాని అని స్పష్టం చేశారు. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. సీఎం జగన్ శాడిస్ట్ అని వ్యాఖ్యానించారు. మాజీ మంత్రి సుజయకృష్ణ రంగారావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో మూడు రాజధానులు సాధ్యం కాదని వైఎస్సార్‌సీపీ నేతలు గుర్తించాలన్నారు. టీడీపీ నాయకురాలు గ్రీష్మ, పార్టీ నేత కూన రవికుమార్ తదితరులు మాట్లాడారు. కాగా, ఈ సమావేశానికి విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు హాజరు కాకపోవడం చర్చనీయాంశమైంది.

కర్నూలులో ఏఐసీసీ అధ్యక్ష పోలింగ్ కేంద్రం

కర్నూలు (సెంట్రల్): ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ)కి 22 ఏళ్ల తర్వాత జరగనున్న ఎన్నికల్లో భాగంగా ఏపీకి సంబంధించి కర్నూలు వేదిక కానున్నది. కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఏఐసీసీ అధ్యక్ష ఎన్నికల్లో ఏపీకి చెందిన 350 మందికి ఓటు హక్కు ఉంది. వీరి కోసం కర్నూలులో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఓటర్లను కర్నూలుకు తరలిరావాలని పీసీసీ అధ్యక్షుడు ఎస్.శైలజానాథ్ కోరారు. ఏఐసీసీ అధ్యక్ష పదవి కోసం మల్లికార్జున్ ఖర్గే, శశిథరూర్ పోటీ పడుతున్న విషయం తెలిసిందే. కాగా, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ బెంగళూరులో ఓటుహక్కు వినియోగించుకుంటారు. ఈ నెల 18 నుంచి 21 వరకు నాలుగు రోజుల పాటు ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం పట్టణాల మీదుగా పాదయాత్రను కొనసాగిస్తారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో క్యూ కంపార్ట్‌మెంట్లు 32 నిండి.. క్యూలైన్లు ఏటీజీ హెచ్ వద్దకు చేరుకున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 68,675 మంది స్వామి వారిని దర్శించుకోగా 32,533 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. హుండీలో కానుకల రూపంలో భక్తులు రూ.3.82 కోట్లు వేశారు. దర్శనానికి 18 గంటల సమయం పడుతోంది.


నాగార్జున సాగర్‌లో 22 గేట్ల ద్వారా విడుదల అవుతున్న నీరు

మహోగ్ర కృష్ణా

సాక్షి, అమరావతి/శ్రీశైలం ప్రాజెక్ట్/విజయపురి సౌత్: పరీవాహక ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటం, ఎగువన ప్రాజెక్టులన్నీ నిండిపోయి, వచ్చిన వరదను వచ్చినట్టుగా దిగువకు వదిలేస్తుండటంతో ప్రకాశం బ్యారేజ్ వద్ద కృష్ణమ్మ మహోగ్ర రూపం దాల్చింది. ప్రకాశం బ్యారేజ్‌లోకి శనివారం సాయంత్రం 6 గంటలకు 4,53,067 క్యూసెక్కులు వస్తుండటంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. కృష్ణా డెల్టాకు 2,827 క్యూసెక్కులు విడుదల చేస్తూ మిగులుగా ఉన్న 4,50,240 క్యూసెక్కులను బ్యారేజ్ నుంచి సముద్రంలోకి వదిలేస్తున్నారు. ఈ సీజన్‌లో జూన్ 1 నుంచి శనివారం ఉదయం 6 గంటల వరకు వెయ్యి టీఎంసీల కృష్ణా జలాలు సముద్రంలో కలిశాయి.

శ్రీశైలంలోకి కొనసాగుతున్న వరద

శ్రీశైలం ప్రాజెక్టులోకి ఎగువ నుంచి వరద కొనసాగుతోంది. శనివారం సాయంత్రం 6 గంటలకు శ్రీశైలం ప్రాజెక్టులోకి 4,02,786 క్యూసెక్కులు చేరుతుండగా.. స్పిల్ వే 10 గేట్లను 15 అడుగుల మేర ఎత్తి 3,77,160 క్యూసెక్కులు, కుడి, ఎడమ గట్టు కేంద్రాల్లో పూర్తి స్థాయిలో విద్యుదుత్పత్తి చేస్తూ 65,643 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తుండటంతో నాగార్జునసాగర్, పులిచింతలలోకి వరద ఉద్ధృతి పెరుగుతోంది. సాగర్, పులిచింతలలోకి వచ్చిన వరదను దిగువకు వదలిలేస్తుండటంతో ప్రకాశం బ్యారేజ్‌లోకి వరద ఉద్ధృతి కొనసాగుతోంది.

ఎగువన తగ్గుతున్న వరద..

పశ్చిమ కనుమల్లో వర్షాలు తగ్గడంతో ఎగువన ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌లలోకి వచ్చే వరద తగ్గింది. దీంతో ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌ల స్పిల్ వే గేట్లను మూసివేశారు. తుంగభద్ర, భీమా నదుల్లోనూ వరద తగ్గింది. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి శ్రీశైలంలోకి చేరే వరద తగ్గనుంది.

విజయవాడకు ముంపు భయం లేదిక

ప్రతి ఏటా కృష్ణా నది వరదల సమయంలో ముంపు ముప్పును ఎదుర్కొనే విజయవాడ లోతట్టు ప్రాంతాల వాసులకు ఇప్పుడా భయం లేదు. గతంలో ప్రకాశం బ్యారేజ్ నుంచి మూడు లక్షల క్యూసెక్కులు వదిలితే దిగువన విజయవాడలోని కృష్ణలంక నుంచి యనమలకుదురు వరకు లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యేవి. దాంతో ఆ ప్రాంతాల ప్రజలు వణికిపోయేవారు. వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తప్ప మిగిలిన ముఖ్యమంత్రులెవరూ ఈ ప్రాంతాల ప్రజల అవస్థలను పట్టించుకోలేదు. కృష్ణా వరద ముప్పు నుంచి ప్రజలను తప్పించడానికి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో యనమలకుదురు నుంచి కోటినగర్ వరకు కృష్ణా నదికి 2.28 కిలోమీటర్ల పొడవున రక్షణ గోడలు నిర్మించారు. పాదయాత్రలో వైఎస్ జగన్ ఇచ్చిన హామీ మేరకు కోటినగర్ నుంచి తారకరామనగర్ వరకు 1.56 కిలోమీటర్ల పొడవున రూ. 125 కోట్లతో రక్షణ గోడ నిర్మించారు. ఈ పనులను 2021 మే 31న ప్రారంభించి.. రికార్డు సమయంలో పూర్తి చేశారు. ప్రకాశం బ్యారేజ్ నుంచి 12 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేసినా లోతట్టు ప్రాంతాలకు వరద చేరకుండా పటిష్ఠంగా ఈ గోడ నిర్మించారు. దీంతో లోతట్టు ప్రాంతాలైన కృష్ణలంక నుంచి యనమలకుదురు వరకు ప్రజలకు ముంపు ముప్పు తొలగింది. ప్రస్తుతం పద్మావతి ఘాట్ నుంచి కనకదుర్గమ్మ వారధి వరకు కృష్ణా నదికి రక్షణ గోడ నిర్మిస్తున్నారు. దీనికి రూ.135 కోట్లు ఖర్చు చేస్తున్నారు.

పెన్నాలో మరింత పెరిగిన వరద

కర్ణాటక, రాయలసీమలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో పెన్నా, ఉపనదుల్లో వరద ఉద్ధృతి మరింత పెరిగింది. పెన్నా ప్రధాన పాయతోపాటు ఉపనదులు జయమంగళ, కుముద్వతి, చిత్రావతి, పాపాఘ్ని, కుందు, బాహుదా, పించా, సగిలేరు ఉరకలెత్తుతున్నాయి. దీంతో పెన్నాలోకి భారీగా వరద వస్తోంది. శనివారం నెల్లూరు బ్యారేజ్ నుంచి 81 వేల క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారంటే.. పెన్నాలో వరద స్థాయిని అంచనా వేయచ్చు. ఇప్పటికే పెన్నా ప్రాజెక్టులన్నీ నిండుకుండలుగా మారడం, వరద భారీగా వస్తుండటంతో అప్పర్ పెన్నార్ నుంచి నెల్లూరు బ్యారేజ్ వరకు ప్రాజెక్టుల గేట్లన్నీ ఎత్తేశారు. ఒక సీజన్‌లో ప్రాజెక్టుల గేట్లను రెండోసారి ఎత్తేయడం చరిత్రలో ఇదే తొలిసారి.

వైద్య విద్యలో స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు రిజర్వేషన్

- 0.5 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- 2022–23 విద్యా సంవత్సరం నుంచే ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు వర్తింపు
- మార్గదర్శకాలు విడుదల చేసిన హెల్త్ యూనివర్సిటీ

సాక్షి, అమరావతి: వైద్య విద్యలో అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సులు ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల్లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగానికి 0.5 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు హెల్త్ యూనివర్సిటీ శనివారం మార్గదర్శకాలను విడుదల చేసింది. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో రాష్ట్రపతి అవార్డుతోపాటు ఇతర సర్టిఫికెట్ పొందిన అభ్యర్థులకు ఈ రిజర్వేషన్ వర్తిస్తుందని యూనివర్సిటీ అధికారులు తెలిపారు. ఈ రిజర్వేషన్లను 2022–23 విద్యా సంవత్సరం నుంచే అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. నీట్ యూజీ–2022లో ర్యాంకు సాధించిన అభ్యర్థులు ఈ నెల 20వ తేదీలోపు సంబంధిత సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రిజర్వేషన్‌ను వినియోగించుకునేందుకు సంబంధిత సర్టిఫికెట్‌ను అప్‌లోడ్ చేయాలని వివరించారు.

ముగిసిన ఒంగోలు ట్రిపుల్ ఐటీ కౌన్సెలింగ్

వేంపల్లి: ఇడుపులపాయలో నిర్వహించే ఒంగోలు ట్రిపుల్ ఐటీ కౌన్సెలింగ్ ప్రక్రియ శనివారం ముగిసింది. రెండో రోజు కౌన్సెలింగ్‌కు 566 మందికి గాను 496 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆర్‌కే వ్యాలీ క్యాంపస్‌లోని సెంట్రల్ లైబ్రరీలో జరిగిన అడ్మిషన్ల ప్రక్రియను ఒంగోలు, ఆర్‌కే వ్యాలీ డైరెక్టర్లు కసిరెడ్డి సంధ్యారాణి, జయరామిరెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1,082 మందిని కౌన్సెలింగ్‌కు పిలవగా 935 మంది అడ్మిషన్లు పొందారన్నారు. మిగిలిన సీట్లు రెండో విడతలో మెరిట్ విద్యార్థులతో భర్తీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఓఎస్డీ గంగిరెడ్డి, ఏవో మహబూబ్ జిలాని, అకడమిక్ డీన్ రత్నకుమారి, అసోసియేట్ డీన్స్ రోజర్ బిన్ని, భానుమూర్తి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ డిస్కంలకు డైరెక్టర్ల నియామకం

సాక్షి, అమరావతి: ఏపీ తూర్పు, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లకు ప్రాజెక్ట్స్ డైరెక్టర్ల నియామకం ఇంధన శాఖ పూర్తి చేసింది. విశాఖ ప్రధాన కేంద్రంగా ఉన్న ఏపీఈపీడీసీఎల్‌కు సూర్య ప్రతాప్, తిరుపతి ప్ర దాన కేంద్రంగా ఉన్న ఏపీఎస్పీడీసీఎల్‌కు కె.శివప్రసాదరెడ్డిలను డైరెక్టర్లుగా నియమిస్తూ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. డిస్కంల కార్పొరేట్ కార్యాలయాల నుంచి డైరెక్టర్లుగా విధులు నిర్వర్తిస్తూ రెండేళ్ల పాటు వీరు విద్యుత్ వినియోగదారులకు సేవలందించనున్నారు.

కవయిత్రి కొలకలూరి స్వరూపారాణి మృతి



ఒంగోలు మెట్రో: ఒంగోలుకు చెందిన ప్రముఖ కవయిత్రి, 'పద్య కవిత్వ రారాణి' కొలకలూరి (నడకుర్తి) స్వరూపారాణి (80) శనివారం ఉదయం మృతి చెందారు. టీచర్‌గా విధులు నిర్వర్తిస్తూనే స్త్రీవాద దృష్టికోణంతో పలు రచనలు చేశారు. 'చంద్రగ్రహణం', 'నన్నయ మహిళ' వంటి రచనలు చేశారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.